తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

epaper.vaartha.com WWW.VAARTHA.COM

: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

30-9-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 241 పేజీలు: 10+4 వెల: 6.50














ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా మంగళవారం జమ్మూలో ప్లకార్డులతో ప్రదర్శన జరిపిన విద్యార్థులు

## రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ విభజన

### రెండు వేర్వేరు కమిషన్లుగా ఏర్పాటు

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ను రెండుగా విభజించి, ఎస్సీ కమిషన్, ఎస్టీ కమిషన్ గా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందు కోసం కావాల్సిన ప్రక్రియను ప్రారంభించాలని అధికారులకు సూచించింది. ఇప్పటికే జాతీయ స్థాయిలో ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను రెండుగా విభజిస్తూ 89వ రాజ్యాంగ సవరణ చట్టం2003 ద్వారా కేంద్రం గతంలోనే సవరణ చేచేసింది. ఈ సవరణ ద్వారా ఎస్సీ, ఎస్టీ ఉమ్మడి కమిషన్‌ను విడదీసి రెండు వేర్వేరు సంస్థలను ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో రాజ్యాంగంలోని అధికరణ 338 కింద కేంద్ర ప్రభుత్వం జాతీయ ఎస్సీ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. అలాగే రాజ్యాంగంలోని అధికరణ 338ఎ కింద జాతీయ ఎస్టీ కమిషన్ కూడా ఏర్పాటు చేయబడింది. ఈ రెండు వేర్వేరు కమిషన్‌లు 2004 వ సంవత్సరంలో అధికారికంగా అమల్లోకి వచ్చాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రస్తుతం ఉమ్మడిగా కొనసాగుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను విడివిడిగా ఏర్పాటు చేసేందుకు నిర్ణయించినట్లు సమాచారం.

కాగా ప్రస్తుత ఎస్సీ, ఎస్టీ కమిషన్ పదవి కాలం అక్టోబరు చివరిన ముగియనుంది. తర్వాత కమిషన్ ను రెండుగా ఏర్పాటు చేస్తూ లీగల్ వర్క్‌ను ప్రారంభించేందుకు అధికారులు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

## మళ్లీ నోటీసు!

>> ఉపయోగించారు. సెప్టెంబర్ 25న కాంగ్రెస్ ఆధ్వర్యంలో పట్నా, ఛండీగఢ్ సహా పలు రాష్ట్రాల రాజధానుల్లో పెద్ద ఎత్తున నిరసనలు జరిగాయి. సీఈసీ వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ అంశంపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందిస్తోంది. నేడు కాంగ్రెస్ అధినేత మల్లికార్జున ఖర్గే ప్రత్యేకంగా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషిలు ఎస్ఐఆర్ ప్రక్రియ, కొత్త ఓటర్ల నమోదుకు వాడే ఫామ్6 మార్పులు, ఓటర్ల పేర్ల తొలగింపులుచేరికలు, డిజిటల్ డేటాబేస్ నిర్వహణపై పలు అనుమానాలు వ్యక్తం చేశారని ఖర్గే తెలిపారు. ఇది చాలా తీవ్రమైన అంశమని, దీనిపై వెంటనే చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ పట్టుబడుతోంది. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, జైరామ్ రమేష్, కేసీ వేణుగోపాల్ వంటి అగ్రనేతలు ఈ సమావేశంలో పాల్గొని భవిష్యత్ కార్యాచరణను ఖరారు చేయనున్నారు. అంతేకాకుండా, సెప్టెంబర్ 30న న్యూఢిల్లీలో సుమారు 21 విపక్ష పార్టీలు భేటీ అయి సంయుక్త వ్యూహాన్ని, కొత్త తొలగింపు నోటీసు రూపురేఖలను చర్చించనున్నాయి. మరోవైపు విపక్షాలు చేస్తున్న ఆరోపణలను ఎలక్షన్ కమిషన్ గట్టిగా ఖండించింది. కమిషన్ సభ్యుల మధ్య అభిప్రాయభేదాలు ఉన్నంత మాత్రాన సంస్థ పనితీరు దెబ్బతిన్నట్లు కాదని స్పష్టం చేసింది. రాజ్యాంగబద్ధ సంస్థల్లో భిన్నాభిప్రాయాలు సాధారణమేనని, ఎస్ఐఆర్‌కి సంబంధించిన నిర్ణయాలన్నీ ముగ్గురు కమిషనర్ల ఏకగ్రీవ ఆమోదంతోనే జరిగాయని పేర్కొంది. ఫామ్6లో చేసిన మార్పులను సుప్రీంకోర్టు కూడా సమర్థించిందని, చట్టబద్ధమైన నిబంధనల ప్రకారమే నిర్ణయాలు తీసుకుంటున్నామని తెలిపింది. అలాగే ఓటర్లకు ఇబ్బంది కలగకుండా క్లెయిమ్స్ సమర్పించడానికి అదనపు సమయం ఇవ్వడం, అధికారులు స్వయంగా ఇళ్లకు వెళ్లడం, ఓటర్ల తొలగింపు నోటీసులు వచ్చిన వారి కోసం హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టామని వివరించింది.

## వివక్షను అడ్డుకొందాం

>> నాయకుడి సభ అనంతరం హల్ద్వానీలో ʻశుద్ధీకరణ' కార్యక్రమం నిర్వహించడం దళితుల ఆత్మగౌరవానికి సంబంధించిన తీవ్రమైన అంశమని భట్టి పేర్కొన్నారు.ఖర్గేకు జరిగిన ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ రాహుల్ గాంధీ నిరసన చేపడితే, బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సింది పోయి ఆయనపైనే కేసు పెట్టారని భట్టి విక్రమార్క విమర్శించారు. 'అవమానానికి గురైన వ్యక్తికి న్యాయం చేయాలని ప్రశ్నిస్తే ప్రశ్నించిన వారిపైనే కేసులు పెడుతున్నారు. ఇది దళితులు, ఆదివాసీల పట్ల వ్యవస్థలో ఉన్న వివక్షను బయటపెడుతోంది' అని ఆయన అన్నారు. దేశంలో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన కోట్లాది మంది ప్రజలు ఉన్నారని భట్టి పేర్కొన్నారు. వారందరూ సమాన హక్కులు, గౌరవంతో జీవించేలా రాజ్యాంగం కల్పించిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. 'ఎస్సీలు, ఆదివాసీలు, మైనారిటీలు సహా కోట్లాది మందిని రెండో తరగతి పౌరులుగా చూసే పరిస్థితిని మనం అంగీకరించకూడదు. అందరం ఒక్కతాటిపైకి వచ్చి ఆత్మగౌరవం కోసం పోరాడాలి' అని పిలుపునిచ్చారు. దళిత, ఆదివాసీ వర్గాలపై జరిగే వివక్ష, అవమానాలను అరికట్టేందుకు దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందని భట్టి అన్నారు.

## ఇడి వలలో 'అటికా గోల్డ్'

>> మంగళవారం నాడు దక్షిణాది రాష్ట్రాలలోని ఆ కంపెనీ శాఖలపై దాడులు చేశారు. ఈ సందర్భంగా భారీగా నగదు, నగలు, విదేశీ కరెన్సీని జప్తు చేసినట్లు ఈడీ వెల్లడించింది. తాకట్టులో వున్న బంగా రం కొనే నెపంతో దొంగ బంగారాన్ని ఈ సంస్థ భారీగా కొని దండిగా లబ్ది పొందినట్లు ఈడీకి ఆధారాలు లభించాయని తెలిసింది. అటికా గోల్డ్ దక్షిణాది రాష్ట్రాలతో పాటు దేశంలోని అనేక రాష్ట్రాలలో పేరొందిన నగల తాకట్టు సంస్థ. బెంగళూరు కేంద్రంగా 2013లో దీనిని బొమ్మనహాళ్లి బాబు అలియాస్ అయ్యూబ్ అనే వ్యక్తి స్థాపించారు. మంగళవారం నాడు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్నాటకలో 16 చోట్ల ఏక కాలంలో ఈడీ అధికారులు దాడులు చేబట్టారు. మనీలాండరింగ్ చట్టం ఉల్లంఘన కింద ఈ దాడులు నిర్వ హించినట్లు ఈడీ అధికారులు తెలిపారు. హైదరాబాద్, చెన్నై, విశాఖపట్నం, బెంగళూరు నగరాలలో ఈ సంస్థకు భారీగా శాఖలు వుండగా ఇక్కడ దాడులు ఎక్కువగా జరిపారు. దీంతో పాటు సంస్థ నిర్వాహ కులు, షేర్ హోల్డర్లు, డైరక్టర్ల ఇళ్లు, కార్యాలయాలల్లో సోదాలు నిర్వహించా రు. దాడుల సందర్భం గా ఏడు లక్షల 52 లక్షల రూపాయల నగదు, లెక్కలోలేని బంగారు నగలు, విదేశీ కరెన్సీ భారీగా వుండగా వాటిని జ ప్తు చేశారు. దీనికి సంబంధించి సంస్థ యజమాని బొమ్మనహాళ్లి బాబు అలియాస్ అయ్యూబ్‌తో పాటు ప్రమోటర్లు ఓబేదుల్లా మహమ్మద్ సలా మ్రన్, అర్ఫినో తాజ్‌లను ఈడీ అధికారులు విచారించి వాంగ్మూలం నమోదు చేశారు. దీనిపై ఇంకా విచారణ సాగుతోందని ఈడీ వెల్లడించింది.

## రేషన్ కార్డులు రద్దు?

>> తొలగించే చర్యల్లో భాగంగా అనూహ్య నిర్ణయాన్ని అక్టోబరు 1 నుంచి అమలు చేయబోతోంది. ఆరు నెలలుగా రేషన్ సరుకులు తీసుకోని లబ్ధిదారుల కార్డులను తాత్కాలికంగా నిలిపివేయబోతున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా వచ్చే నెలలో దాదాపు 1.58 కోట్ల లబ్ధిదారుల రేషన్ కార్డుల అర్హతలను తాత్కాలికంగా నిలిపివేయడానికి కేంద్రం సన్నాహాలు చేస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. అయితే, లబ్ధిదారుల పేర్లను వెంటనే డేటాబేస్ నుండి పూర్తిగా తొలగించబోరని తొలుత ఆ కార్డులను తాత్కాలికంగా డిసేబుల్ చేస్తారని కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖకు చెందిన ఒక సీనియర్ అధికారి వివరించారు. కార్డులు డిసేబుల్ అయిన లబ్ధిదారులు తాము నిజమైన అర్హులమేనని నిరూపించుకోవడానికి 3 నెలల సమయం ఇవ్వనున్నారు. ఈ మూడు నెలల వ్యవధిలో క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేసుకొని ఇకెవైసి ప్రక్రియను పూర్తి చేస్తే ఆ రేషన్ కార్డులను మళ్లీ యాక్టివేట్ చేయనున్నట్లు తెలుస్తోంది. గత ఆరు నెలలుగా ఎలాంటి బియ్యం లేదా ఆహార ధాన్యాలు పొందని కార్డులను ప్రభుత్వం సైలెంట్ రేషన్ కార్డులుగా వర్గీకరించి ఈ చర్యలకు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది.

డేటాబేస్ ప్రక్షాళన, స్మార్ట్‌పిడిఎస్ నకిలీ, డూప్లికేట్, మరణించిన వ్యక్తుల పేర్లు, అనర్హుల కారణంగా జరుగుతున్న అక్రమాలను గుర్తించి వాటిని అరికట్టేందుకు ప్రభుత్వం ఈ చర్యలకు సిద్ధమైంది. ఆధార్ అనుసంధానం, డిజిటలైజేషన్, ఇకెవైసి వంటి విధానాలను ఉపయోగించి పిడిఎస్ డేటాబేస్‌ను ఇప్పటికే ప్రక్షాళన చేస్తున్నారు. ఈక్రమంలో నవంబరు 2024 నాటికి డిజిటైజేషన్, బయోమెట్రిక్ సీడింగ్, ఇకెవైసి ద్వారా దేశవ్యాప్తంగా దాదాపు 5.8 కోట్ల బోగస్ రేషన్ కార్డులను తొలగించినట్లు ఆహార శాఖ తెలిపింది. ఈచర్యల వల్ల రేషన్ ధాన్యాల వృథా తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

అయితే ఈ విధానంపై పలువురు నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## 3న హైదరాబాద్‌కు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

**హైదరాబాద్,సెప్టెంబరు29,ప్రభాతవార్త:** అక్టోబర్ 3న హైదరాబాద్‌కు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రానున్నారు. ఆ రోజు రాత్రి కాకతీయ హోటల్‌లో బస చేయనున్న చేస్తారు. ఉదయం తూప్రాన్, కరీంనగర్‌లో పలు కార్యక్రమాల్లో పాల్గొనున్నారు. సాయంత్రం బేగంపేట నుంచి దిల్లీకి తిరుగుపయనం కానున్నారు.

### వారం - వర్జ్యం

30-09-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం, చిత్త కార్తె
తి. చవితి మ.2.55, న.భరణి ఉ.7.36
వ.సా.6.49 - రా.8.19
దు.ఉ.11.33 - మ.12.21
రాహు. మ.12.00-మ.1.30
శుభ స. లేదు

### వార్తాఫలం

**మేషం :** ఉన్నత స్థానంలోని వారికి సలహాదారునిగా రాణించే సూచనలు. మిత్రులతో కలిసి ఇష్టాగోష్టిని సాగిస్తారు.

**వృషభం:** మొండి బాకీలను రాబట్టుకోవడానికి చేసే ప్రయత్నాలు కొంత వరకు ఫలిస్తాయి. వాహన యోగం.

**మిథునం :** అవాంతరాలను అధిగమించి కార్యవిజయాలను సాధిస్తారు. సహోదరీ వర్గంతో కలిసి సంభాషణలు సాగిస్తారు.

**కర్కాటకం :** వ్యాపార విస్తరణ అంశాలు కలిసి వస్తాయి. టెండర్స్ అనుకూలిస్తాయి. కార్య విజయాలను సాధిస్తారు.

**సింహం :** కోపాన్ని ఆవేశాన్ని మీ అదుపులో ఉంచుకొనగలిగితే మంచి ఫలితాలనే చాలా వరకు సాధించగలుగుతారు.

**కన్య :** అనాలోచిత నిర్ణయాలు చోటు చేసుకుంటాయి. ఆదాయ వ్యవహారాలు బాగుంటాయి. టెండర్స్ అనుకూలిస్తాయి.

**తుల:** గంటలు గంటలుగా ప్రతి విషయంలోనూ ఆలోచించే విధానాలకు స్వస్తి చెబుతారు. వాహనయోగం.

**వృశ్చికం :** పొరపాటు సమాచారాన్ని విని నిజమని నమ్ముతారు. దుందుడుకుతనం వల్ల నష్టమే తప్ప లాభం ఏర్పడదు.

**ధనుస్సు :** అనుకూలమైన ఉత్తర్వులను అందుకుంటారు. సంతాన పురోగతి బాగుంటుంది. అధిక ధనవ్యయం.

**మకరం :** విధి నిర్వహణలో సంతృప్తిని వ్యక్త పరుస్తారు. రిజిస్ట్రేషన్ పనులు సానుకూల పడతాయి.

**కుంభం :** ఆధునిక కాలానికి తగిన విధంగా వ్యవహార శైలిలో కొన్ని మార్పులను చేయాలని భావిస్తారు.

**మీనం :** ఓదార్పు కలిగే సంఘటనలు చోటు చేసుకుంటాయి. అభిప్రాయ భేదాలు తొలగిపోతాయి.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# గంజా ఘాటు

>> అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో గంజాయి అక్రమ రవాణా పోలీసులకు పెద్ద సవాలుగా మారుతోంది. ముఖ్యంగా ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి గంజాయిని తెలంగాణ, ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న నెట్‌వర్క్‌లపై పోలీసులు వరుసగా దాడులు చేస్తున్నప్పటికీ ఆశించిన మేరకు ఫలితం ఉండటం లేదు. ప్రధానంగా కరోనా పరిస్థితుల తరువాత గంజాయి అక్రమ రవాణా, వినియోగం గణనీయంగా పెరిగిందని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

2018 నుంచి 2024 వరకు ఆంధ్రప్రదేశ్‌లో పోలీసులు, ఎన్‌సిబి, ఎక్సైజ్, పోలీసులు, డిఆర్‌ఐ వంటి దర్యాప్తు సంస్థలు కలిసి 6,14,889 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. ఇదే కాలంలో ఎన్‌డిపిఎస్ కేసులు, అరెస్టులు కూడా గణనీయంగా పెరిగాయి. 2018లో 547 కేసుల్లో 1,319 మంది అరెస్టు కాగా.. 2024లో కేసుల సంఖ్య 1,869కు, అరెస్టుల సంఖ్య 4,692కు చేరింది. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2024లో ఆంధ్రప్రదేశ్‌లో 54,183 కిలోల గంజాయి ఆధారిత మాదకద్రవ్యాలు స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతాలు గంజాయి సరఫరా గొలుసులో ముఖ్యమైన ప్రాంతాలుగా ఉన్నాయి. అటవీ ప్రాంతాల్లో సాగు లేదా సేకరణ తర్వాత రోడ్డు, రైలు మార్గాల ద్వారా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న కేసుల సంఖ్య ఏటా పెరుగుతూ వస్తోంది. 2024 జూన్ నుంచి 2026 ఫిబ్రవరి వరకు విశాఖపట్నం రేంజ్‌లోనే 55,345 కిలోల గంజాయి స్వాధీనం కావడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. హైదరాబాద్‌లో 2025 జూన్ నుంచి 2026 జూన్ వరకు 563 ఎన్‌డిపిఎస్ కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో 2,513 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2025 జనవరి నుంచి 2026 ఫిబ్రవరి వరకు 84 కేసుల్లో సుమారు 6,688 కిలోల గంజాయి పట్టుబడింది. అక్రమ రవాణాతో పాటు గంజాయి వినియోగం కూడా ప్రజారోగ్య సమస్యగా మారుతోంది. హైదరాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ డ్రగ్ ట్రీట్‌మెంట్ సెంటర్‌లో డ్రగ్ అడిక్షన్ కేసులు 2023 నుంచి 2025 మధ్య గణనీయంగా పెరిగినట్లు నివేదికలు తెలిపాయి. ఈ కేసుల్లో మద్యం, పొగాకు తర్వాత గంజాయి కూడా చికిత్స అవసరమైన ప్రధాన పదార్థాల్లో ఒకటిగా వైద్యులు పేర్కొన్నారు. ఒడిశా నుంచి ఆంధ్రప్రదేశ్ మీదుగా తెలంగాణకు, అక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు తరలించే మార్గాలను పోలీసులు గుర్తించి ప్రత్యేక నిఘా పెంచుతున్నారు.

గంజాయి సమస్యను కేవలం పోలీసు చర్యలతోనే పరిష్కరించడం సాధ్యం కాదని నిపుణుల అభిప్రాయం. అక్రమ సాగు నిర్మూలనతో పాటు సరిహద్దు ప్రాంతాల్లో నిఘా, యువతలో అవగాహన, పాఠశాల-కాలేజీ స్థాయిలో డ్రగ్ ప్రివెన్షన్ కార్యక్రమాలు, అవసరమైన వారికి కౌన్సెలింగ్ మరియు పునరావాస సేవలు సమాంతరంగా కొనసాగాల్సిన అవసరం ఉంది.గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నప్పటికీ.. వినియోగాన్ని అరికట్టడం, యువతను దాని బారిన పడకుండా కాపాడటం ఇప్పుడు ఏపీ-తెలంగాణకు మరో కీలక సవాలుగా మారింది.

**అక్రమ రవాణతో భారీగా ఆదాయం**

గంజాయిని కిలోకు సుమారు 3 వేల నుంచి 5 వేల రూపాయలకు కొనుగోలు అక్రమ మార్గాల్లో నగరాలకు తరలించి సుమారు 12 నుంచి 20 వేల రూపాయల వరకు విక్రయిస్తారు. అయితే గంజాయిని చాక్లెట్ల రూపంలోనో, మిఠాయిలుగానో మార్చినప్పుడు ఒక్కొక్క కిలోకు 30 నుంచి 35 వేల రూపాయలు లభిస్తాయి. గంజాయి రవాణాకు రోడ్లు, రైల్వే వంటి అనేక మార్గాలను స్మగ్లర్లు ఎంచుకుంటున్నారు. ఏపీ-ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి ప్రారంభమయ్యే సరఫరా నెట్‌వర్క్.. ఏపీ మీదుగా తెలంగాణకు చేరి, అక్కడి నుంచి మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాలకు వెళ్లే ఘటనలు వరుసగా వెలుగులోకి వస్తున్నాయి. ఏజెన్సీ ప్రాంతాల నుంచి మొదలు ఏపీ-ఒడిశా సరిహద్దు ప్రాంతాలు గంజాయి సరఫరాలో కీలకమైన ప్రాంతాలుగా పోలీసు దర్యాప్తుల్లో కనిపిస్తున్నాయి. పోలీసు నిఘా పెరగడంతో స్మగ్లర్లు కొత్తకొత్త మార్గాలను అన్వేషిస్తున్నారు. పుష్ప సినిమాలో గంధం దంగలను తరలిస్తున్న మాదిరిగానే కొత్త పద్ధతుల్లో అక్రమ రవాణా చేస్తున్నారు. కార్లు, వ్యాన్లు, లారీలు, ట్రక్కులు వంటి వాహనాల్లో భారీగా గంజాయి తరలిస్తున్న కేసులు వెలుగుచూస్తున్నాయి. అదేవిధంగా రైల్వే మార్గాలను ఉపయోగిస్తున్న నెట్‌వర్క్‌లపై కూడా పోలీసులు నిఘా పెంచారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో జూలైలో 41.131 కిలోల గంజాయి పట్టుబడింది. ఇది ఒడిశా నుంచి హైదరాబాద్ మీదుగా నాగ్‌పూర్‌కు వెళ్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రైవేట్, ప్రభుత్వ బస్సుల ద్వారా కూడా గంజాయి తరలించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. 2026లో ఒడిశా నుంచి హైదరాబాద్‌కు వస్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సులో 41 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. హైదరాబాద్‌కు ఏపీ, మహారాష్ట్ర, కర్ణాటకతో ఉన్న రహదారి, రైల్వే అనుసంధానం కారణంగా నగరం కొన్ని అంతర్రాష్ట్ర మాదకద్రవ్య రవాణా కేసుల్లో మధ్యంతర ట్రాన్సిట్ కేంద్రంగా కనిపిస్తోంది. దీనితో పోలీసులు రహదారులు, రైల్వే స్టేషన్లు, బస్‌స్టేషన్లపై నిఘా పెంచుతున్నారు. ఏపీ మీదుగా కాకుండా ఇతర రాష్ట్రాల మీదుగా హైదరాబాద్ చేరే విధంగా స్మగ్లర్లు రవాణా చేస్తున్నారు. దీని నేపథ్యంలో అంతర్రాష్ట్ర పోలీసు సమన్వయం, టెక్నాలజీ ఆధారిత నిఘా, వాహన తనిఖీలు పెరుగుతున్నాయి. మొత్తంగా.. గంజాయి రవాణా ఒకే మార్గానికి పరిమితం కాకుండా రోడ్డు-రైలు-బస్సు మార్గాల్లో విస్తరించడం పోలీసులకు కొత్త సవాలుగా మారింది. ఏపీ ఏజెన్సీ ప్రాంతాల నుంచి ప్రారంభమయ్యే సరఫరా గొలుసును మూలంలోనే అడ్డుకోవడంతో పాటు, తెలంగాణను ట్రాన్సిట్ మార్గంగా ఉపయోగించే అంతర్రాష్ట్ర నెట్‌వర్క్‌లపై నిఘా కీలకంగా మారింది.

గంజాయి వినియోగాన్ని నిర్మూలించేందుకు కేవలం పోలీసులు, ఇతర నిఘా సంస్థల చర్యలు మాత్రమే సరిపోవని సైకాలజిస్టులు స్పష్టం చేస్తున్నారు. పోలీసు చర్యలతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు రావాలని, గంజాయి సేవించడం వల్ల కలిగే అనర్థాలను యువతకు తెలుపుతూ సమాజాన్ని మేలుకొలపాలని పేర్కొంటున్నారు. అదేవిధంగా డ్రోన్లు, ఇతర శాటిలైట్ విధానాలను అనుసరించి గంజాయి సాగును పూర్తి స్థాయిలో నిర్మూలించాలని సూచిస్తున్నారు. వృత్తివిద్యా కళాశాలల్లో విద్యార్థులపై నిఘా ఉంచాలని, గంజాయి సేవించినట్లు తెలిస్తే వెంటనే వారిని డ్రగ్ డీఎడిక్షన్ సెంటర్లకు పంపించడంతో పాటు గంజాయి క్యాంపస్‌లోకి వచ్చే మార్గాలను అన్వేషించి కట్టడి చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు,

## ఆస్ట్రేలియాలో మేయర్‌గా తెలంగాణ మహిళ



**హైదరాబాద్,సెప్టెంబరు29,ప్రభాతవార్త:** ఆస్ట్రేలియా గడ్డపై తెలంగాణ బిడ్డ సరికొత్త చరిత్ర సృష్టించింది. హైదరాబాద్‌లో పుట్టి పెరిగిన సంధ్యా రెడ్డి.. న్యూ సౌత్ వేల్స్ రాష్ట్రం, సిడ్నీ నగరంలోని స్ట్రాత్‌ఫీల్ కు తొలి మహిళా మేయర్‌గా ఎన్నికై సత్తా చాటారు. 2005లో లాయర్‌గా ఆస్ట్రేలియా వెళ్లి అక్కడే సెటిల్ అయిన ఆమె, అప్పటి నుంచి స్ట్రాత్‌ఫీల్‌లోనే నివాసం ఉంటున్నారు. తన వృత్తిగత బాధ్యతలు నిర్వర్తిస్తూనే స్థానిక ప్రజా సమస్యలపై స్పందిస్తూ ప్రజల మన్ననలు పొందారు. అక్కడి ప్రజల మద్దతుతో ఆస్ట్రేలియా రాజకీయ చరిత్రలో ఓ తెలంగాణ మహిళ ఈ ఉన్నత స్థాయికి ఎదగడం ఇదే తొలిసారి. ఖండాంతరాల్లో తెలుగు వారి ఆత్మగౌరవాన్ని చాటిన సంధ్యా రెడ్డికి ప్రవాస భారతీయుల నుంచి పెద్ద ఎత్తున అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

## తుమ్మిడిహెట్టికి అనుమతివ్వండి

>> కుమార్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కృష్ణా, గోదావరి బేసిన్లలో తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన పలు అంశాలపై కేంద్ర మంత్రితో వారు చర్చించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీని ఎఫ్ఆర్ఎల్ +152 మీటర్ల స్థాయిలో నిర్మించేందుకు తెలంగాణ, మహారాష్ట్ర మధ్య త్వరగా అంగీకారం కుదిరేలా చూడాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఆ స్థాయిలో బ్యారేజీ నిర్మిస్తే గ్రావిటీ ఆధారంగా నీటిని ఎల్లంపల్లికి తరలించేందుకు వీలుంటుందని తెలిపారు. దాంతో నీటి తరలింపునకు అవసరమయ్యే విద్యుత్ వినియోగం, విద్యుత్ వ్యయం తగ్గుతుందని వివరించారు.పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (పీఆర్ఎల్ఐఎస్), డిండి ఎత్తిపోతల పథకం (డీఎల్ఐఎస్), సీతారామ సాగర్ బహుళార్ధక ప్రాజెక్టు (ఎస్ఎస్ఎంపీ), గౌరవెల్లి రిజర్వాయర్లకు పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు విజ్ఞప్తి చేశారు. అనుమతుల జాప్యంతో ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం పెరుగుతోందని సీఎం తెలిపారు. సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) వద్ద పెండింగ్‌లో ఉన్న అనుమతులను త్వరగా మంజూరు చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు డీపీఆర్‌ను సీడబ్ల్యూసీకి సమర్పించామని, నీటిపారుదల ప్రణాళిక, అంతర్రాష్ట్ర అంశాలకు సంబంధించిన అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి నిరభ్యంతర పత్రం పొందేందుకు తాము చర్చిస్తున్నామని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు.

సమావేశంలో రాష్ట్ర మంత్రి జి. వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే గడ్డం వినోద్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (నీటిపారుదల) ఆదిత్యనాథ్ దాస్, సీఎం సెక్రటరీ మాణిక్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



మంగళవారం సిడబ్ల్యుసి భేటీ సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్, కెసి వేణుగోపాల్, సిఎం రేవంత్, కర్ణాటక సిఎం డికె శివకుమార్ మాటామంతి

## జ్ఞానేశ్, మోడీ రాజీనామా చేయాలి

### సిడబ్ల్యుసి సమావేశంలో తీర్మానం.. 'సర్'ను వెంటనే నిలిపివేయాలి

### తొలగించిన ఓటర్ల పేర్లు పునరుద్ధరించాలి: ఖర్గే

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 29:** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌పై ప్రతిపక్షాలు, సీజేపీ వంటి పార్టీలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. తాజాగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వానికి జ్ఞానేష్ కుమార్ కీలుబొమ్మగా మారారని ఆరోపించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ వివాదం వేళ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఢిల్లీలో సమావేశమైంది. ఈ సమావేశంలోనే ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. జ్ఞానేష్ కుమార్‌కు పదవిలో కొనసాగేందుకు హక్కు లేదని, వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. తీవ్ర విమర్శలు వస్తున్న వేళ జ్ఞానేష్ కుమార్ పదవిలో కొనసాగేందుకు హక్కు లేదని ఖర్గే పేర్కొన్నారు. ప్రధాని మోడీ జ్ఞానేష్ కుమార్‌పై ఒత్తిడి తెచ్చారని ఆరోపిస్తూ ప్రధాని కూడా నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. సర్ ప్రక్రియ వెంటనే నిలిపేయాలని, తొలగించిన ఓటర్ల పేర్లను మళ్లీ పునరుద్ధరించాలని తీర్మానాలు చేశారు. పార్లమెంట్, కోర్టులు, వీధి పోరాటాలతో పోరాడుతామని సీడబ్ల్యూసీలో నిర్ణయాలు తీసుకున్నారు.ఓటర్ల జాబితాలో జరిగే ప్రతీ కీలక మార్పుకు సంబంధించిన పూర్తి డేటాను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఓటర్ల జాబితా నుంచి పేరు తొలగించిన వారికి పూర్తి సమాచారం ఇవ్వడంతో పాటు, తమ పేర్లను తిరిగి నమోదు చేసుకునేందుకు అప్పీల్ చేసే అవకాశం కల్పించాలని కోరింది.

రాజకీయ పార్టీలకు ఓటర్ల జాబివతా, అవసరమైన సంబంధిత డేటాను సులభంగా అర్థం చేసుకునే ఫార్మాట్‌లో సకాలంలో అందించాలని ఖర్గే డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా, ఎన్నికల ప్రక్రియలో తీవ్రమైన అక్రమాలు, అసమానతలకు ఆధారాలు బయటపడితే వాటిపై స్వతంత్రంగా, కాలపరిమితిలో విచారణ జరపాలని కోరారు. ఎన్నికలకు సంబంధించిన కీలక డేటా, నిర్ణయాల విషయంలో సమాచారం దాచి పెట్టారనే అవకాశం లేకుండా మరింత పారదర్శకత ఉండాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది.

## సిరిసిల్లలో నేడు కాంగ్రెస్ శంఖారావం

### 3 కి.మీ మేర సిఎం పాదయాత్ర

### రగుడు బైపాస్ వద్ద బహిరంగ సభ

**సిరిసిల్ల బ్యూరో, ప్రభాతవార్త:** తెలంగాణ రాజకీయాలు మరోసారి తీవ్ర ఉత్కంఠను రేపుతున్నాయి. ప్రతిపక్ష బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కంచుకోట అయిన సిరిసిల్ల నియోజకవర్గంలో ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి తొలిసారిగా నిర్వహించనున్న పర్యటన కాంగ్రెస్ వర్గాల్లో ఉత్సాహాన్ని నింపగా, రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రతిపక్ష నేతగా మూడుసార్లు సిరిసిల్లను సందర్శించిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు సీఎం హోదాలో అడుగుపెట్టి రూ.345.78 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనుండడం విశేషం. సిరిసిల్లలో దండయాత్ర చేస్తా.. మూడు రంగుల జెండాను ఎగరవేస్తా అని సీఎం ముందే ప్రకటించిన నేపథ్యంలో, ఈ సభపై రాష్ట్రవ్యాప్తంగా సర్వత్రా ఆసక్తి నెలకొంది. పర్యటనలో భాగంగా సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి బహిరంగ సభ జరిగే రగుడు బైపాస్ వరకు సుమారు 3 కిలోమీటర్ల మేర సీఎం రేవంత్ రెడ్డి పాదయాత్ర చేపట్టనున్నారు. ఈ పాదయాత్రలో సీఎం వెంట సుమారు 10 వేల మందికి పైగా కార్యకర్తలు, ప్రజలు అడుగులు వేయనున్నారు. అనంతరం రగుడు బైపాస్ సమీపంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో సీఎం ప్రసంగిస్తారు. ఈ బహిరంగ సభను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం, నియోజకవర్గంలోని అన్ని మండలాలకు ప్రత్యేక బాధ్యులను నియమించింది. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరు లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే విజయ రమణారావు జన సమీకరణపై దిశానిర్దేశం చేస్తున్నారు. లక్ష మంది జనంతో సభను విజయవంతం చేయడానికి 1000 కి పైగా ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలను సిద్ధం చేశారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జి కెకె మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్‌లు ప్రతినిత్యం పర్యవేక్షిస్తున్నారు.

## ఐటి, ఫార్మాలో హైదరాబాద్ మేటి

>> ప్రకాష్‌ను భారత కాన్సులేట్ ప్రతినిధులు శాలువాతో సత్కరించారు. అంతకుముందు.. ఈ బృందానికి అక్కడి అధికారులు ఘన స్వాగతం పలికారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఇన్వెస్టర్స్‌కు అపారమైన అవకాశాలు ఉన్నాయని, గ్రేటర్ హైదరాబాద్ చాలా వేగంగా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. హైదరాబాద్ పెట్టుబడులకు అనుకూలమైన ప్రాంతంగా అభివృద్ధి చెందిందని, ముఖ్యంగా ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఇన్నోవేషన్ వంటి రంగాల్లో హైదరాబాద్ ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. విదేశాల్లో స్థిరపడిన తెలుగు ప్రజలు తమ మాతృభూమితో తమ అనుబంధాన్ని కొనసాగిస్తూనే, తెలంగాణ అభివృద్ధిలోనూ భాగస్వాములు కావాలి' అని పిలుపునిచ్చారు. జర్మనీతో పాటు యూరప్‌లోని పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు తెలంగాణలో ఉన్న అన్ని అవకాశాలను పరిశీలించాలని కోరారు. ప్రవాస తెలంగాణ వాసులు రాష్ట్రానికి పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలను తీసుకురావడంలో గొప్ప వారధిగా నిలవాలని స్పీకర్ ప్రసాద్ సూచించారు. ప్రపంచంలోని వివిధ దేశాల్లో ఉన్న తెలుగు వాళ్లు తమ ప్రతిభతో ఉన్నత స్థానాలకు చేరుకోవడం చాలా గర్వకారణమని, వారు జన్మభూమి అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసన మండలి సెక్రెటరీ డా నరసింహాచార్యులు, అసెంబ్లీ సెక్రెటరీ ఆర్ తిరుపతి, లేజిస్లేచర్ ప్రతినిధి బృందం సభ్యులు, భారత కాన్సులేట్ అధికారులు, తెలుగు ప్రవాసులు తదితరులు పాల్గొన్నారు. జర్మనీ భారత పార్లమెంటరీ మైత్రి కార్యక్రమంలో భాగంగా 2024లో జర్మనీలోని రైన్‌ల్యాండ్ రాష్ట్ర స్పీకర్ హెండ్రిక్ హెరింగ్ బృందం హైదరాబాద్‌లోని అసెంబ్లీని సందర్శించింది. ఇప్పుడు దానికి రిటర్న్ విజిట్‌గా తెలంగాణ స్పీకర్ బృందం జర్మనీలో పర్యటిస్తోంది. యూరప్‌లోని జర్మనీ తర్వాత ఆస్ట్రియా, స్విట్జర్లాండ్‌లో ఈ బృందం పర్యటించనుంది. వచ్చే నెల 9వ తేదీన శాసన సభ స్పీకర్, శాసన మండలి చైర్మన్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటుంది.



ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

30-9-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 241 పేజీలు: 10+4 వెల: 6.50


కల్కి భగవాన్ అస్తమయం 7

హెచ్-1 బి మోసాలపై ట్రంప్ సర్కార్ ఉక్కుపాదం 8

## మందులు ఇంత భారమా?

ఔషధాల ధరలపై 'సుప్రీం' సీరియస్

అన్నిరకాల మెడిసిన్స్‌పై ఒకే రిటైలర్ మార్జిన్ ఎందుకు అమలుచేయరని ప్రశ్న 5



రిలేలో మహిళా బృందానికి

## మరో గోల్డ్

ఒక రజతం, రెండు కాంస్య పతకాలు

భారత్: స్వర్ణం- 6, రజతం- 21, కాంస్యం: 25



చరిత్ర సృష్టించిన

## నీరు ధాండా

వ్యక్తిగత విభాగంలో స్వర్ణం... టీమ్ ఈవెంట్‌లో రజతం

ఆటలో

# మళ్లీ నోటీసు!



మూడోసారి అభిశంసనకు విపక్షాల దూకుడు





మంగళవారం ఢిల్లీలో సిద్ధప్మని భేటీలో ఖర్గే, రాహుల్

### జ్ఞానేశ్, మోడీ రాజీనామా చేయాలి 2

సిడబ్ల్యుసి సమావేశంలో తీర్మానం

'సర్'ను వెంటనే నిలిపివేయాలి

తొలగించిన ఓటర్ల పేర్లు పునరుద్ధరించాలి: ఖర్గే

### సిఇసిని తొలగించడానికి రంగం సిద్ధం

### నేటి ఇండియా కూటమి భేటీలో కార్యాచరణ ఖరారు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 29:** భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలంటూ విపక్షాలు మళ్లీ దూకుడు పెంచుతున్నాయి. దీనికి సంబంధించి పార్లమెంట్‌లో మరో సారి తొలగింపు నోటీసు ఇవ్వడానికి ప్రతిపక్ష పార్టీలు సమాయత్తమవుతున్నాయి. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై, ఎలక్షన్ కమిషన్ తీరుపై పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమవుతున్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. జ్ఞానేష్ కుమార్‌పై అభిశంసన లేదా తొలగింపు నోటీసు ఇవ్వడం విపక్షాలకు ఇది మూడోసారి కావడం గమనార్హం. నిజానికి గతేడాది మార్చి 12న తొలిసారిగా విపక్షాలు రెండు సభల్లోనూ నోటీసులు ఇచ్చాయి. రాజ్యసభలో 63 మంది, లోక్‌సభలో 130 మంది ఎంపీలు సంతకాలు చేసిన ఈ నోటీసులను రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాలు తిరస్కరించారు. ఆ తర్వాత ఏప్రిల్ 24న వివిధ పార్టీలకు చెందిన 73 మంది ఎంపీల సంతకాలతో రాజ్యసభలో మరో నోటీసు ఇచ్చారు. అందులో కుమార్‌పై తొమ్మిది తీవ్రమైన ఆరోపణలు చేస్తూ, ఆయన నిరూపితమైన అపచారం (ప్రూవ్‌డ్ మిస్‌బిహేవియర్) చేశారని పేర్కొన్నారు. ఈ నోటీసు ఇప్పటికీ రాజ్యసభ ఛైర్మన్ పరిశీలనలోనే పెండింగ్‌లో ఉంది. ఇదిలా ఉండగా, ఇప్పుడు మూడోసారి రెండు సభల్లోనూ కొత్తగా నోటీసులు ఇవ్వాలని విపక్షాలు ప్లాన్ చేస్తున్నాయి. ఈసారి ఎలక్షన్ కమిషన్ లోపల కమిషనర్ల మధ్య వచ్చిన విభేదాలు, ఎస్ఐఆర్ ప్రక్రియపై వ్యక్తమైన అభ్యంతరాల ఆధారంగా తయారుచేసిన కొత్త నివేదికను ప్రధాన అస్త్రంగా మార్చుకోనున్నాయి. మరోవైపు జ్ఞానేష్ కుమార్‌తో పాటు ఎలక్షన్ కమిషన్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు మిన్నంటాయి. ఢిల్లీ, శ్రీనగర్, పట్నా, రాంచీ, జైపూర్ వంటి ప్రధాన నగరాల్లో ప్రతిపక్షాలు నిరసన ప్రదర్శనలు చేపట్టాయి. ఢిల్లీలోని ఎలక్షన్ కమిషన్ హెడ్క్వార్టర్స్‌కు మార్చ్‌గా వెళ్తున్న ఆందోళనకారులపై భద్రతాసిబ్బంది వాటర్ క్యానన్లను >>2

# తుమ్మిడిహెట్టికి అనుమతివ్వండి

పిఆర్ఎల్ఐఎస్, సీతారామ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు మంజూరు చేయండి

సమ్మక్క సాగర్ ముందుకు సాగేందుకు సహకరించండి

కృష్ణా జలాల వినియోగంపై త్వరగా టెలిమెట్రీలు ఏర్పాటు చేయాలి

జల్‌శక్తి మంత్రి సిఆర్ పాటిల్‌కు సిఎం రేవంత్ వినతి



మంగళవారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రి సిఆర్ పాటిల్‌తో భేటీ అయిన సిఎం రేవంత్, మంత్రి ఉత్తమ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు29, ప్రభాతవార్త:** తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి త్వరగా అనుమతులు ఇప్పించాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర కోరిన సమాచారాన్ని ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. మంగళవారం సాయంత్రం ఢిల్లీలో జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ >>2

### సిరిసిల్లలో నేడు కాంగ్రెస్ శంఖారావం 2

3 కి.మీ మేర సిఎం పాదయాత్ర

రగుడు బైపాస్ వద్ద బహిరంగ సభ

## 1.58 కోట్ల రేషన్ కార్డులు రద్దు?

రేపటి నుంచి అమలు

ఇ కెవైసితో 3 నెలల్లోగా పునరుద్ధరణకు అవకాశం

కేంద్ర ప్రభుత్వం నిర్ణయం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 29:** ప్రజా పంపిణీ వ్యవస్థ(పిడిఎస్)లో ఉన్న రేషన్ కార్డుల ప్రక్షాళనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. బోగస్, అర్హత లేని లబ్ధిదారులను >>2





## ఇడి వలలో 'అటికా గోల్డ్'

భారీగా నగదు, నగలు, విదేశీ కరెన్సీ జప్తు

చోరీ అయిన బంగారం కొన్నట్లుగా ఇడికి ఆధారాలు లభ్యం

హైదరాబాద్, చెన్నై, విశాఖ, బెంగళూరులోని సంస్థ ఆఫీసుల్లో సోదాలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 29: ప్రభాత వార్త:** తాకట్టులో వున్న బంగారాన్ని కొనుగోలు చేసే సంస్థగా పేరొందిన బెంగళూరుకు చెందిన ప్రముఖ సంస్థ అటికా గోల్డ్‌పై కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ అధికారులు >>2



జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌లో భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్, మండలి ఛైర్మన్ సుఖేందర్‌రెడ్డి తదితరులు

# ఐటి, ఫార్మాలో హైదరాబాద్ మేటి

తెలంగాణలోని పెట్టుబడి అవకాశాలను ఇన్వెస్టర్లు వినియోగించుకోవాలి

జర్మనీలో అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్, మండలి ఛైర్మన్ సుఖేందర్‌రెడ్డి పర్యటన

**హైదరాబాద్,సెప్టెంబరు29,ప్రభాతవార్త:** జర్మనీలో తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి నేతృత్వంలోని అసెంబ్లీ ప్రతినిధి బృందం పర్యటన కొనసాగుతోంది. జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌లో భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో తెలంగాణలో పెట్టుబడి అవకాశాలు, తెలుగుప్రవాసులతో అనుసంధానం అంశాలపై సమావేశంనిర్వహించారు. తెలంగాణలో అందుబాటులో ఉన్న పెట్టుబడుల అవకాశాలు, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, ఇన్నోవేషన్, టెక్నాలజీ వంటి వివిధ రంగాల్లో ఉన్న అవకాశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మండలి డిప్యూటీ ఛైర్మన్ బండ >>2

# వివక్షను అడ్డుకొందాం

### ఖర్గేకు జరిగిన అవమానాన్ని ఎదుర్కొందాం

### బిజెపి పాలనలో ఎస్సీ, ఎస్టీలను రెండో తరగతి పౌరులుగా చూస్తున్నారు: ఢిల్లీలో డి.సిఎం భట్టి





ఢిల్లీలో మంగళవారం జరిగిన కాంగ్రెస్ ఎస్సీ,ఎస్టీ ఎంపీల ఫోరం దళిత-ఆదివాసీ ఆత్మగౌరవ సమావేశంలో మాట్లాడుతున్న డి.సిఎం భట్టి

**హైదరాబాద్,సెప్టెంబరు29,ప్రభాతవార్త:** కాంగ్రెస్‌పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు జరిగిన అవమానాన్ని నిరసిస్తూ, దళితులు, ఆదివాసీల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు దేశవ్యాప్తంగా ఐక్య పోరాటం చేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. మంగళవారం ఢిల్లీలో కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ ఎంపీల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన దళిత-ఆదివాసీ ఆత్మగౌరవ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. దేశానికి సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, అస్పృశ్యత నిర్మూలన వంటి విలువలను అందించిన రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోనే అస్పృశ్యతకు వ్యతిరేకంగా తొలి తీర్మానం ఆమోదించబడిందని, అనంతరం రాజ్యాంగం అమల్లోకి వచ్చిందని ఆయన గుర్తుచేశారు.ప్రస్తుతం దేశాన్ని పాలిస్తున్న బీజేపీకి భారత రాజ్యాంగంపై నమ్మకం లేదని భట్టి విక్రమార్క ఆరోపించారు. రాజ్యాంగానికి బదులుగా మనుస్మృతి, మను ధర్మశాస్త్ర భావజాలాన్ని ప్రోత్సహించాలనే ఆలోచనతో బీజేపీ వ్యవహరిస్తోందని విమర్శించారు. దేశంలోని ప్రతి పౌరుడినీ ఒక్కటిగా నిలబెట్టేది భారత రాజ్యాంగమే. రాజ్యాంగాన్ని ఉల్లంఘించడం అంటే దేశ పునాదులనే దెబ్బతీయడం" అని భట్టి వ్యాఖ్యానించారు. దళితులు, ఆదివాసీలపై వివక్షకు వ్యతిరేకంగా కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే పలు చట్టాలు తీసుకువచ్చామని, అయినప్పటికీ నేటికీ ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళనకరమని అన్నారు. మల్లికార్జున ఖర్గే కేవలం దళిత నాయకుడు మాత్రమే కాదని, సుదీర్ఘ రాజకీయ పోరాటంతో దేశంలో అత్యున్నత పదవులను అధిరోహించిన నాయకుడని భట్టి అన్నారు. కర్ణాటకలో మంత్రిగా, సీఎల్పీనేతగా, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడిగా పనిచేసిన ఖర్గే ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీజాతీయ అధ్యక్షుడిగా ఉన్నారని గుర్తుచేశారు. అలాంటి >>2



సర్వోత్తమ్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి

### గ్రాడ్యుయేట్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులు రామ్మోహన్‌రెడ్డి, సర్వోత్తమ్‌రెడ్డి 7





# గాంజా ఘాటు

## తెలుగు రాష్ట్రాల్లో ఫుల్!



ఒడిశా, ఆంధ్ర ఏజెన్సీల నుంచి భారీగా అక్రమ రవాణా

పుష్ప సినిమా ఫక్కీలో తరలింపు

యేటా లక్ష కిలోల గంజాయి స్వాధీనం.. 5 వేల మంది అరెస్టు

హైదరాబాద్‌లో రికార్డు స్థాయి అమ్మకాలు

**ప్రభాతవార్త / న్యూస్‌నెట్‌వర్క్**

విద్యార్థులు, యువత పెద్దసంఖ్యలో గంజాయికి అలవాటు పడుతున్నారు. ఇంజనీరింగ్, మెడికల్, ఎంబిఏ కళాశాలల క్యాంపస్‌లో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఆదిలాబాద్‌లోని ట్రిపుల్ ఐటిలో కూడా గంజాయిని విద్యార్థులు సేవిస్తూ పట్టుపడిన ఘటనలు వెలుగు చూశాయంటే పరిస్థితి ఏమేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు. పంజాబ్‌లో డ్రగ్స్ విక్రయాలతో పోలిస్తే ఆ స్థాయిలో రెండు తెలుగు రాష్ట్రాల్లో గంజాయి వినియోగం పెరుగుతోందని పోలీసు >>2

# అమ్మకానికి ఓ ఊరు!

### నీళ్లిస్తే చాలు.. 'తులసి'ని ఇచ్చేస్తాం

### ఊరి ప్రవేశద్వారం వద్ద వేలాడుతున్న బ్యానర్లు

**సోలాపూర్, సెప్టెంబరు 29:** అది మహారాష్ట్రలోని ఓ అందమైన పల్లెటూరు. కానీ ఆ ఊరి రాత మాత్రం దారుణంగా మారిపోయింది. తాగడానికి గుక్కెడు నీళ్లు దొరక్క, పంటలు పండక, కనీసం మూగజీవాలకు తాగునీరు కూడా అందక ఆ ఊరి ప్రజలు పడుతున్న నరకం అంతా ఇంతా కాదు. సంవత్సరాల తరబడి ప్రభుత్వాలు మారుతున్నా, హామీలు వస్తున్నా తమ ఊరి నీటి గోస మాత్రం తీరడం లేదని ఆ గ్రామస్థులు తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయారు. అధికారుల కళ్లు తెరిపించేందుకు ఏకంగా తమ ఊరినే అమ్మకానికి పెట్టామంటూ సరికొత్త, వినూత్న నిరసనకు తెరతీశారు. "మా ఊరు అమ్మకానికి ఉంది.. దీని ధర కేవలం నీళ్లు మాత్రమే" అంటూ ఊరి ప్రవేశ ద్వారాల వద్ద బ్యానర్లు కట్టి వారు చేసిన నిరసన ఇప్పుడు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. అలంకారప్రాయంగా మారిన సాగునీటి కాలువలు మహారాష్ట్ర >>7

వార్త

మతం మానవుని కోసమే గాని, మానవుడు మతం కోసం కాదు.

- అంబేద్కర్

# ఎల్‌ఎన్‌జి రైళ్లతో కొత్త ఇంధన విప్లవం

**ఎల్‌ఎన్‌జీ రైలు ప్రయోగాన్ని కేవలం ఒక కొత్త రైలు ప్రారంభంగా కాకుండా, రైల్వే ఇంధన విధానంలో జరుగుతున్న మార్పుకు సూచనగా చూడాలి. రేపటి రైల్వే ఎలా ఉండాలి? తక్కువ ఖర్చుతో, తక్కువ కాలుష్యంతో, అధిక సామర్థ్యంతో, సురక్షితంగా, అందుబాటులో ఉండే రవాణా వ్యవస్థగా ఉండాలి. ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి విద్యుత్, ఎల్‌ఎన్‌జీ, హైడ్రోజన్ వంటి వివిధ సాంకేతిక మార్గాలను శాస్త్రీయంగా పరిశీలించాల్సి ఉంటుంది. సబర్మతి పట్టాలపైకి వచ్చిన తొలి ఎల్‌ఎన్‌జీ రైలు అందుకే ఒక చిన్న ప్రయోగం కాదు. అది భారతీయ రైల్వే అడుగులు వేస్తున్న కొత్త ఇంధన మార్గానికి ఒక ప్రారంభ సంకేతం. ఈ ప్రయోగం ఎంతవరకు విజయవంతమవుతుంది? దేశ వ్యాప్తంగా ఎన్ని రైళ్లకు విస్తరిస్తుంది? నిజంగా ఎంత ఇంధనం, ఎంత వ్యయం, ఎంత కాలుష్యం తగ్గుతుంది? ఈ ప్రశ్నలకు సమాధానం రాబోయే సంవత్సరాల పనితీరే ఇవ్వాలి.**

తిప్పర్తి శ్రీనివాస్

భారతీయ రైల్వే చరిత్రలో మరో కొత్త అధ్యాయం మొదలైంది. ఇన్నాళ్లూ విద్యుత్, డీజిల్ ఆధారంగా సాగిన రైలు ప్రయాణంలో ఇప్పుడు సహజవాయువు ఆధారిత ద్రవీకృత సహజవాయువు ఎల్‌ఎన్‌జీ అడుగుపెట్టింది. దేశంలోనే తొలి ఎల్‌ఎన్‌జీ ఆధారిత రైలును కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా సెప్టెంబర్ 27న గుజరాత్‌లోని సబర్మతి రైల్వే స్టేషన్ నుంచి ప్రారంభించారు. ఇది కేవలం మరో రైలును ప్రారంభించడం కాదు. ఇంధన పొదుపు, కాలుష్య నియంత్రణ, నిర్వహణ వ్యయ తగ్గింపు వంటి అంశాలను కలిపి చూస్తే భారతీయ రైల్వే భవిష్యత్తులో మారుతున్న దిశకు ఇది ఒక సంకేతంగా కనిపిస్తోంది. అయితే ఈ రైలు ప్రత్యేకత ఏమిటో ముందుగా తెలుసుకోవాలి. ఇది పూర్తిగా ఎల్‌ఎన్‌జీతో మాత్రమే నడిచే రైలు కాదు. ఎల్‌ఎన్‌జీ-డీజిల్ ద్వంద్వ ఇంధన సాంకేతికతతో పనిచేస్తుంది. అంటే అవసరాన్ని బట్టి అదే ఇంజిన్ ఎల్‌ఎన్‌జీతోనూ, డీజిల్‌తోనూ నడవగలదు. ఎల్‌ఎన్‌జీ అందుబాటులో లేని పరిస్థితుల్లో డీజిల్‌తో ప్రయాణాన్ని కొనసాగించవచ్చు. ఈ సౌలభ్యం ఈ ప్రయోగాన్ని మరింత ఆచరణాత్మకంగా మారుస్తోంది. సబర్మతి సమగ్ర కోచింగ్ డిపోలో 1,400హార్స్‌పవర్‌సామర్థ్యం కలిగిన రెండు డ్రైవింగ్ పవర్ కార్లను ఈ ద్వంద్వ ఇంధన వ్యవస్థకు అనుగుణంగా మార్చారు. వీటిపై 2,000 కిలోమీటర్లకు పైగా ప్రయోగాత్మక పరీక్షలు నిర్వహించినతర్వాత సేవలోకి తీసుకొచ్చారు. అంటే సాంకేతికతను కేవలం ప్రయోగశాలలో పరీక్షించి పట్టాలపైకి తీసుకురాలేదు. వాస్తవ రైలు నిర్వహణ పరిస్థితుల్లోనూ దాని పనితీరును పరిశీలించిన తర్వాతే ప్రారంభించారు. ఈ ప్రయోగంలో ప్రధాన ఆకర్షణ డీజిల్ వినియోగాన్ని తగ్గించడమే. అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం ఈ వ్యవస్థలో సుమారు 40 శాతంవరకు డీజిల్ వినియోగాన్ని ఎల్‌ఎన్‌జీ భర్తీ చేయగలదని రైల్వే అంచనా వేస్తోంది. ఒక డ్రైవింగ్ పవర్ కారుకు సంవత్సరానికి సుమారు రూ.11.9 లక్షల వరకు ఇంధన వ్యయం తగ్గవచ్చని, ఎనిమిది బోగీల రైలుకు ఏడాదికి సుమారు రూ.23.9 లక్షల వరకు ఆదా ఉండవచ్చని పరీక్షల ఆధారంగా అంచనా వేసింది. ఇక్కడే అసలు ప్రశ్న వస్తుంది. రైల్వేకు ఇంధన వ్యయం తగ్గితే ప్రజలకు ప్రయోజనం ఏమిటి? ప్రత్యక్షంగా రైలు టికెట్ ధర తగ్గకపోయినా, రైల్వే నిర్వహణ వ్యయం తగ్గడం సంస్థ ఆర్థిక సామర్థ్యాన్ని పెంచుతుంది. దేశవ్యాప్తంగా ఇలాంటి సాంకేతికతను అవసరమైన మార్గాల్లో విస్తరించగలిగితే దీర్ఘకాలంలో ఇంధన వ్యయం, నిర్వహణ ఖర్చులు తగ్గే అవకాశం ఉంటుంది.

అంతేకాదు, దిగుమతి చేసుకునే చమురు ఆధారాన్ని కొంత మేర తగ్గించడానికి కూడా ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగం తోడ్పడవచ్చు. మరో ముఖ్యమైన అంశం పర్యావరణం. డీజిల్ దహనం వల్ల కార్బన్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్లు, సూక్ష్మ ధూళికణాలు వంటి కాలుష్య కారకాలు విడుదలవుతాయి. ఎల్‌ఎన్‌జీ వినియోగంతో వీటి ఉద్గారాలను తగ్గించే అవకాశం ఉంది. అందువల్ల రైల్వే రవాణాను మరింత పర్యావరణహితంగా మార్చే ప్రయత్నాల్లో ఈ




సాంకేతికతకు స్థానం ఉంది. అయితే ఎల్‌ఎన్‌జీని పూర్తిస్థాయి పరిష్కారంగా చూడటం తొందరపాటు అవుతుంది. భారతీయ రైల్వే ఇప్పటికే విస్తృతంగా విద్యుదీకరణ దిశగా పయనిస్తోంది. విద్యుత్ రైళ్లు పెరుగుతున్న నేపథ్యంలో ఎల్‌ఎన్‌జీ రైళ్ల అవసరం ఏ మార్గాల్లో ఉంటుందన్నది భవిష్యత్తులో కీలకమైన ప్రశ్న. విద్యుదీకరణ సాధ్యం కాని లేదా ఆర్థికంగా తక్షణం సాధ్యంకానిమార్గాల్లో ప్రత్యామ్నాయ ఇంధన సాంకేతికతలు ఉపయోగపడవచ్చు. అందువల్ల ఎల్‌ఎన్‌జీని విద్యుత్‌కు ప్రత్యామ్నాయంగా కాకుండా, అవసరమైన చోట ఉపయోగపడే మధ్యంతర సాంకేతిక పరిష్కారంగా చూడటం సముచితం. ఇక మరోఅంశం ఇంధన మౌలికసదుపాయాలు. ఎల్‌ఎన్‌జీ రైలు పట్టాలపై పరుగులు తీయడం ఒక విషయం. దేశవ్యాప్తంగా వందలాది రైళ్లకు అవసరమైన ఎల్‌ఎన్‌జీ నిల్వ, రవాణా, నింపే కేంద్రాలు ఏర్పాటు చేయడం మరో విషయం. రైలు ఎక్కడ ఆగితే అక్కడ ఎల్‌ఎన్‌జీ అందుబాటులో ఉండేలా మౌలిక సదుపాయాలు లేకపోతే ఈ సాంకేతికత విస్తరణకు పరిమితులు ఏర్పడవచ్చు. కాబట్టి రైలు ప్రారంభంతో పాటు ఇంధన సరఫరా వ్యవస్థపైనా సమగ్ర ప్రణాళిక అవసరం. ఇదే సమయంలో భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. ఎల్‌ఎన్‌జీ అత్యంత తక్కువ ఉష్ణోగ్రత వద్ద ద్రవ రూపంలో నిల్వ చేయబడుతుంది.

దాని నిల్వ ట్యాంకులు, సరఫరా వ్యవస్థ, నింపే కేంద్రాలు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలుఇవన్నీ అత్యున్నత భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి. ప్రయాణికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదు. భారతదేశం రవాణా రంగంలో కొత్త ఇంధనాల వైపు అడుగులు వేస్తున్న సమయంలో ఈ ప్రయోగానికి మరో ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. 2026లోనే దేశంలో ప్రత్యామ్నాయ ఇంధన ఆధారిత రైలు సాంకేతికతలపై దృష్టి పెరుగుతున్న నేపథ్యంలో ఎల్‌ఎన్‌జీ రైలు ఆ ప్రయాణంలో మరో అడుగుగా నిలిచింది. అయితే ఒక రైలును ప్రారంభించడం కంటే ఆ సాంకేతికతను విజయవంతంగా విస్తరించడం చాలా పెద్ద సవాలు. ఇంధనధరలు, సరఫరా స్థిరత్వం, నిర్వహణ ఖర్చులు, భద్రత, ఉద్గారాల వాస్తవ తగ్గింపు, విద్యుదీకరణతో పోలిస్తే దీర్ఘకాలిక ఆర్థికప్రయోజనం వంటి అంశాలపై నిరంతర అధ్యయనం అవసరం. ప్రయోగాత్మక దశలో వచ్చిన ఫలితాలు సానుకూలంగా ఉన్నప్పటికీ, దేశవ్యాప్త విస్తరణకు ముందు మరింత విస్తృతమైన అనుభవం అవసరం. భారతీయ రైల్వే కేవలం ప్రయాణ సాధనం కాదు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. కోట్లాది మంది ప్రజలను, వేలాది టన్నుల సరుకును ప్రతిరోజూ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తీసుకెళ్లే ఈ వ్యవస్థలో చిన్న ఇంధన పొదుపు కూడా పెద్ద స్థాయిలో గణనీయమైన ఫలితాన్ని ఇవ్వగలదు. అందుకే ఎల్‌ఎన్‌జీ రైలు ప్రయోగాన్ని కేవలం ఒక కొత్త రైలు ప్రారంభంగా కాకుండా, రైల్వే ఇంధన విధానంలో జరుగుతున్న మార్పుకు సూచనగా చూడాలి. రేపటి రైల్వే ఎలా ఉండాలి? తక్కువ ఖర్చుతో, తక్కువ కాలుష్యంతో, అధిక సామర్థ్యంతో, సురక్షితంగా, అందుబాటులో ఉండే రవాణా వ్యవస్థగా ఉండాలి. ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి విద్యుత్, ఎల్‌ఎన్‌జీ, హైడ్రోజన్ వంటి వివిధ సాంకేతిక మార్గాలను శాస్త్రీయంగా పరిశీలించాల్సి ఉంటుంది. సబర్మతి పట్టాలపైకి వచ్చిన తొలి ఎల్‌ఎన్‌జీ రైలు అందుకే ఒక చిన్న ప్రయోగం కాదు. అది భారతీయ రైల్వే అడుగులు వేస్తున్న కొత్త ఇంధన మార్గానికి ఒక ప్రారంభ సంకేతం. ఈ ప్రయోగం ఎంతవరకు విజయవంతమవుతుంది? దేశ వ్యాప్తంగా ఎన్ని రైళ్లకు విస్తరిస్తుంది? నిజంగా ఎంత ఇంధనం, ఎంత వ్యయం, ఎంత కాలుష్యం తగ్గుతుంది? ఈ ప్రశ్నలకు సమాధానం రాబోయే సంవత్సరాల పనితీరే ఇవ్వాలి. పట్టాలపైకి వచ్చిన ఈ కొత్త రైలు ప్రయాణికులను మాత్రమే కాదు భారతీయ రైల్వే భవిష్యత్తును కూడా కొత్త దిశలో నడిపిస్తుందా? అన్నది కాలమే తేల్చాలి. •

# ప్రజారోగ్యాన్ని పీలుస్తున్నదెవరు?

జనారోగ్యమే జాతి మహాభాగ్యమనే లక్ష్యంతో దేశ ప్రజలను పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా చేసేందుకు స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి లక్షలాది కోట్ల రూపాయలు ఖర్చు చేశారు, చేస్తూనే ఉన్నారు. అటు కేంద్ర ప్రభుత్వం కానీ, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు లెక్కలేనన్ని పథకాలు ప్రవేశపెట్టాయి. ఏ పథకం కింద ఎన్ని కోట్ల రూపాయలు వెచ్చించారో లెక్కలకే అందదు. మన రాజ్యాంగ నిర్మాతలు ప్రజారోగ్యం విషయంలోపాలకులు తీసుకోవాల్సిన చర్యల గూర్చి రాజ్యాంగంలో పొందుపరిచారు. స్వాతంత్య్రంవచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా నేటికీ అందరికీ ఆరోగ్య వసతులు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర పాలకులు విఫలమవుతున్నారనే చెప్పొచ్చు. ప్రజారోగ్యంపై రోగాల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. కొన్ని వ్యాధులను కొందరు వ్యక్తులు తమకు తాముగా తెచ్చుకొని సమాజంపై వదులుతుంటే మరికొన్ని ప్రకృతి విసురుతున్నట్లుగా చెప్పొచ్చు. ఇవన్నీ కలిసి ప్రజారోగ్యంపై దాడుల పరంపర కొనసాగుతూనే ఉన్నాయి. ఇందులో కొన్ని వ్యాధులను నియంత్రించడం డాక్టర్లకు కూడా సాధ్యంకావడం లేదు. ఎంతో ఆధునిక విజ్ఞానం సముపార్జించుకున్నామనివిర్రవీగే మానవజాతిపై ప్రకృతి విసురుతున్న సవాళ్లకు వారూవీరు అని తేడా లేకుండా అందరూ బలైపోతున్నారు. ఆ శక్తిముందు మానవుడు ఎప్పుడూ తలదించుకోవాలనే వాస్తవాన్ని చాటుతూ వ్యాధులు ప్రబలిపోతున్నాయి. మొన్నటివరకు ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా రక్కసి బారినపడినవారు ఆ మందుల ప్రభావం నుండి ఇప్పటికీ కోలుకోలేకపోతున్నారు. అవికాక దోమల ద్వారా వస్తున్న వ్యాధులు అన్నీఇన్నీ కావు. గతంలో వచ్చిన స్వైన్‌ఫ్లూ, ఎబోలా, డెంగ్యూ, చికెన్ గున్యా, ఒకటేమిటి రకరకాల విషజ్వరాలు విస్తరిస్తూనే ఉన్నాయి. డెంగ్యూకు సంబంధించి నిరోధక టీకాలు వచ్చాయని చెప్పినా అవి అంతగా పనిచేయడం లేదనే వార్తలు వెల్లువెత్తుతున్నాయి. చికెన్‌గున్యా వదిలిపెట్టడం లేదు. దానివల్ల ప్రాణహాని లేకపోయినా నాలుగైదు వారాల పాటు మంచానికే పరిమితం కావాల్సి వస్తున్నది. దీంతో లక్ష్మీపుత్రులకు ఇబ్బంది లేదుకానీ రోజువారీ కూలీనాలి చేసుకునే బీదాబిక్కి చిన్నచిన్న వ్యాపారులు తదితర బడుగు వర్గాల పరిస్థితి అగమ్య గోచరంగామారుతున్నది. ఇక కేన్సర్, గుండెజబ్బులు, కిడ్నీ వ్యాధులు గురించి చెప్పక్కర్లేదు. అయితే ఈ వ్యాధుల నుండి రోగనిరోధక శక్తి ఉన్నవారు బయటపడే అవకాశాలున్నట్లు డాక్టర్లు చెబుతున్నారు. ఒక్క అల్లోపతే కాదు, ఆయుర్వేదం, హోమియో, తదితర అన్ని విభాగాలు డాక్టర్లు వైద్యరంగ నిపుణులు శరీరంలో ఇమ్యూనిటీ పెంచుకోవాలని సూచనలు ఇస్తున్నారు. ఇప్పుడు ఈవిషయం కొత్తగా చెప్పడం లేదు. ఏనాటి నుంచో చెబుతున్నారు. అయితే ఈ వాస్తవాలు ప్రజలకు తెలిసి కూడా రోగనిరోధక శక్తి ఎందుకు పెంచుకోలేకపో తున్నారు? అందుకు కారణాలు ఏమిటి?

కారకులు ఎవరు? తదితర అంశాలు పరిశీలించాల్సిన తరుణమిది. రోగనిరోధక శక్తి ఒక్క రోజుల్లోనో, వారంలోనూ, నెల రోజుల్లోనో పెరిగేది కాదు. బాల్యం నుంచి సమతుల్య మైన మంచి పోషకవిలువలు కలిగిన పౌష్టికాహారాన్ని అందించాలి. ఏమేరకు అందిస్తున్నామో ప్రత్యేకంగా చెప్ప క్కర్లేదు. పౌష్టికాహార లోపంతో ప్రధానంగా నిరుపేదలు అల్లాడిపోతున్నారు. అసలు పౌష్టికాహారం సంగతి దేవుడెరుగు. అర్ధాకలితో అలమటిస్తున్నవారు దేశంలో కోట్ల సంఖ్యలో ఉన్నారు. వారిలో రోగనిరోధక శక్తి ఎలా వస్తుంది. ఎక్కడ నుంచి వస్తుంది? మరొకపక్క కాలుష్యం, ప్రజారోగ్యాన్ని కాటేస్తున్నది. కాలుష్య నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు దాదాపు కాగితాలకే పరిమితమవుతున్నాయి. వాయు, నీటి కాలుష్యాలు అంతకంతకు పెరిగిపోతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో అక్టోబరు ఒకటి నుంచి కాలుష్యనియంత్రణ కోసంప్రత్యేక చర్యలకు అధి కారగణం శ్రీకారం చుట్టారు. వర్క్‌ఫ్రమ్ హోం లాంటివి కాకుండా కార్ల పార్కింగ్‌కు రెట్టింపు ఫీజులు విధించే కార్యక్రమం చేపట్టారు. దేశవ్యాప్తంగా కాలుష్య నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు దాదాపు కాగితాలకే పరిమితమవుతున్నాయి. వాయుకాలుష్యంతో పాటు నీటికాలుష్యం అంతకంతకు పెరిగిపోతున్నది. భారత్‌లో దాదాపు వంద నగరాలకుపైగా ఈ వాయు, నీటి కాలుష్యాలతో అతలాకుతలమవుతున్నాయి. మరొకపక్క వాహనాలు వదులుతున్న పొగ దీనికి తోడవుతున్నది. ఇంకొకపక్క ధూమపానం కూడా ప్రజారోగ్యాన్నిపాడు చేస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా 130 కోట్ల మందికిపైగా ధూమపానం లో మునిగి తేలుతున్నట్లు చెబుతున్నారు. భారత్‌లో ఇరవై కోట్ల మందికిపైగా పొగాకుకు అలవాటు పడ్డారు. ఇందులో బీడిలు తాగేవారే ఎక్కువ. సిగరెట్లు, బీడిలు తాగడం సరదాగా ఆరంభమై ఆ తర్వాత అలవాటుగా మారిపోతున్నది. బీడి, చుట్టా, సిగరెట్, హుక్కా రూపు రేఖలు, విలాసాల్లో తేడాలే కానీ వాటన్నింటికి మూలం పొగాకే. ధూమపానం చేసేవారికే కాదు, వారి చుట్టు పక్కల ఉన్నవారికి కూడా రకరకాల వ్యాధులు వ్యాపింప చేయగల శక్తి దానికిఉంది. మద్యపానం కూడా ప్రజా రోగ్యానికి హానికలిగిస్తున్న విషయం పెద్దలకు తెలియంది కాదు. ప్రజాసంక్షేమమే తమ లక్ష్యమని పదేపదే చెప్పు కునే పాలకపెద్దలు ప్రజారోగ్యాన్ని పణంగా పెట్టి ధనార్జన చేయడం ఎంతవరకు సమంజసమోమనసుపెట్టి ఆలోచించాలి. ఇవేకాదు కల్తీ ప్రజారోగ్యంపై తీవ్రప్రభావం చూపుతున్నది. ఇటీవల తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో జరుగుతున్న ఆకస్మిక దాడుల్లో వందల టన్నుల కొద్దీ కల్తీ వస్తువులు బయటపడుతున్నాయి. ఇలాంటివి ఎన్నో ప్రజల అనారోగ్యాలకు కారణమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో రోగనిరోధక శక్తి ఎలా పెరుగుతుందో, ఎలా పెంచుకోవాలో, ఈ వ్యాధుల నుంచి ఎలా బయటపడాలో పాలక పెద్దలు విజ్ఞతతో ఆలోచించాలి.

పువ్వును గాని, సీతాకోక చిలుకను గాని రూపాన్ని బట్టి నిర్ణయించు గాని, మనిషి విషయంలో మాత్రం అలా చేయకు.



రవీంద్రనాథ్ ఠాగూర్

దూరంగా ఉన్నా ఎప్పుడూ మనసులో ఉండేవారు నిజంగా దగ్గరగా ఉన్నట్లే. దగ్గరగా ఉన్నా ఎప్పుడూ మనుసులో లేనివారు దూరంగా ఉన్నట్లే.



చాణక్యుడు

# మత్తును వీడితేనే మేలైన భవిష్యత్తు!

డా.మోటె చిరంజీవి

మాదకద్రవ్యాల వినియోగం ఒక వ్యక్తి జీవితాన్ని మాత్రమే కాదు, కుటుంబాన్ని, సమాజాన్ని, చివరకు దేశ భవిష్యత్తును ప్రభావితం చేసే తీవ్రమైన సమస్య. ముఖ్యంగా యువతలో మత్తు పదార్థాల వినియోగం పెరగడం ఆందోళన కలిగించే అంశం. విద్య, ఉద్యోగ, ఉపాధి, ఆరోగ్యం, కుటుంబ సంబంధాలు, సామాజిక భద్రతపై దీని ప్రభావం పడుతోంది. అందుకే మాదకద్రవ్యాల వ్యతిరేక పోరాటాన్ని కేవలం పోలీసు వ్యవస్థకు పరిమితం చేయకుండా ప్రజా ఉద్యమంగా మార్చాల్సిన అవసరం ఉంది. ఈ లక్ష్యంతో కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ 2020 ఆగస్టు 15న నషా ముక్త్ భారత్ అభియాన్‌ను ప్రారంభించింది. తొలుత 272 జిల్లాల్లో ప్రారంభమైన ఈ కార్యక్రమం 2023 ఆగస్టు నుంచి దేశంలోని అన్ని జిల్లాలకు విస్తరించింది. అవగాహన, సమాజ భాగస్వామ్యం, చికిత్స, పునరావాసం, తిరిగి సామాజిక జీవితంలోకి తీసుకురావడం ఈ కార్యక్రమంలో ప్రధానఅంశాలుగా ఉన్నాయి. 2026 జూలైలో కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన వివరాల ప్రకారం, దేశవ్యాప్తంగా నషా ముక్త్ భారత్ అభియాన్ ద్వారా 29.68 కోట్లకు పైగా ప్రజలకు అవగాహన కల్పించగా, 28.29 లక్షల మందికి పైగా చికిత్స, పునరావాస సేవలు అందాయి. విద్యా సంస్థల్లోనూ పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అయితే గణాంకాలు మాత్రమే సమస్యకు పరిష్కారం కావు. మత్తుకు బానిసైన వ్యక్తిని నేరస్థుడిగా మాత్రమే చూడటంవల్ల సమస్య మరింత సంక్లిష్టమవుతుంది. చికిత్స, కౌన్సెలింగ్, కుటుంబ సహకారం, పునరావాసం, ఉపాధి అవకాశాలు కల్పించడంకూడా అంతే ముఖ్యం. మాదకద్రవ్యాల వినియోగాన్ని తగ్గించడంతోపాటు, దాని బారిన పడిన వారికి తిరిగి గౌరవప్రదమైన జీవితం అందించే వ్యవస్థబలపడాలి. ఇందులో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, వైద్యులు, పోలీసులు, అందరూకీలక పాత్ర పోషించాలి. పాఠశాలలు, కళాశాలల్లో కేవలం హెచ్చరికలు ఇవ్వడం కాకుండా మానసిక ఆరోగ్యం, ఒత్తిడి నిర్వహణ, చెడు స్నేహాల ప్రభావం, మత్తు పదార్థాల వల్ల కలిగే దీర్ఘకాలిక నష్టాలపై నిరంతర అవగాహన అవసరం. మత్తు పదార్థాల సరఫరాను అరికట్టడం ఎంత అవసరమో, వాటికి డిమాండ్‌ను తగ్గించడం కూడా అంతే అవసరం. అందుకే నషా ముక్త్ భారత్ అభియాన్‌లో పోలీసు, ప్రభుత్వ విభాగాలు, వైద్య, విద్యా సంస్థలు, ప్రజా సంఘాలసమన్వయం కీలకం. ప్రభుత్వం కూడా ఈ కార్యక్రమాన్ని అవగాహనతో పాటు చికిత్స, పునరావాస సేవలతో అనుసంధానిస్తోంది. మత్తు నుంచి బయటపడాలనికోరుకునే వారికి సహాయం అందుబాటులో ఉందనే నమ్మకం కల్పించాలి. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో 2018 లో నిర్వహించిన సమగ్రజాతీయ సర్వే మత్తుపదార్థాల వినియోగం తీవ్రతనుస్పష్టంగా వెల్లడించింది. దేశంలో సుమారు 16కోట్లమంది మద్యం, 3.1కోట్ల మంది గంజాయి ఉత్పత్తులు, 2.26కోట్ల మంది ఓపియాయిడ్లు వినియోగిస్తున్నట్లు సర్వే అంచనావేసింది. వీరిలో తీవ్రంగా ప్రభావితమైన వారికి చికిత్స, సహాయం అవసరమని కూడాసర్వే గుర్తించింది. ఓపియాయిడ్ల వినియోగదారుల్లో సుమారు 77లక్షలమందికి సహాయం అవసరమని అంచనావేసింది. అత్యంత ఆందోళన కలిగించే అంశం పిల్లలు, కిశోరుల పరిస్థితి. 10-17ఏళ్ల వయస్సులో సుమారు 40లక్షల మంది ఓపియాయిడ్లు, 20లక్షల మంది గంజాయి, 20లక్షలమంది సెడేటివ్స్, 30లక్షల మంది ఇన్హేలెంట్స్ వినియోగిస్తున్నట్లు 2018 సర్వేఅంచనా వేసింది. ఇవి ప్రస్తుత పరిస్థితికి సంబంధించిన తాజా లెక్కలు కావు. అందుబాటులో ఉన్న జాతీయ స్థాయి అధికారిక సర్వే గణాంకాలు. నషా ముక్త్ భారత్ అంటే మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి అనే నినాదం కాదు. యువతకు ఆరోగ్యకరమైన జీవితం, కుటుంబాలకు భద్రత, సమాజానికి బాధ్యత, బాధితులకు పునరావాసం కల్పించే సమగ్ర ఉద్యమం. మత్తును నిర్మూలించాలంటే భయంతో కాదు. అవగాహనతో ముందుకు సాగాలి. •

# ప్రజావాక్కు



### లోకాయుక్త విచారణ నెలకొకసారి జరగాలి

లోకాయుక్త విచారణ నెలకొకసారి జరగాలి లేదా లోకాయుక్త కార్యాలయం విజయవాడలో పెట్టాలి. కర్నూలులో లోకాయుక్త ఉన్నందున శ్రీకాకుళం, విశాఖల నుండి వచ్చేవారు రెండు రోజులు ముందుగా ప్రయాణ సన్నాహాలు చేసుకోవాలి. కర్నూలుకు రైలుసౌకర్యం లేదు. బస్సులు అడవిలో నుండి ఐదారు గంటలు ఘాట్ రోడ్డు ప్రయాణం చెయ్యాలి. చాలాఇబ్బందిగా ఉంటుంది. లోకాయుక్త కార్యాలయం విజయవాడ ఐతే అన్ని జిల్లాలకు అనుకూలంగా ఉంటుంది. నెలకొకసారి విచారణ జరపాలనిలోకాయుక్త ఫిర్యాదుదారులు కోరుకుంటున్నారు. వాయిదాలు కూడా ఎక్కువగా వెయ్యకుండా త్వరగా తీర్పులు చెప్పాలి. అధికారులు సమాచారం ఇవ్వకుండా వాయిదాలు కోరుతున్నారు. ఫైలు కనపడలేదు అంటూ అధికారులు వాయిదాలు కోరుతున్నారు. లోకాయుక్త గారు అలాంటిఅధికారులకు గట్టిగా వార్నింగ్ లాంటిది ఇవ్వాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### భస్మాసుర హస్తం కాబోతున్న కృత్రిమ మేధ

మనిషి సృష్టించిన కృత్రిమమేధవల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశంగా పరిగణింపబడాలంటే ఈ రంగంలో మనిషికంటే వేగంగా పనిచేసేయంత్రాంగం ఉండాలనుకోవడంలో తప్పులేదు. కానీ ఈ మేధవల్ల లాభాల కన్నా నష్టాలే ఎక్కువ కనిపిస్తున్నాయి. ముఖ్యంగా వేలఉద్యోగాలకు ఉద్వాసన చెప్పడం జరిగింది. కొత్తఉద్యోగాలకు గండిపడుతోంది. స్టైబర్ నేరాలు ఉధృత మవుతున్నాయి. మరొక భయంకరమైన విషయం ఏమంటే ఈ మేధ మనిషి మీదే అధికారం చలాయించే రోజులొచ్చాయని మేధావులు హెచ్చరిస్తున్నారు. మానవ జాతి మొత్తం వినాశానికి దారి తీయగలదని అప్పట్లో స్టీఫెన్ హాకింగ్ ఈమధ్య బిల్‌గేట్స్ హెచ్చరించిన సంగతి మరువకూడదు.

- డా. ఎన్.ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

### పెరుగుతున్న అవినీతి

ప్రభుత్వం నెల నెల ఠంచన్‌గా అందించే వేలాది రూపాయల జీతాలతో ఎంతోహుందాగా ఉండాల్సిన కొంతమంది ఉద్యోగులు తమ దగ్గరకు ఏదేని పని నిమిత్తమై వచ్చిన సామాన్యప్రజలనుంచి, చిన్న, సన్న కారు రైతుల నుంచి తమకు కావలసినంత సొమ్మును వసూలు చేస్తున్నారు. కాస్తో, కూస్తో కాసులు గుంజనిదే పని చేయడం లేదు.

- కె.రామారావు, నల్గొండజిల్లా

### పర్యాటకం ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక

పర్యాటకం అంటే కేవలం విహారయాత్ర కాదు, అది జీవితాన్ని సమృద్ధిగా మార్చే అనుభవాల ప్రయాణం. ముఖ్యంగా పిల్లలకు పర్యాటకం ఒక ప్రత్యక్ష పాఠశాల వంటిది. తరగతి గదిలో పుస్తకాల ద్వారా నేర్చుకున్న చరిత్ర, భూగోళ శాస్త్రం, సంస్కృతి వంటి అంశాలను స్వయంగా చూసి అర్థం చేసుకునే అవకాశం పర్యాటకం కల్పిస్తుంది. చారిత్రక కట్టడాలు, పుణ్యక్షేత్రాలు, సముద్రతీరాలు, కొండప్రాంతాలు, వన్యప్రాణుల అభయారణ్యాలు సందర్శించడం ద్వారా జ్ఞానం విశాలమవుతుంది. తన గ్రామం లేదా పట్టణం దాటి ఎక్కడికీ వెళ్లని వ్యక్తి జీవిత పుస్తకంలో ఒక్క పేజీ మాత్రమే చదివినట్లే" అనే సామెతలో గొప్ప సందేశం ఉంది. పర్యాటకం మనలో విశాల దృక్పథాన్ని పెంపొందిస్తుంది. వివిధ సంస్కృతులు, జీవనశైలులు, సంప్రదాయాలను అర్థంచేసుకోవడం ద్వారా పరస్పర గౌరవం పెరుగుతుంది. ప్రకృతికి చేరువ కావడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గి ఆరోగ్యం మెరుగుపడుతుంది. అందుకే పర్యాటకాన్ని జీవిత కాలాన్ని, జీవిత నాణ్యతను పెంచేసాధనంగా కూడా భావిస్తారు. పర్యాటకం స్థానిక ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### కూరగాయల సాగును పెంచాలి

తెలంగాణలో 47శాతం అంటే దాదాపు సగంభూములు ఎర్ర చెలక లేదా ఎర్ర చెక్క భూములు అయినా ఇతర రాష్ట్రాలా నుండి కూరగాయలు దిగుమతిచేసుకోవలసిన పరిస్థితి వచ్చింది. అయితే తెలంగాణలో గతంలో 5.45 లక్షల ఎకరాలలో సాగు అయిన ఎర్ర చెక్క భూముల విస్తీర్ణం నేడు 1.13 లక్షల ఎకరాలకు మాత్రమే పరిమితం అయింది. ఇది రాష్ట్రానికి శరాఘాతమే. తెలంగాణకు అవసరం అయినా కూరగాయలు 40 లక్షల మెట్రిక్ టన్నులు ఐతే తెలంగాణ సమకూర్చేది 25 లక్షల మెట్రిక్ టన్నులు అని గుర్తుపెట్టుకోవాలి. ప్రభుత్వం ఉపాధి హామీ, వీ బీరామ్‌జీని పథకాలను అమలు చేయాలి.

- భారత అవినాష్, జనగామ

### ఆరోగ్యమే మహాభాగ్యం

ప్రస్తుత మానవ జీవిత పరిణామ క్రమంలో అన్నింటికంటే మొదటి ప్రాధాన్యత మన విలువైన ఆరోగ్యానికి మాత్రమే ఇవ్వాలి. ఆరోగ్యం బాగున్నప్పుడే మనం ఏదైనా సాధించగలం. ఆరుబయట ఆహారం పూర్తిగా విరమించి పౌష్టికాహారం తీసుకుంటేనే మన ఆరోగ్యం బాగుండడంతో పాటు ఎక్కువ కాలం జీవించే అవకాశం ఉంటుంది.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# ఆర్థిక వ్యవస్థలో అన్నదాత స్థానమెక్కడ?

గౌని ఐలయ్య

భారతదేశం ప్రపంచంలోనే నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని, 200 సంవత్సరాలు మన దేశాన్ని వలసగా పాలించిన బ్రిటన్‌ను కూడా దాటి ముందుకు పోయామని ప్రధాని, కేంద్రమంత్రులు గొప్పగా చెపుతున్నారు. 2047 నాటికి మన దేశాన్ని ప్రపంచంలోనే శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టడం కోసం 'వికసిత్ భారత్' లక్ష్యంతో పనిచేస్తున్నామని, అందులో వ్యవసాయ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని కూడా చెప్తున్నారు. దేశ జనాభాలో సగం మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తుండడం, గ్రామీణ ప్రాంతాల్లో ఆ సంఖ్య 70 శాతానికి పైగా ఉండడం, రూపొందించుకున్న రాజ్యాంగం ప్రకారం ఐదు సంవత్సరాలకోసారి ఎన్నికలు జరిపి ప్రభుత్వాలని ఎన్నుకోవాల్సి వున్నకారణంగా వ్యవసాయ రంగం గురించి, రైతు కూలీల అభివృద్ధి గురించి అందరూ మాట్లాడక తప్పటం లేదు. స్వాతంత్య్రం పొందిన కాలం నుండి వ్యవసాయ అభివృద్ధి, రైతాంగ అభివృద్ధి అనే మాటలు మాట్లాడని నేతలు లేరు, ప్రణాళికలు వేయని ప్రభుత్వాలు లేవు. స్వాతంత్య్రం వచ్చిన గత 80 సంవత్సరాల నుండి అమలు చేస్తున్న ఈ ప్రణాళికలు, పథకాలు అన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి తప్ప రైతు కూలీల నిజ జీవితాలలో మార్పులు తీసుకురాలేదు. ప్రపంచీకరణ విధానాలు, ప్రధానంగా ప్రపంచ వాణిజ్య సంస్థలో భారతదేశం భాగస్వామిగా చేరడం, వ్యవసాయ రంగాన్ని కూడా అందులో చేర్చడానికి అంగీకరించడం మన మెడకు ఉరి తాడుగా మారింది. అప్పటి నుండి రైతు కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యల బారిన పడటం పెరుగుతూనే వుంది. 1995 నుండి 2018 మధ్యకాలంలో సుమారు నాలుగు లక్షల మంది రైతుకూలీలు ఆత్మహత్యలు చేసుకున్నారు. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ దుస్థితి మరింత పెరిగింది. ఒక్క 2023 సంవత్సరంలోనే 10700 మంది రైతు కూలీలు ఆత్మహత్యలు చేసుకున్నారు. ప్రమాదకరంగా మారిన రైతు కూలీల దుస్థితికి ఇది అద్దం పడుతుంది. నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతుల ఆదాయాన్ని 2022 నాటికి రెట్టింపు చేస్తామని, స్వామినాథన్ సిఫారసులకు అనుగుణంగా పంటలకు మద్దతు ధర ఇస్తామని హామీ ఇచ్చింది. వాటిని అమలు చేయకపోగా రైతు కూలీలకు నష్టకరమైన కార్పొరేట్ అనుకూల వ్యవసాయ విధానాలను ముందుకు తెచ్చింది. కరోనా కాలంలో తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలు రైతుల కోపాగ్నికి కారణమయ్యాయి. ఢిల్లీ కేంద్రంగా రైతాంగం సంవత్సర కాలానికి పైగా సాగించిన సమరశీల పోరాటం ఫలితంగా కేంద్ర ప్రభుత్వం ఆ చట్టాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించి, కనీస మద్దతు ధర చట్టం కోసం ఒక కమిటీని వేసింది. ఐదు సంవత్సరాలు గడిచినా అది ఇసుమంత కూడా ముందుకు సాగలేదు. పైగా మరో రూపంలో వాటిని తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది. అందులో భాగంగానే డిజిటల్ అగ్రికల్చరల్ మిషన్, నేషనల్ పాలసీ ఫ్రేమ్ వర్క్ ఆన్ అగ్రికల్చర్ మార్కెట్, జాతీయ సహకారవిధానం పేరుతో కార్పొరేట్ అనుకూల చట్టాలను తీసుకువచ్చింది. రైతులకు తీవ్ర నష్టం కలిగించి కార్పొరేట్ శక్తులకు లాభం కలిగించేందుకు



ఇప్పుడు నూతన విద్యుత్ బిల్లు, విత్తన బిల్లులను సిద్ధం చేసింది. ఇప్పటికే విత్తన రంగంలో 100శాతం విదేశీ పెట్టుబడులను అనుమతిస్తూ ఇప్పుడు విత్తనాలపై బహుళ జాతి సంస్థల ఆధిపత్యాన్ని సుస్థిరం చేయడానికి విత్తన బిల్లులో అవకాశం కల్పించారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించటంతో పాటు వ్యవసాయ రంగానికి, ఇతర పేద వర్గాలకు ఇస్తున్న ఉచిత విద్యుత్ పథకాలకు మంగళం పాడేందుకు డిస్కంల ఏర్పాటును, విద్యుత్ బిల్లును ముందుకు తెస్తున్నారు. అటవీ సంరక్షణ నియమాలు కూడా ఆదివాసి రైతు కూలీలకు, వారి హక్కులకు భంగం కలిగించేవే. ఒకవైపు రైతు కూలీల కనీస హక్కులు, సబ్సిడీలను రద్దు చేస్తూ వ్యవసాయ రంగంలో కార్పొరేట్ల చొరబాటుకుబాటలు వేస్తూ దానినే వ్యవసాయ రంగ అభివృద్ధిగా చెపుతున్నారు. ఇప్పటికే భారత రైతాంగం రుణభారంతో కునారిల్లుతున్నది. 52 శాతం వ్యవసాయ కుటుంబాలు అప్పుల్లో ఉన్నాయని గణాంకాలు తెలియజేస్తున్నాయి. వారిని అప్పుల ఊబినుండి బయట పడవేయడానికి ప్రభుత్వాలు తీసుకున్న చర్యలు శూన్యం. కేంద్రప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు 20లక్షల కోట్లకు పైగా కార్పొరేట్ కంపెనీల అప్పులను రద్దు చేసింది. వారికి ప్రతి సంవత్సరం రెండు లక్షల కోట్లకు పైగా పన్ను రాయితీలిస్తుంది. కేవలం 5లక్షల కోట్ల రూపాయలు కేటాయిస్తే దేశంలోని రైతులను అప్పుల భారం నుండి బయటపడేయవచ్చు. కేంద్రం అలాంటి పని చేయకపోగా రాష్ట్రాలు ఎన్నికల హామీలలో భాగంగా అరకొరగా రైతుల రుణమాఫీ పథకాలు ప్రకటిస్తుంటే వాటి వల్ల బ్యాంకింగ్, ఆర్థిక వ్యవస్థలు దెబ్బతింటాయని కేంద్రమంత్రులు గగ్గోలు పెడుతున్నారు. ఒకవైపు బడా కార్పొరేట్ శక్తులకు భారీ రాయితీలు ఇస్తూ రైతు కూలీలకు మొండి చేయి చూపుతూ కేంద్ర ప్రభుత్వం రైతు కూలీల అభివృద్ధి గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా వుంది. ఇటీవల కాలంలో భారత ప్రభుత్వం అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తోను, యూరోపియన్ దేశాలతోనూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నది. ఈ ఒప్పందాల వల్ల మన రైతులకు లాభం జరుగుతుందని ఊదరగొడుతున్నారు. ప్రపంచంలోనే వ్యవసాయరంగానికి అత్యధిక సబ్సిడీలు ఇస్తున్న దేశంఅమెరికా. అమెరికా రైతు సగటున 464 ఎకరాలలో సేద్యం చేస్తూ సుమారు ఆరు లక్షల రూపాయల సబ్సిడీని ప్రభుత్వం నుండి పొందుతున్నాడు. అమెరికాతో సహా పాశ్చాత్య దేశాలలో 25నుండి 60శాతం వరకు ప్రభుత్వ నుండి రాయితీలు పొందుతుండగా మన దేశంలో అది కేవలం 4 శాతం మాత్రమే. ఎరువులపై సబ్సిడీని ఎత్తివేస్తూ, వ్యవసాయ రంగానికి బడ్జెట్లో కోతలు విధిస్తూ రైతాంగం నెత్తిపై పెనుభారం మోపుతున్న మన ప్రభుత్వం విదేశీ ఉత్పత్తులతో 'స్వేచ్ఛగా' పోటీ పడమంటున్నారు. భారీ సబ్సిడీలతో సేద్యం చేస్తున్న దేశాల ఉత్పత్తులు తక్కువ ధరకే మన మార్కెట్‌ను ముంచెత్తుతుంటే వాటితో పోటీ పడమంటున్నారు. ప్రభుత్వానికే ఎదురు సబ్సిడీలు ఇస్తూ అప్పులఊబిలో దిగబడి చావలేక, బ్రతకలేక వ్యవసాయం చేస్తున్న మన రైతులకు అది సాధ్యం కానిపని. పైగా అమెరికా లాంటి అగ్రరాజ్యాల ఆదేశాలకు లొంగి విదేశీ వ్యవసాయ ఉత్పత్తులపై 113 శాతం వరకు సుంకాలు వేసే అవకాశం ఉన్నా వాటిని అతి తక్కువ శాతానికి, చివరకు జీరో సుంకాలకు అనుమతించడం మన రైతులను బలిపీఠంపై ఎక్కించడమే. ఇప్పటికే భారతీయ పత్తి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. మనం ఎగుమతులు చేస్తున్న ఆహార వాణిజ్య ఉత్పత్తులను కూడా భారీ స్థాయిలో దిగుమతులు అనుమతించడంతో మన వ్యవసాయ రంగంకోలుకోలేని విధంగా నష్టపోతున్నది. కొద్దిమంది కార్పొరేట్ శక్తుల అభివృద్ధి మాత్రమే దేశాభివృద్ధి ఎంతమాత్రం కాదు. వారి సంపదను చూపించి ఇండియా బలమైన ఆర్థిక శక్తిగా అవతరించిందని చెప్పటం ఆత్మ వంచన తప్ప వేరుకాదు. దేశంలో రైతు కూలీల, అట్టడుగు వర్గ ప్రజల కేంద్రంగా అభివృద్ధి జరిగినప్పుడే అది నిజమైన అభివృద్ధి అవుతుంది. •

# తెలంగాణ అభివృద్ధే ప్రధాన లక్ష్యం

## సిడబ్ల్యుసి సమావేశానికి ముందు కీలక నేతలతో సిఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశానికి ముందు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కీలక నేతలతో భేటీ అయ్యారు. రాహుల్‌గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌తో అర్థవంతమైన చర్చలు జరిపినట్లు రేవంత్‌రెడ్డి సోషల్ మీడియాలో తెలిపారు. తెలంగాణ అభివృద్ధి తన ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. అయితే సీడబ్ల్యూసీ సమావేశంలో దేశానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల వ్యవస్థపై కాంగ్రెస్ వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలు, ఎన్నికల జాబితాల అంశంతో పాటు దేశ సామాజిక, ఆర్థిక అభివృద్ధికి అవసరమైన వ్యూహాలపైనా చర్చించే అవకాశం ఉందని సీఎం రేవంత్ తెలిపారు.

# కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో విద్యావిధానంపై ఎఐసిసి కార్యాలయంలో చర్చ

**హైదరాబాద్,సెప్టెంబరు29,ప్రభాతవార్త:** ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కేసీ వేణుగోపాల్ కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఆ రాష్ట్రాల విద్యా శాఖ మంత్రులతో ఏఐసీసీ కార్యాలయంలో మంగళవారం సమావేశమయ్యారు. ఆయా రాష్ట్రాల్లో విద్యా విధానం అమలు, అక్షరాస్యత పెంపు తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, కర్ణాటక, కేరళ, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రులు డీకే శివ కుమార్, వీడీ సతీషన్, సుఖ్వీందర్ సింగ్ సుఖు తదితరులు పాల్గొన్నారు.

# వివేకా హత్య కేసులో కొనసాగుతున్న ఇడి దర్యాప్తు

## ఎర్ర గంగిరెడ్డిని రెండోరోజు సుదీర్ఘంగా విచారించిన అధికారులు

**హైదరాబాద్,సెప్టెంబరు29,ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మాజీ మంత్రి వై.ఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ఎ1 ఎర్ర గంగిరెడ్డిని కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఇడి) అధికారులు మంగళవారం కూడా సుధీర్ఘంగా ఏడు గంటల పాటు వి చారించారు. సోమవారం నాడు గంగిరెడ్డిని తొమ్మిది గంటల పాటు విచారించడం తెలిసిందే. ఇదే కేసులో ఎ2గావున్న సునీల్ యాదవ్‌ను ఈడీ అధికారులు శుక్ర, శనివారాల్లో వరుసగా రెండు రోజుల పాటు విచారించడం తెలిసిందే. అంతకు ముందు ఇదే కేసులో అప్రూవర్‌గా మారిన ద స్తగిరిని కూడా విచారించడం విదితమే. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో గల ఈడీ కార్యాయంలో ఎర్ర గంగిరెడ్డి ఉదయం పది గంటలకు రాగా నలుగురు అధికారులతో కూడిన బృందం అతన్ని విచారించినట్లు తెలిసింది. వివేకానంద రెడ్డి హత్య కేసులో నిందితుల గురించి సిబిఐ విచారి స్తుండగా నిందితులకు అందిన 40 కోట్ల రూపాయల విషయంలో మనీలాండరింగ్ కోణంలో ఈడీ వేరుగా దర్యాప్తు చేస్తోంది. ఈ డబ్బులు ఎలా, ఎక్కడి నుంచి, ఎవరి నుంచి, ఏ మార్గంలో వచ్చాయనే కోణంలో ఈడీ విచారణ సాగుతోంది. సునీల్ యాదవ్, దస్తగిరిలను ప్రశ్నించినట్లు గానే గంగిరెడ్డిని విచారించినట్లు తెలిసింది. దీనికి సంబంధించిన కాల్ డేటా రికార్డును గంగిరెడ్డి ముందుంచి వివరాలను అతని నుంచి వివరాల ను రాబట్టినట్లు తెలిసింది.

# సోలార్, బ్యాటరీ నిల్వలపై నేడు జాతీయ సదస్సు

## హైదరాబాద్‌కు 50 నగరాల నుండి 100కుపైగా కంపెనీలు

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త :** సోలార్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (బిఇఎస్ఎస్) పై హైదరాబాద్‌లో ఈ నెల 30వ తేదీన జాతీ సదస్సు జరగనుంది. నెట్‌జీరో ఎనర్జీ ట్రాన్సి షన్ అసోసియేషన్ (నేత్ర) ఆధ్వర్యంలో, రెడ్ హిల్స్‌లోని ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీలో గ్రిడ్ సి ఐ రంగం కోసం జరిగే ఈ జాతీయ సదస్సులో 50 నగరాల నుండి 100కి పైగా కంపెనీలు హైదరాబాద్‌లో సమావేశం కానున్నాయి. బ్యాటరీ నిల్వతో విశ్వసనీయత, స్థితిస్థాపకత మరియు విద్యుత్ నాణ్యతను పరిష్కరించడం" అనే ఇతివృత్తంపై కేంద్రీకృతమై ఈ సదస్సు జరుగనుంది. సౌర, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ విస్తరణను ముందుకు తీసుకెళ్లడానికి విధాన రూపకర్తలు, విద్యుత్ రంగ నాయకులు, పంపిణీ సంస్థలు, సాంకేతిక ప్రదాతలు, డెవలపర్లు, పెట్టుబడిదారులు, వాణిజ్య, పారిశ్రామిక ఇంధన వినియోగదారులను ఒకచోట చేర్చుతుంది. ఇందులో 25 మందికి పైగా వక్తలు, 200 మంది ప్రతినిధులు మరియు 50 మంది వాణిజ్య, పారిశ్రామిక ఇంధన వినియోగదారులు హాజరవుతారని అంచనా. ఇది సోలార్‌ప్లస్ స్టోరేజ్‌లో వ్యాపార నమూనాలు, గ్రిడ్ అనుసంధానం, విద్యుత్ నాణ్యత, స్థితిస్థాపకత, సాంకేతికత, ఫైనాన్సి ంగ్, నియంత్రణ మరియు కొత్త మార్కెట్ అవకాశాలపై దృష్టి సారించే ఒక ప్రత్యేక వేదికగా నిలుస్తుంది. ఈ సందర్భంగా మంగళవారం నెట్‌జీరో ఎనర్జీ ట్రాన్సి షన్ అసోసియేషన్ వ్యవస్థాపకులు, అధ్యక్షుడు డాక్టర్ రాహుల్ వాలవాల్కర్ మాట్లాడుతూ సౌర విద్యుత్ వినియోగం విస్తరిస్తున్న కొద్దీ, అంతరాయాలతో కూడిన పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిని నమ్మకమైన, పంపిణీ చేయదగిన మరియు అధిక నాణ్యత గల స్వచ్ఛమైన విద్యుత్‌గా మార్చడానికి నిల్వ అనేది కీలకం అవుతుందన్నారు.

# ప్రాణాధార మందులు ఇంత భారమా?

## ఔషధాల ధరలపై 'సుప్రీం' సీరియస్

## అన్నిరకాల మెడిసిన్స్‌పై ఒకే రిటైలర్ మార్జిన్ ఎందుకు అమలుచేయరని ప్రశ్న

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 29:** ప్రాణాలను కాపాడే మెడికల్ ట్యాబ్లెట్లు, ఇంజెక్షన్స్ ధరలు సామాన్యుడికి మోయరాని భారంగా మారుతున్నాయని దేశ అత్యున్నత న్యాయస్థానం కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ప్రశ్నల వర్షం కురిపించింది. దేశంలోని అన్ని రకాల మందులపై ఒకే రకమైన రిటైలర్ మార్జిన్‌ను ఎందుకు అమలు చేయకూడదని సుప్రీంకోర్టు సూటిగా నిలదీసింది. ఔషధ ధరల నియంత్రణ విధానంలో భాగంగా కొన్ని మందులకు ఇస్తున్న 16 శాతం మార్జిన్‌ను అన్ని రకాల నిత్యావసర, నాన్‌ఇన్సెన్షియల్, పేటెంట్ జెనరిక్ మందులన్నింటికీ ఎందుకు వర్తింపజేయలేరని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం కేంద్రాన్ని ప్రశ్నించింది.

మందుల తయారీదారులకు, సామాన్యులకు విక్రయించే ఎంఆర్పీ మధ్య ఉండే భారీ వ్యత్యాసాన్ని గత వార విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఒక క్యాన్సర్ మందు రిటైలర్లకు కేవలం రూ.2,700కే అందజేయబడుతుండగా, అదే మందును పేషెంట్లకు మాత్రం రూ.27,000 ఎమ్ఆర్‌పికి అమ్ముతున్న వైనాన్ని న్యాయస్థానం ఉదాహరణగా పేర్కొంది. దేశంలోని సుమారు 82 శాతం మందులు ధరల నియంత్రణ ఉత్తర్వుల పరిధిలోకి రాకుండా స్వేచ్ఛగా అమ్ముడవుతున్నాయని పిటిషనర్ కిషన్ చంద్ జైన్ కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ భారీ వ్యత్యాసంపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందని న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లోని ఫార్మసీల ద్వారానే రోగులు మందులు, వైద్య పరికరాలు కొనుగోలు చేయాలంటూ బలవంతం చేయడంపై కూడా సుప్రీంకోర్టు మండిపడింది. ఆసుపత్రుల లోపల ఉండే



ఫార్మసీలు చెప్పినంత ధర చెల్లించి మందులు కొనాల్సి వస్తోందని, అసలు రోగులకు బయట కొనుగోలు చేసే స్వేచ్ఛ ఎక్కడ ఉందని కోర్టు ప్రశ్నించింది. ఆసుపత్రులు వసూలు చేస్తున్న గరిష్ఠ ధరల వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు అప్పులపాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. రోగుల బలహీనతను ఆసరా చేసుకుని ఆసుపత్రులు చేస్తున్న ఈ వ్యాపార ధోరణికి అడ్డుకట్ట వేయాల్సిన సమయం ఆసన్నమైందని స్పష్టం చేసింది. ప్రభుత్వం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ కేఎం నటరాజ్ మాట్లాడుతూ పేదలకు సరసమైన ధరలకే మందులు అందించేందుకు కేంద్రం కట్టుబడి ఉందని, మెరుగైన విధానాల రూపకల్పనకు సిద్ధంగా ఉన్నామని కోర్టుకు తెలిపారు. మరోవైపు, ఫార్మా కంపెనీల తరఫున సీనియర్ అడ్వకేట్ కపిల్ సిబల్ వాదిస్తూ రిటైలర్ ధరలకు, ఎంఆర్‌పీకి మధ్య కనిపించే భారీ లాభం పూర్తిగా ఫార్మా కంపెనీల వద్దే ఉండిపోదని, సరఫరా గొలుసులోనివివిధ దశలను పరిశీలించాలని కోర్టును కోరారు. తదుపరి విచారణ అక్టోబర్ 12కి వాయిదా ప్రస్తుతానికి మందుల ధరల నియంత్రణపై సుప్రీంకోర్టు ఎలాంటి తుది ఉత్తర్వులు జారీ చేయనప్పటికీ, న్యాయస్థానం లేవనెత్తిన ప్రశ్నలు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. మెడికల్ పరికరాలు, మందుల ధరలు మరియు జెనరిక్ మందుల విధివిధానాలపై దాఖలైన పలు పిటిషన్లను విచారించిన ధర్మాసనం తదుపరి విచారణను అక్టోబర్ 12వ తేదీకి వాయిదా వేసింది. ఈ లోపు ఈ అంశంపై సమగ్ర నివేదిక అందజేయాలని కోర్టు భావిస్తోంది.

# మిలటరీ ఆయుధాల చోరీ కేసు కొత్తమలుపు

## నిందితుడు మల్లేష్‌కు మరో ఇద్దరి సహకారం

## పోలీసుల అదుపులో ఆయుధాగారం ఇన్‌ఛార్జిలు

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన బొల్లారంలోని మిలటరీ కేంద్రంలో ఆయుధాలు, మందుగుండు సామాగ్రి చోరీ కేసు సంచలన మలుపు తిరిగింది. గత నెల 30వ తేదీ రాత్రి ఈ చోరీ జరగడం తెలిసిందే. ఈ చోరీ తాలూకు నిందితుడు ఇదే రిజ్‌మెంట్‌లో పనిచేసిన మాజీ సైనికుడు బలవంతంగా పదవీవిరమణ అయిన హావల్దార్ మల్లేష్ అలియాస్ రాజుగా తేలడం తెలిసిందే. పక్కా వ్యూహంతో ఉన్నతాధికారులపై కక్షగట్టిన మల్లేష్ ఈ నేరానికి పాల్పడినట్లు పోలీసులు తేల్చారు. తనను బలవంతంగా పదవీ విరమణ చేయిం చినందుకు రెండు నెలల ముందుగానే ఈ చోరీకి ఇతను స్కెచ్ వేసినట్లు తెలిసింది. ఈ కేసులో మల్లేష్ పట్టుబడిన తరువాత ఆయుధాలు, మందుగుండు సామాగ్రి పట్టుబడగా దీనిపై మరింత లోతుగా విచారించేందుకు నిందితుడిని పది రోజుల కస్టడీ నిమిత్తం బొల్లారం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మంగళవారం నాటికి ఎనిమిది రోజుల కస్టడీ పూర్తయ్యింది. గురువారం నాడు ఇతన్ని తిరిగి చంచల్‌గూ డ జైలుకు తరలించాల్సి వున్న తరుణంలో అనూహ్యంగా ఈ కేసులో కొత్త అంశాలు వెలుగు చూశాయి. మిలటరీ అధికారులు, పోలీసులు ఊ హించినట్లుగానే ఆయుధాలు, మందు గుండు సామాగ్రి చోరీ కేసులో మల్లేష్‌కు మరో ఇద్దరు సహకరించినట్లు తేలింది. ఆయుధాలు, మందుగుండు సామాగ్రి భద్రపరిచే ఆయుధగారం ఇంఛార్జిలుగా వున్న హావల్దార్లు వినోద్, శేషులు చోరీ సమయంలో మల్లేష్‌కు సహకరించినట్లు కస్టడీ వి చారణలో వెలుగు చూసింది.

ఆగస్టు 30వ తేదీ రాత్రి వినోద్, శేషులు ఆయుధగారం వద్ద డ్యూటీలో వున్నారు. వీరిద్దరే ఆయుధగారం తాళా లు బద్దలుకొట్టి మల్లేష్‌కు ఆయుధాలు, మందు గుండు సామాగ్రిని ఇచ్చినట్లు పోలీసుల తాజా విచారణలో తేలింది. ఆయుధాలు, మందు గుం డు సామాగ్రిని చోరీ చేసిన తరువాత వాటిని కారులో తరలించేందుకు మల్లేష్‌కు వీరిద్దరు సహకరించినట్లు తేలింది. కాగా ఈ ఘటనలో తనకు సహకరించినందుకు వినోద్, శేషులకు సుమారు మల్లేష్ మూడు లక్షల రూపాయల నగదు చెల్లించినట్లు తేలింది. ఈ చెల్లింపుల్లో ఆయుధాల చో రీకి ముందు కొంత తరువాత మిగతాది ఇచ్చినట్లు తేలింది. కాగా తాజాగా వెలుగు చూసిన వివరాల ఆధారంగా నాగర్‌కర్నూలులోని మల్లేష్ మామ ఇల్లు వున్న శ్రీపురంలో పోలీసులు మరోసారి సోదాలు చేయగా కొన్ని బుల్లెట్లు లభ్యమయ్యాయి. వీటిని పోలీసులు జప్తు చేసి బొల్లారం పోలీసు స్టేషన్‌కు తరలించారు. కాగా ఈ ఘటనలో మరిన్ని విషయాలు వెలికి తీసేందుకు వినోద్, శేషులను బొల్లారం పోలీసులు కస్టడీలోకి తీ సుకుని విచారిస్తున్నారు. వీరిద్దరిని బుధవారం నాడు రిమాండుకు తరలించే వీలుంది. అనంతరం వీరిని మరోదఫా కస్టడీలోకి తీసుకుని విచారించే వీలుంది. ఈ కేసులో మిలటరీ అధికారుల విచారణ వేరుగా సాగుతోంది.

# పండుగ సీజన్.. హైటెక్‌సిటీ స్టేషన్‌లో 10 రైళ్లకు తాత్కాలిక హాల్ట్

**హైదరాబాద్ (తార్నాక), సెప్టెంబరు 29, ప్రభాతవార్త :** పండుగ సీజన్‌లో ప్రయా ణికుల రద్దీని నియంత్రించేందుకు దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసు కుంది. లింగంపల్లి, సికిందరాబాద్ స్టేషన్లపై అదనపు రద్దీని తగ్గిం చేందుకు హైటెక్‌సిటీ రైల్వే స్టేషన్‌లో 10 రైళ్లకు మూడు నెలలపాటు తాత్కాలికంగా హాల్ట్ కల్పించనుంది.



ఈ సౌకర్యం 2026 నవంబరు 1 నుంచి 2027 జనవరి 31 వరకు అమల్లో ఉంటుంది. తాత్కాలికంగా హైటెక్‌సిటీ స్టేషన్‌లో ఆగే రైళ్ల వివరాలు ఇలా ఉన్నాయి: 22718 సికిందరాబాద్-రాజ్‌కోట్: మధ్యాహ్నం 3.30-3.31 గంటలకు, 22717 రాజ్‌కోట్-సికిందరాబాద్: ఉదయం 6.19-6.20 గంటలకు, 20967 సికిందరాబాద్-పోర్‌బందర్: మధ్యాహ్నం 3.30-3.31 గంటలకు, 20968 పోర్‌బందర్- సికింద రాబాద్: ఉదయం 6.19-6.20 గంటలకు, 12731 తిరుపతి- సికింద రాబాద్: ఉదయం 6.08-6.09 గంటలకు, 12732 సికిందరాబాద్- తిరుపతి: ఉదయం 4.35-4.36 గంటలకు, 12702 హైదరాబాద్- సీఎస్ఎంటీ ముంబై: తెల్లవారుజామున 3.17- 3.18 గంటలకు,12701 సీఎస్ఎంటీ ముంబై- హైదరాబాద్: ఉదయం 11.07- 11.08 గంటలకు,12025 పుణే-హైదరాబాద్: మధ్యాహ్నం 1.33-1.34 గంటలకు,12026 హైదరాబాద్-పుణే: మధ్యాహ్నం 3.00- 3.01 గంటలకు. ఇప్పటికే సికిందరాబాద్ లేదా హైదరాబాద్ నుంచి పైరైళ్లలో ప్రయాణానికి రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు అవసరమైతే ఎలాంటి అదనపు ఛార్జీలు లేకుండా తమ బోర్డింగ్ పాయింట్‌ను హైటెక్ సిటీకి మార్చుకుని అక్కడి నుంచి రైలు ఎక్కే అవకాశం కల్పించినట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఆన్‌లైన్‌లో లేదా రైల్వే కౌంటర్ల ద్వారా నిబంధనల ప్రకారం బోర్డింగ్ పాయింట్ మార్చుకోవచ్చని పేర్కొంది. పండుగల సందర్భంగా ప్ర యాణికులు ఈ సదుపాయాన్ని వినియోగించుకుని సౌకర్యవంతమైన, ఇబ్బం దుల్లేని ప్రయాణం చేయాలని దక్షిణమధ్య రైల్వే విజ్ఞప్తి చేసింది.

# అసెంబ్లీ వద్ద మహిళా ఎమ్మెల్యేలతో అమర్యాదగా ప్రవర్తించిన పోలీసులను గుర్తించండి

## డిజిపికి హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** ఈ నెల ఏడవ తేదీన అసెంబ్లీ వర్షాకాలం సమావేశాల మొదటి రోజున నల్ల టీ షర్టులు ధరించి వ చ్చిన బిఆర్ఎస్ ఎంఎల్ఎలకు శాసనసభ గేటు వద్ద బందోబస్తులో వున్న పోలీసులకు మధ్య జరిగిన గొడవ కొత్త మలుపు తిరిగింది. ఈ ఘట నలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన మహిళా ఎంఎల్ఎలతో అమర్యాదగా ప్రవర్తించిన పోలీసులను వెంటనే గుర్తించి దీనిపై శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు నివేదిక ఇవ్వాలని హైకోర్టు మంగళవారం నాడు డిజిపి ఆనందకు ఆదేశాలు జారీ చేసింది. తమపట్ల పోలీసులు అమానుషం గా ప్రవర్తించారని, దీనిపై వెంటనే విచారణ జరిపి పోలీసులపై చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ ఎంఎల్ఎలు దాఖలు చేసిన పిటిషన్‌పై జరిగిన విచారణ సందర్భంగా హైకోర్టు ఈ ఆదేశాలు ఇచ్చింది.

శాసనసభ ప్రాంగణంలో ఏం జరిగినా దీనిపై చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు వుందని హైకోర్టు పేర్కొంది. ఈ సందర్భంగా మహిళా ఎంఎల్ఎలు పోలీసులతో అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆధారాలు లేవని హైకోర్టు పేర్కొంది. ఇదే విషయమై గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను న్యాయస్థానం సవరించింది. ఈ కేసులో స్పీకర్ ఉత్తర్వులను మార్చేందుకు కారణాలు కనపించడం లేదని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఈ ఘటన అసెంబ్లీ గేటు లేదా గేటు బయట జరిగివుంటే దీనికి సంబంధించిన రిపోర్టును కోర్టుకు సమర్పించాలని న్యాయస్థానం ఆదేశించింది. దీనిపై తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

# నిమ్స్ అదనపు సూపరింటెండెంట్ లక్ష్మీభాస్కర్ బినామీలపై ఎసిబి దాడులు

## 4.94 లక్షల నగదు, రూ 3.77 కోట్ల ఆస్తులు, 20 లక్షల పెట్టుబడుల పత్రాలు లభ్యం

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** నగరంలోని నిమ్స్ ఆసుపత్రి అదనపు సూపరింటెండెంట్ నోరీ లక్ష్మీ భాస్కర్ అక్రమాస్తుల కేసు కొత్త మలుపు తిరిగింది. ఈ నెల 22న లక్ష్మీభాస్కర్‌ను ఎసిబి అధికారులు అక్రమాస్తుల కేసులో అరెస్టు చేయడం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన వద్ద వంద కోట్ల రూపాయల వరకు ఆస్తులు, నగలు, నగదు లభ్యమవడం విదితమే. ఆయన ప్రస్తుతం చంచల్‌గూడ జైల్లో రి మాండులో వున్నారు. గతంలో ఒకసారి లక్ష్మీ భాస్కర్ వైద్యుడుగా వున్న సమయంలో రోగి నుంచి లంచం తీసుకున్న ఘటనలో డిస్మిస్ కాగా కొన్నేళ్ల తరువాత పెద్దల జోక్యంతో మళ్లీ విధుల్లో చేరాడు. కాగా తాజా కేసులో మరింత లోతుగా విచారించాలని నిర్ణయించిన ఎసిబి అధికారు లు మంగళవారం నాడు లక్ష్మీ భాస్కర్ బినామీలపై దాడులు చేబట్టారు. లక్ష్మీ భాస్కర్‌కు బినామీలుగా వున్న ఐదుగురిని గుర్తించిన ఎసిబి అధి కారులు వారి ఇళ్లపై దాడులు నిర్వహించారు.

ఇందులో నిమ్స్‌లో క్షురకుడుగా వున్న ధన్‌రాజ్ అనే వ్యక్తి ఇంట్లో సోదాలు చేయగా నాలుగు లక్షల 94 వేల 394 రూపాయల నగదు లభ్యమయ్యింది. దీంతోపాటు మహేశ్వరంలో మూడు చోట్ల 57 లక్షల రూపాయల విలువ చేసే వ్యవసాయ పొలాలు, బంజారాహిల్స్‌లోని ఎంఎల్ఎ కాలనిలో రెండు కోట్ల 70 లక్షల రూపాయల విలువచేసే ఒక ప్లాట్ తాలూకు పత్రాలు లభ్యమ య్యింది. దీంతోపాటు నిమ్స్‌లో అవుట్ సోర్సి ంగ్ ఉద్యోగి గణేష్ వద్ద 20 లక్షల రూపాయలు రెండు చోట్ల పెట్టుబడులుగా వుంచినట్లు తేలింది. దీని తరువాత మూడు లక్షల రూపాయలు మరో ఇద్దరికి అప్పుగా ఇచ్చినట్లు రసీదులు లభించాయి. ఈ కేసులో బినామీలను విచారిస్తున్నారు. దీనిపై ఒకటి రెండు రోజుల్లో బినామీలను కూడా అరెస్టు చేసే వీలుంది.

# ఎస్సీ గురుకులాల సొసైటీ కార్యదర్శిగా రవి బాధ్యతల స్వీకరణ

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాల సొసైటీ (టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి గుగులోతు రవి బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ మాసాబ్‌ట్యాంక్‌లోని డిఎస్ఎస్ భవన్‌లో గల సంస్థ ప్రధాన కార్యాలయంలో కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం కార్యదర్శి పనిచేస్తున్న కంభంపాటి శారద నుండి ఆయన అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా, ప్రధాన కార్యాలయ అధికారులు మరియు ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రవి వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో సంస్థ పనితీరు గురించి తెలుసుకోవడంతో పాటు, వారి వారి విధులు, బాధ్యతలు, కీలక కార్యాచరణ సమస్యల వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే, ఆయన సంస్థ ప్రధాన కార్యాలయంలోని అన్ని విభాగాలను సందర్శించి తనిఖీ చేశారు. ఆయన అధికారులు, సిబ్బందితో నేరుగా సంభాషించి, వారి బాధ్యతలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, వివిధ స్థాయిలలో పెండింగ్‌లో ఉన్న విషయాల గురించి ఆరా తీశారు. ప్రధాన కార్యాలయ పనితీరు కేవలం ఫైళ్ల బదిలీకే పరిమితం కాకూడదని, క్షేత్రస్థాయిలో విద్యార్థులకు అందించే సేవలు, సౌకర్యాల నాణ్యతతో అది సన్నిహితంగా ముడిపడి ఉండాలని ఆయన నొక్కి చెప్పారు.

# ప్రభుత్వ నిరక్ష్యంతో ఆగమవుతున్న రైతులు

## తక్షణమే ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన అమలుచేయాలి

## నేడు నల్గొండ జిల్లాలో బిజెపి బృందం క్షేత్రస్థాయి పరిశీలన

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** తెలంగాణలో ప్రకృతి సహకరించక, అటు ప్రభుత్వ ఆసరా లేక రైతులు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మండిపడ్డారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, కరెంట్ కోతలతో రాష్ట్ర రైతాంగం తీవ్ర ఆందోళనలో కొట్టుమిట్టాడుతుందన్నారు. దేశవ్యాప్తంగా అన్నదాతలకు భరోసా కల్పించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని తెలంగాణలో అమలు చేయకపోవడం క్షమించరాని నేరమని ఫైరయ్యారు. సైద్ధాంతికంగా తమను వ్యతిరేకించే కేరళ కమ్యూనిస్టు ప్రభుత్వం సైతం ఈ పథకాన్ని అమలు చేస్తుంటే, తెలంగాణలో మాత్రం పాలకుల నిరక్ష ్యం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**నేడు నల్గొండ జిల్లాలో**

**బిజెపి రైతు పర్యటన: బస్వాపురం లక్ష్మీనర్సయ్య**

బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బస్వాపురం లక్షీ ్మనర్సయ్య మాట్లాడుతూ.. ఎన్నికల ముందు 24 గంటల ఉచిత నాణ్యమైన కరెంట్ ఇస్తామని వరంగల్ డిక్లరేషన్, మేనిఫెస్టోల్లో గొప్పగా చెప్పుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం, నేడు తీవ్రమైన కరెంట్ కోతలతో పంటలను ఎండబెడుతుందని దుయ్యబట్టారు. ఎల్‌నినో వల్ల వర్షాలు లేక, అప్పులు చేసి బోర్లు వేసుకుంటే.. కరెంట్ లేక భూమిలోంచి నీరు తోడుకోలేక కళ్లముందే పంటలు ఎండిపోతుంటే రైతులు కన్నీరుమున్నీరవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# ఆధారాలతోనే మాట్లాడుతున్నా..

## బిఆర్ఎస్ అధినేత నిర్ణయాన్నే వ్యతిరేకించడం పార్టీ వ్యతిరేకచర్య కాదా?

## అహంకారం.. అక్రమ దందాలతో పార్టీని పాతాళంలోకి నెట్టారు

## కెటిఆర్‌పై తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ధ్వజం

**హైదరాబాద్, సెప్టెంబరు 29,ప్రభాతవార్త:** తాను ఏవిషయమైనా నిర్దిష్టమైన ఆధారాలతోనే మాట్లాడుతానని.. తనతో పెట్టుకోవద్దని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. తాను విష నాగుల చెరలో లేనని.. వారు చెప్పే మాటలు విని ఏది పడితే అది మాట్లాడబోనని స్పష్టం చేశారు. అహంకారం.. అక్రమ దందాలతో బీఆర్ఎస్ ను పాతాళంలోకి నెట్టిందే మీరు అని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై "ఎక్స్" వేదికగా ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలతోనే అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ ఓడిపోయిందన్న కేటీఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డారు. తాను బీఆర్ఎస్‌లో ఒక్క అవినీతి గుంటనక్కను విమర్శిస్తే కొన్ని గంటల్లోనే తనను పార్టీ నుంచి సస్పెండ్ చేశారని.. అదే గుంటనక్కతో అంటకాగుతూ పార్టీ అధినేతను తీరును బహిరంగంగా ప్రశ్నించడం పార్టీకి వ్యతిరేకం కాదా అని నిలదీశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని సంపాదించుకున్న ఫాంహౌస్‌లు, అక్రమంగా ఇచ్చిన పర్మిషన్లు, ఆంధ్రా దోస్తులకు ఇచ్చిన నజరానాలు, క్విడ్ ప్రో కో దందాలతో పార్టీని పాతాళంలోకి నెట్టిన వాళ్లే ఇప్పుడు ఆపార్టీ అధినేతను తప్పుపట్టడంపై కవిత మండిపడ్డారు. కూర్చున్న కొమ్మనే నరుక్కున్నట్టు పార్టీలో ఆయన వైఫల్యాన్ని, ఆయన చేత గాని తనాన్ని బీఆర్ఎస్ అధినేతపై మోపుతున్నారంటే ప్రత్యక్ష రాజకీయాల్లో మీ స్థానం ఏమిటో అర్థమవుతుందా అని ప్రశ్నించారు. గణేశ్ నిమజ్జనోత్సంలో సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్లను బతిమాలుకొని పాటలు ప్లే చేయించుకున్న విషయం గణేశ్ మహారాజ్‌కు.. కేటీఆర్ అంతరాత్మకు తెలుసన్నారు. తెలంగాణ భవన్ లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఒక రైతు ఫోన్ మాట్లాడుతుంటే నీ పెండ్లామా!? అంత అర్జెంటా!? అని అహంకారంతో అతని భార్యను అవమానించారని.. గతంలో సాయం కోసం వెళ్లిన మహిళను 'నా కోసం కన్నావా అని ఆమె మాతృత్వాన్ని అవమానించారని గుర్తు చేశారు. గుంటనక్క మైండ్ గేమ్ ను బ్లైండ్‌గా నమ్ముతూ పెద్ద మనిషిని తప్పు పడుతూ బీఆర్ఎస్ పార్టీకి గోతిని తవ్వుతున్నావని హెచ్చరించారు.

# తొమ్మిది శాతం మందిలో పెరుగుతున్న ఆత్మహత్య భావన!

# తీవ్ర మానసిక క్షోభతో విద్యార్థులు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 29:** దేశంలోని ఉన్నత విద్యా సంస్థల్లోని విద్యార్థులు తీవ్ర మానసిక క్షోభను అనుభవిస్తున్నారు. దీనికి గల కారణాలను అన్వేషించేందుకు సుప్రీంకోర్టు నియమిత ప్యానెల్ విద్యార్థులపై సర్వే చేపట్టింది. సూసైడ్ ఆలోచనలతో సతమతం అవుతున్న విద్యార్థుల సంఖ్య 9 శాతంగా ఉన్నట్లు దేశవ్యాప్తంగా నిర్వహించిన సర్వే ఆధారంగా వెల్లడైనట్లు సుప్రీం నియమిత ప్యానెల్ తెలిపింది. ఇక ఉన్నత విద్యా సంస్థల్లో సుమారు 15 శాతం మంది విద్యార్థులు గత ఆరు నెలల్లో కొన్ని సందర్భాల్లో అత్యంత సంతోషాన్ని, కొన్ని సందర్భాల్లో బాధను ఎదుర్కొన్నట్లు సర్వేలో తేల్చారు. సర్వేకు చెందిన వివరాలను ఓ మీడియా సంస్థ సేకరించింది. వి ద్యార్థుల్లో ఉన్న మానసిక ఆందోళనలను తగ్గించేందుకు, వారిలో ఆత్మహత్య ఆలోచనల్ని తగ్గించేందుకు సర్వే ద్వారా వివరాలను సేకరించారు. నేషనల్ టాస్క్ ఫోర్స్ దీనిపై నివేదికను తయారు చేసింది. అక్టోబర్ 31వ తేదీన ఆ నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నారు. ఇటీవల ఐఐటీ ఢిల్లీ, ఐఐటీ బాంబే విద్యా సంస్థల్లో ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్య చేసుకుని ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. గతంలోనూ సుప్రీం నియమిత ప్యానెల్ ఓ తాత్కాలిక రిపోర్టును సమర్పించింది. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న వారిలో సామాజిక అసమానతలు ఉన్నాయని, ఇక మెడికల్, ఇంజినీరింగ్ కాలేజీల్లో లైంగిక వేధింపులు ఎక్కువగా ఉన్నట్లు ఆ రిపోర్టులో తెలిపారు. మెడికల్, లా, స్టేట్ యూనివర్సిటీల్లోని బోధనా సిబ్బందిలో లింగ వ్యత్యాసం ఉందన్నారు. నీట్ యూజీ, జేఈఈ ర్యాంకుల్లో కులం ఆధారంగా గుర్తింపు, కుల వివక్ష, కులం పేరుతో అవమానాలు, అడ్మిషన్ సమయంలో కుల ప్రస్తావన లాంటి అంశాల వల్ల విద్యార్థుల్లో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు ఆ రిపోర్టులో తెలిపారు. ఎన్‌టీఎఫ్ రిపోర్టు ప్రకారం సుమారు 2.43 లక్షల మంది విద్యార్థులను సర్వేలో భాగంగా ప్రశ్నించారు. దీంట్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కేటగిరీకి చెందిన 67 శాతం మంది ఉన్నారు. అయితే వీరిలో 34 శాతం మంది క్యాంపస్‌లో బయటి వ్యక్తులు ఫీలవుతున్నట్లు చెప్పారు.

సుమారు 15 శాతం మంది విద్యార్థులు గత ఆరు నెలలుగా బాధకు గురైనట్లు పేర్కొన్నారు. కొన్ని వారాల పాటు ఆందోళనతో ఉన్నట్లు విద్యార్థులు చెప్పారు. ఆత్మహత్య చేసుకోవాలన్న భావనలను గత ఏడాది నుంచి తరుచూ వస్తున్నట్లు సుమారు 9 శాతం మంది పేర్కొన్నారు. ఇక విద్యాసంస్థల్లో ఎదురయ్యే పరిస్థితిని చక్కదిద్దేందుకు 56 శాతం యాజమాన్యాలు సమర్థంగా ఉన్నట్లు రిపోర్టులో తెలిపారు. 32 శాతం విద్యాసంస్థల్లో కౌన్సిలింగ్ సేవలు లేనట్లు తెలిసింది. గత కొన్ని నెలలుగా ఎన్టీఎఫ్ సుమారు 19 విద్యా సంస్థలతో 30 మీటింగ్‌లు నిర్వహించింది.

ఢిల్లీ, ఎన్సీఆర్, తమిళనాడు, కర్నాటక, అస్సాం, పశ్చిమ బెంగాల్‌లో ఎన్టీఎఫ్ విద్యాసంస్థలతో మాట్లాడింది. గత ఏడాది మార్చిలో ఎన్టీఎఫ్‌ను సుప్రీం నియమించింది. ఆ ప్యానల్‌కు జస్టిస్ ఎస్ రవీంద్ర భట్ అధిపతిగా ఉన్నారు. ఆయనతో పాటు కొంత మంది నిపుణులు ఆ బృందంలో ఉన్నారు. ప్రఖ్యాత సైక్రియాట్రిస్ట్ అలోక్ సారిన్, మేరీ ఈ జాన్, అర్మాన్ అలీ, రాజేంద్ర కచ్రూ, సీమా మెహరోత్రా, నిమ్‌హాన్స్ ఆ బృందంలో ఉన్నారు.

# రాష్ట్రంలో భారీగా పెరిగిన విద్యుత్ వినియోగం

## అత్యధికంగా 19,133 మెగావాట్ల గరిష్ట డిమాండ్

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** తెలంగాణలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరుగుతోంది. ట్రాన్స్‌కో వర్గాల నివేదిక ప్రకారం ఈ నెల 28, మధ్యాహ్నం 12:56 గంటలకు రాష్ట్ర వ్యాప్తంగా 19,133 మెగావాట్ల (326.70 మిలియన్ యూనిట్ల) గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రాష్ట్రంలో నమోదైన గరిష్ట విద్యుత్ డిమాండ్ ఈ నెల 9న ఉదయం 10:41 గంటలకు 19,543 మెగావాట్ల మేర నమోదైంది. అలాగే దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో మంగళవారం రికార్డు స్థాయిలో అత్యధికంగా 12,044 మెగావాట్ల మేర వినియోగం జరిగింది. ఇంతకుముందు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నమోదైన గరిష్ట విద్యుత్ డిమాండ్ ఈ నెల 11న 11,828 మెగావాట్లు నమోదైంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఈ నెల 28న 4,072 మెగావాట్ల గరిష్ట డిమాండ్ నమోదవగా, 82.89 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీహెచ్‌ఎంసీ పరిధిలో ఇప్పటివరకు నమోదైన గరిష్ట డిమాండ్ మే 22న 4,782 మెగావాట్లుగా ఉంది.

# ఉద్యోగులు.. క్రీడలు, కళలపై ఆసక్తి పెంచుకోవాలి

### మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్,సెప్టెంబరు29,ప్రభాతవార్త:** ఉద్యోగులు విధులను సమర్థంగా నిర్వర్తించడంతో పాటు క్రీడలు, కళలు, సాంస్కృతిక కార్యక్రమాలపై ఆసక్తి పెంచుకోవాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సచివాలయ సాంస్కృతిక ఉత్సవానికి మంత్రి జూపల్లి కృష్ణారావు, స్పెషల్ సీఎస్ మహేష్ దత్ ఎక్కా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉద్యోగులు నిత్యం ఎంతో బిజీగా, పని ఒత్తిడితో విధులు నిర్వర్తిస్తుంటారని తెలిపారు. ఉద్యోగి పని సామర్థ్యంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యం కూడా ముఖ్యమన్నారు. క్రీడలు, కళలు, సాహిత్యం, సంగీతం, నృత్యం మనసుకు శారీరక, మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని మంత్రి అన్నారు.

సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బందిలో దాగి ఉన్న కళా ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఉద్యోగులు కేవలం ఫైళ్లు, విధులు, బాధ్యతలకే పరిమితం కాకుండా తమలోని సృజనాత్మకతను కూడా వెలికితీయాలని సూచించారు. గెలుపు, ఓటమి కంటే కార్యక్రమాల్లో పాల్గొనడం, తమ ప్రతిభను ప్రదర్శించడం, సహోద్యోగులతో కలిసి ఆనందాన్ని పంచుకోవడం ముఖ్యమని చెప్పారు. ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని పెంచేందుకు తరచుగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకోవాలని జూపల్లి సూచించారు. ఉద్యోగులు బాగా పనిచేస్తే దాని ప్రభావం ప్రభుత్వ పనితీరు, ప్రజలకు అందే సేవలపై ఉంటుందని అన్నారు. విధులతో పాటు ఆటలు, క్రీడలు, పాటలపై ఆసక్తి పెంచుకోవడం వల్ల ఉద్యోగుల్లో కొత్త ఉత్సాహం వస్తుందని పేర్కొన్నారు. భారతదేశానికి ఎంతో ప్రాచీనమైన సంస్కృతి, సంప్రదాయాలు, కళలు ఉన్నాయని మంత్రి తెలిపారు. విదేశాల్లో స్థిరపడిన భారతీయులు సైతం తమ పిల్లలకు భారతీయ కళలు, సంస్కృతిని నేర్పిస్తున్నారని గుర్తుచేశారు. ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తూనే మన పూర్వీకులు అందించిన కళలు, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాన్ని మంత్రి గుర్తుచేసుకున్నారు. 2011లో ఎమ్మెల్యే, మంత్రి పదవులకు రాజీనామా చేసి ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పాదయాత్ర చేపట్టిన సమయంలో ఆటపాటలే తనకు ఎంతో స్ఫూర్తినిచ్చాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించి ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఎంతో మంది ప్రాణత్యాగాలు చేశారని అన్నారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని ఆకాంక్షించారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఉద్యోగులలోని సాంస్కృతిక కార్యక్రమాలకు సాంస్కృతిక శాఖ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంగీత దర్శకుడు రాధాకృష్ణ, తెలంగాణ సచివాలయ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు గిరి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జే. ప్రేమ్, ఉపాధ్యక్షులు నవీన్‌కుమార్, కల్చరల్ సెక్రటరీ యామిని కనకతార తదితరులు పాల్గొన్నారు.



మంగళవారం సచివాలయ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సచివాలయ సాంస్కృతిక ఉత్సవంలో పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు

## చౌకగా లభించే సింగరేణి బొగ్గును కాదని విదేశీ బొగ్గు కొనుగోలు

### టన్నుకు రూ.3,800 బదులు రూ.9000 చెల్లిస్తున్నారు

### కాంగ్రెస్ ప్రభుత్వం మరో తుగ్లక్ నిర్ణయం : మాజీ మంత్రి కెటిఆర్ ఆగ్రహం

**హైదరాబాద్,సెప్టెంబరు29,ప్రభాతవార్త:** తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం బొగ్గు కొనుగోలుపై కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు. దీనిని కాంగ్రెస్ ప్రభుత్వ మరో తుగ్లక్ నిర్ణయంగా ఆయన అభివర్ణించారు. ఈ మేరకు మంగళవారం సోషల్ మీడియా వేదికగా ఎక్స్ ద్వారా ఆయన తన నిరసనను వ్యక్తం చేశారు. చౌకగా లభించే సింగరేణి బొగ్గును పక్కనపెట్టి, భారీ ధర చెల్లించి విదేశీ బొగ్గును దిగుమతి చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించడంపై కేటీఆర్ మండిపడ్డారు. సింగరేణి బొగ్గు టన్నుకు సుమారు రూ.3,800కే అందుబాటులో ఉండగా, విదేశాల నుంచి దాదాపు రూ.9,000 వెచ్చించి దిగుమతి చేసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవడాన్ని ఆయన ఆక్షేపించారు. ఈ నిర్ణయం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగి ఉన్నాయని, ఈ అదనపు భారాన్ని రాష్ట్ర ప్రజలపై ఎందుకు మోపుతున్నారని ఆయన ప్రశ్నించారు. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బొగ్గు నిల్వలు తెలంగాణలో ఉన్నాయనే విషయాన్ని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. గతంలో సింగరేణి సంస్థ ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు సైతం బొగ్గును సరఫరా చేసిందని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సింగరేణి బొగ్గుతోనే టీఎస్ జెన్‌కో నిరంతరాయంగా 24 గంటల విద్యుత్ సరఫరాను అందించిందని వివరించారు. రాష్ట్రంలోనే పుష్కలమైన వనరులు ఉండగా, వాటిని కాదని అధిక ధర చెల్లించి దిగుమతి చేసుకోవడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు.

## కెటిఆర్‌కు సిరిసిల్లలో సినిమా చూపిస్తాం

### ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బుధవారం సిరిసిల్లలో కేటీఆర్‌కు అసలైన సినిమా చూపిస్తామని, ఆ రోజును ఆయన జీవితంలో మర్చిపోలేరని హెచ్చరించారు. మంగళవారం గాంధీభవన్ లో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిరిసిల్ల పర్యటనకు రాకముందే తనపై ఉన్న ఆరోపణలను బయటపెట్టాలని కేటీఆర్ సవాల్ చేయడంపై చామల తీవ్రంగా స్పందించారు. ముఖ్యమంత్రిని సవాల్ చేసే స్థాయి కేటీఆర్‌కు లేదని, ఆయన కేవలం ఒక ఎమ్మెల్యే మాత్రమేనని అన్నారు. సిరిసిల్ల ప్రజల ముందే కేటీఆర్ భూ బాగోతాలను రేవంత్ బయటపెడతారని, ఆయన అసలు స్వరూపం దేశమంతటికీ తెలుస్తుందని అన్నారు. గత తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో సిరిసిల్లలో నిజమైన అభివృద్ధి జరగలేదని, కేవలం శంకుస్థాపనలకే పరిమితమయ్యారని ఆరోపించారు. చిన్న వర్షానికే కలెక్టరేట్ భవనంలోకి వెళ్లలేని పరిస్థితి ఉందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సిరిసిల్లలో రూ.175 కోట్ల రైతు రుణమాఫీ అమలు చేసిందని, సీఎం పర్యటనలో రూ.345.75 కోట్ల పనులకు శ్రీకారం చుట్టనున్నారని తెలిపారు. రూ.200 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్, నేతన్నల కోసం ప్రత్యేక బజార్ వంటి పనులను వివరించారు. మెట్రో, మూసీ ప్రక్షాళన, రీజనల్ రింగ్‌రోడ్ వంటి కీలక ప్రాజెక్టులను బీఆర్ఎస్ అడ్డుకోవాలని చూస్తోందని ఆరోపించారు.

## ప్రతిపక్ష బిఆర్‌ఎస్‌కు పెరిగిన విరాళాలు

### 2025-26లో రూ.16.4 కోట్లుగా నమోదు

### గత యేడాదితో పోలిస్తే పెరిగిన పార్టీ నిధులు

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అధికారం కోల్పోయి ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన విరాళాల పెరుగుదల విశేషం వెలుగులోకి వచ్చింది. అధికారంలో లేనప్పటికీ పార్టీకి విరాళాలు తగ్గకపోగా, గతేడాది కంటే పెరగడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ బీఆర్ఎస్ పార్టీకి రూ.16.4 కోట్ల విరాళాలు అందినట్లు ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన తాజా నివేదికలో ఆ పార్టీ పేర్కొంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో (2024-25) పార్టీకి రూ.15.1 కోట్ల విరాళాలు అందాయి. ప్రతిపక్షంలోకి వచ్చాక కూడా పార్టీకి నిధుల ప్రవాహం పెరగడం గమనార్హం.సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీలకే కార్పొరేట్ సంస్థలు, వ్యాపారవేత్తల నుంచి భారీగా విరాళాలు అందుతాయనేది రాజకీయాల్లో సహజంగా వినిపించే మాట. అయితే, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉండగా, ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్‌కు విరాళాలు పెరగడం ఈ వాదనకు భిన్నంగా ఉంది. ఇది పార్టీ ఆర్థికంగా ఇంకా బలంగానే ఉందని సూచిస్తోందని తెలుస్తోంది.రాష్ట్రంలో 2028లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అధికారాన్ని నిలబెట్టుకోవాలని కాంగ్రెస్, తిరిగి గద్దెనెక్కాలని బీఆర్ఎస్, తొలిసారి పాగా వేయాలని బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఇలాంటి కీలక తరుణంలో బీఆర్ఎస్‌కు నిధులు పెరగడం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపే అంశంగా మారింది.

## తెలంగాణ పోలీసు నియామక మండలికి జాతీయ పురస్కారం

### ఆధార్, ముఖ గుర్తింపు విధానం విజయవంతం

**హైదరాబాద్, సెప్టెంబరు 28: ప్రభాతవార్త:** పోలీసు నియామక ప్రక్రియలో అభ్యర్థుల ఆధార్, ముఖ గుర్తింపు విధానం విజయవంతంగా అమ లు చేస్తున్నందుకు జాతీయ పురస్కారం లభించింది. ఈ విధానం అమలు వల్ల అన్ని అంశాలలో కచ్చితమైన తనిఖీలు చేసేందుకు వీలుండడం తో కేంద్ర విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ ఆధార్ సంవాద్..2026 అవార్డు తెలంగాణ పోలీసు నియామక మండలికి లభించింది. కోల్‌కతాలో మంగళవారం జరిగిన ఐదవ భాగస్వాముల సదస్సులో కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతికత, వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద నుంచి పోలీసు నియామక మండలి ఛైర్మన్ శ్రీనివాసరావు అందుకున్నారు. ఈ సందర్భంగా పోలీసు నియామక ప్రక్రియ పక్కాగా నిర్వహిస్తునందుకు పోలీసు నియామక మండలిని జితిన్ ప్రసాద అభినందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలీసు భర్తీల్లో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు వుండకుడా చేసేందుకు దీనిని అమలు చేస్తున్నట్లు తెలిపారు.

## ఉపాధి కోసం మస్కట్ వెళ్లిన తల్లిని వేధిస్తున్నారు.. సాయం చేయండి

### బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు వినతి

**హైదరాబాద్,సెప్టెంబరు29,ప్రభాతవార్త:** కొడంగల్ పరిధి దౌల్తాబాద్ మండలం గోకపసాల్‌వాడ్‌కు చెందిన రాజు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెండ్ కల్వకుంట్ల తారక రామారావును మంగళవారం తెలంగాణ భవన్‌లో కలిశారు. ఉపాధి కోసం మస్కట్ వెళ్లిన తన తల్లి లక్ష్మి ్మని యజమానులు వేధిస్తున్నారని కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఏడాదిగా తన తల్లి మస్కట్‌లో చిక్కుకుందన్నారు. దీనిపై స్పందించిన కేటీఆర్, ఒమన్ ఎన్ఆర్ఐ విభాగంతో మాట్లాడారు. బాధితురాలిని భారత్‌కు రప్పించే ఏర్పాట్లు చేయాలని కోరారు. రాజు తల్లి లక్ష్మి ్మని రప్పించే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు.

## ఎస్‌ఎల్‌బిసి, కాళేశ్వరం పనులకు ఆర్మీ ఇంజినీరింగ్ అధికారుల సేవలు

### ముగ్గురు అధికారుల పేర్లను రాష్ట్రానికి పంపిన ఆర్మీ ప్రధాన కార్యాలయం

**హైదరాబాద్,సెప్టెంబరు29,ప్రభాతవార్త:** శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ), కాళేశ్వరం ప్రాజెక్ట్ పనులకు ఆర్మీ ఇంజినీరింగ్ అధికారుల సేవలను తెలంగాణ ప్రభుత్వం వినియోగించుకోనుంది. ఇందుకోసం ఆర్మీలోని ఇంజినీరింగ్ అధికారుల సహాయాన్ని సర్కార్ కోరింది. దీనిపై స్పందించిన ఆర్మీ ప్రధాన కార్యాలయం.. ముగ్గురు ఆర్మీ అధికారుల పేర్లు రాష్ట్రానికి పంపించింది. డిప్యుటేషన్‌పై ముగ్గురు అధికారులను తీసుకునే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పర్యవేక్షణకు ఒక ఆర్మీ అధికారి, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లకు ఇద్దరు ఆర్మీ అధికారులను తీసుకోనున్నారు.ఇటీవల ఆర్మీ చీఫ్ జనరల్ ధీరజ్ సేథ్‌తో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ అయిన విషయం తెలిసిందే.

## పాలపిట్టలను బంధిస్తే కఠినచర్యలు

### అటవీ శాఖ కీలక ఆదేశాలు

**హైదరాబాద్,సెప్టెంబరు29,ప్రభాతవార్త:** దసరా సందర్భంగా పాలపిట్టలను బంధించి ప్రదర్శించ కుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అటవీ దళాల అధిపతి వినయ్ కుమార్ ఆదేశించారు. పంజరాల్లో ఉంచితే పాలపిట్టలు ఆహారం తీసుకోక ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. గత దసరా సమయంలో బంధించిన 28 పాలపిట్టలను స్వాధీనం చేసుకుని విడుదల చేసినట్లు వెల్లడించారు. ఉత్సవాల్లో పక్షులను బంధించకుండా దేవాదాయ శాఖ అధికారులు పర్యవేక్షి ంచాలని సూచించారు.

చైనా మాంజా వల్ల పక్షులు, ప్రజలకు ప్రమాదం ఉన్నందున దాని విక్రయాలను అడ్డుకునేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పాలపిట్టల సంరక్షణతో పాటు పక్షులు, ప్రజలకు ప్రమాదకరంగా మారుతున్న చైనా మాంజా విక్రయాల నియంత్రణపై అరణ్యభవన్‌లో అటవీ శాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ సూచనలు చేశారు.

దసరా సందర్భంగా పాల పిట్టలను బంధించి ప్రజలకు చూపించే సంప్ర దాయాన్ని కొందరు పాటిస్తున్నప్పటికీ.. వాటిని పంజరాల్లో ఉంచడం వల్ల పక్షుల ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుందని వినయ్‌కుమార్ తెలిపారు.

పాలపిట్టలు బంధించిన పరిస్థితుల్లో ఆహారం తీసుకోకపోవడంతో బలహీనపడి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని వివరిం చారు. గత దసరా సమయంలో బంధించిన 28 పాలపిట్టలను అటవీ అధికారులు స్వాధీనం చేసుకుని తిరిగి స్వేచ్ఛగా వదిలిపెట్టిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

దసరా ఉత్సవాల్లో పాలపిట్టలను ఎవరూ బంధించకుండా దేవాదాయ శాఖ అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షి ంచాలని అటవీ శాఖ సూచించింది. ఆలయాలు, పండుగ ప్రాంగణాల్లో పాలపిట్టలను పట్టుకుని తీసుకురావడం, పంజరాల్లో ఉంచడం వంటి ఘటనలు కనిపిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించింది. పాలపిట్టలను సహజ వాతావరణంలో స్వేచ్ఛగా చూడటం ద్వారా సంప్రదాయాన్ని కొనసాగించవచ్చని, వాటిని బంధించడం మాత్రం వన్యప్రాణి సంరక్షణకు విరుద్ధమని అధికారులు పేర్కొన్నారు. ఇక సంక్రాంతి సమయంలో గాలిపటాల వినియోగం పెరిగే నేపథ్యంలో చైనా మాంజా విక్రయాలపై కూడా అధికారులు దృష్టి సారించాలని వినయ్‌కుమార్ ఆదేశించారు.

చైనా మాంజా కారణంగా పక్షులు తీవ్రంగా గాయపడటంతో పాటు కొన్ని సందర్భాల్లో ప్రజలకు కూడా ప్రాణాపాయం ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. దాని విక్రయాలు, వినియోగాన్ని అడ్డుకునేందుకు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకోవాలని సూచించారు.

## హైదరాబాద్ సంస్థ ఎగుమతి చేస్తున్న బియ్యంపై అమెరికా ఎఫ్‌డిఏ నిఘా

### పురుగుమందు అవశేషాలపై ఆందోళన

**హైదరాబాద్,సెప్టెంబరు29,ప్రభాతవార్త:** అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (ఎఫ్‌డిఏ) హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థ అమెరికాకు ఎగుమతి చేస్తున్న బియ్యం ఉత్పత్తులపై నిఘా పెట్టింది. సంస్థకు చెందిన పలు రకాల బియ్యం ఉత్పత్తులను పురుగుమందుల అవశేషాలకు సంబంధించిన దిగుమతి హెచ్చరిక జాబితాలో అమెరికా ఎఫ్‌డిఏ చేర్చింది. దీంతో ఈ ఉత్పత్తులు అమెరికా పోర్టులకు చేరిన సమయంలో టెస్టులు నిర్వహించకుండానే వాటిని అధికారులు నిలిపివేసే అవకాశం ఉంటుంది. హైదరాబాద్‌కు చెందిన సంస్థను సెప్టెంబర్ 15న ఎఫ్‌డిఏ ఇంపోర్ట్ అలర్ట్ 99-08లోని లోని భారతదేశానికి సంబంధించిన 'రెడ్ లిస్ట్‌లో చేర్చినట్లు రికార్డులు వెల్లడిస్తున్నాయి. సురక్షితం కాని స్థాయిలో పురుగుమందుల అవశేషాలు ఉన్నట్లు అనుమానించే ప్రాసెస్డ్ ఆహార ఉత్పత్తులకు ఈ హెచ్చరిక వర్తిస్తుంది. ఈ సంస్థకు సంబంధించిన బియ్యం ఉత్పత్తుల విషయంలో క్లోర్‌పైరిఫాస్ అనే పురుగుమందును ఎఫ్‌డిఏ ప్రత్యేకంగా ప్రస్తావించింది.

ఎఫ్‌డిఏ రికార్డుల్లో సదరు సంస్థకు కొండాపూర్‌లోని రాఘవేంద్ర కాలనీ చిరునామాతో పాటు సికింద్రాబాద్‌లో మరో చిరునామా కూడా నమోదైంది. ఈ సంస్థకు సంబంధించిన రెండు రకాల ఉత్పత్తులను హెచ్చరిక జాబితాలో చేర్చారు. వీటిలో ప్రాసెస్ చేసి ప్యాకింగ్ చేసిన జాస్మిన్ రైస్, ప్రాసెస్డ్ ప్యాకేజ్డ్ రైస్ ఉన్నాయి. ఈ రెండు ఉత్పత్తులనూ వైట్ రైస్‌గా పేర్కొంటూ వాటికి సంబంధించిన పురుగుమందుగా క్లోర్‌పైరిఫాస్‌ను నమోదు చేశారు. ఎఫ్‌డిఏ రెడ్ లిస్ట్‌లో ఉత్పత్తి చేరినప్పుడు అమెరికాలోకి దిగుమతి కోసం సమర్పించే సరుకులను అధికారులు సాధారణ భౌతిక తనిఖీ లేకుండానే నిలిపివేయవచ్చు. ఈ విధానం ద్వారా సంబంధిత ఉత్పత్తుల దిగుమతిని నియంత్రించే అవకాశం ఉంటుంది. సదరు సంస్థకు చెందిన బియ్యం ఉత్పత్తుల విషయంలోనూ ఇదే నిబంధన వర్తించనుంది, కాగా.బహిరంగంగా అందుబాటులో ఉన్న రికార్డుల్లో ఈ బియ్యం ఏ బ్రాండ్ పేరుతో విక్రయించబడింది, ఏ బ్యాచ్ లేదా లాట్‌కు చెందినది అనే వివరాలు వెల్లడించలేదు. ఎంత పరిమాణంలో బియ్యం ఎగుమతి చేశారు, అమెరికాలో దాన్ని దిగుమతి చేసుకున్న సంస్థ ఏది, ఏ పోర్టు వద్ద సరుకు నిలిపివేశారు, నమూనాలను ఎప్పుడు సేకరించారు అనే సమాచారం కూడా అందుబాటులో లేదు. ముఖ్యంగా బియ్యంలో క్లోర్‌పైరిఫాస్ ఎంత మోతాదులో ఉన్నట్లు గుర్తించారనే వివరాలు పేర్కొనలేదు. కాగా, తెలంగాణ నుంచి అమెరికాకు పెద్దమొత్తంలో బియ్యం ఎగుమతి అవుతుంది. ముఖ్యంగా తెలంగాణ సోనా (ఆర్ఎన్‌టి-9001), బాస్మతీ రకాలకు అమెరికాలోని భారతీయ జనాభాలో మంచి డిమాండ్ ఉంది. దేశం నుంచి అమెరికాకు ఏటా సుమారు 2.5 లక్షల నుంచి 3.5 లక్షల మెట్రిక్ టన్నుల వరకు బియ్యం ఎగుమతి కాగా.. అందులో హైదరాబాద్ తో పాటు ఉమ్మడి నల్గొండ, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల నుంచి ఏటా సుమారు 40 వేల నుంచి 50 వేల టన్నుల వరకు బియ్యం అమెరికాకు ఎగుమతి అవుతోంది.

## వర్షాభావ మండలాలకు ప్రత్యేక సాయం

### పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత

### రబీ సదస్సులో వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఢిల్లీలో మంగళవారం జరిగిన జాతీయ రబీ సదస్సులో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కరువు మండలాలకు ప్రత్యేక సాయం అందించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో మంగళవారం జరిగిన జాతీయ రబీ సదస్సులో మాట్లాడుతూ తెలంగాణలోని పలు మండలాలు లోటు, తీవ్ర లోటు వర్షపాతాన్ని ఎదుర్కొంటు న్నాయన్నారు. రాష్ట్ర సగటు వర్షపాతం ఆధారంగా కాకుండా మండలాల స్థాయిలో నెలకొన్న వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని, లోటు, తీవ్ర లోటు వర్షపాత మండలాలకు నిధులు మంజూరు చేయాలని చెప్పారు. మైక్రో ఇరిగేషన్, రక్షి త సాగునీరు, నీటి సంరక్షణ నిర్మాణాలకు ప్రత్యేక సహకారం అందించాలన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతకు అనుగుణంగా రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లేలా ప్రోత్సహిస్తున్నామని, ఈ నేపథ్యంలో పప్పుధాన్యాల సాగు గత ఏడాది కంటే ఈ ఖరీఫ్‌లో 36 శాతం అధికంగా సాగైందని తెలిపారు. కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతులకు అండగా నిలిచేందుకు మొక్క జొన్న, జొన్నను ధరల మద్దతు పథకం పరిధిలోకి తీసుకు రావాలని సూచించారు.

రాష్ట్రంలో అదనంగా దాదాపు 1.10 లక్షల హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు విస్తరించిందని, సుమారు 72 వేల మంది కొత్త రైతులు ఆయిల్‌పామ్ సాగులోకి వచ్చారని వివరించారు. ఆయిల్ పామ్ దీర్ఘకాలిక పంట కావడంతో రైతులకు స్థిరమైన, గిట్టుబాటు ధరలు ఎంతో ముఖ్య మని, రైతుల్లో నమ్మకాన్ని కొనసాగిం చేందుకు కేంద్రం తగిన చర్యలు తీసుకోవాల న్నారు.

తెలం గాణలో మట్టి ఆరోగ్య పరీక్షల లక్ష్యాన్ని ప్రస్తుతమున్న సుమారు లక్ష నుంచి రెండు లక్షల నమూనాలకు పెంచాలని చెప్పారు. తెలంగాణలో 33 జిల్లాలు ఉండగా, 16 కృషి విజ్ఞాన కేంద్రాలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. వ్యవసాయ పరిశోధన, విద్య ద్వారా అభివృద్ధి చెందుతున్న కొత్త సాంకేతిక పరిజ్ఞానం వేగంగా రైతులకు చేరాలంటే వ్యవసాయ విస్తరణ వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సి న అవసరం ఉందన్నారు. కొడంగల్‌లో అగ్రి బిజినెస్ పార్క్, సెమీఅరిడ్ హార్టికల్చర్ క్రాప్స్ కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం డీపీఆర్‌లను సమర్పిం చిందన్నారు.



మంగళవారం ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో నిర్వహించిన బిజెపి శ్రేణుల కీలక సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

## పటభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాం

### బూత్ స్థాయి నుంచే బలమైన కార్యాచరణ

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** తెలంగాణలో మహబూబ్‌నగర్ రంగారెడ్డి హైదరాబాద్, వరంగల్, ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఓటర్ల నమోదు ప్రక్రియ (ఫామ్18) అధికారికంగా ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో ఎన్నికల క్షేత్రంలో ఆధిపత్యం సాధించడమే లక్ష ్యంగా ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు అధ్యక్షతన కీలక సన్నాహక సమావేశం జరిగింది. ఉమ్మడి పది జిల్లాలను, దాదాపు 76 అసెంబ్లీ నియోజక వర్గాలను ప్రభావితం చేసే ఈ రెండు ఎన్నికలను పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించడంతో పాటు, బూత్ స్థాయి నుంచే బలమైన కార్యాచరణను రూపొందించేందుకు పార్టీ శ్రేణులకు ఈ సమావేశంలో దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎన్. రాంచందర్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్, బిఆర్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలపై గళమెత్తాలని విద్యావంతులకు పిలుపునిచ్చారు. రాబోయే రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు తెలంగాణలోని దాదాపు 76 అసెంబ్లీ నియోజకవర్గాలపై స్పష్టమైన ప్రభావం చూపనున్నాయి. భవిష్యత్‌లో జరగబోయే రాజకీయ సమరాలకు ముందు ఈ ఎన్నికలు ఒక కీలకమైన రాజకీయ పరీక్షగా నిలవనున్నాయి. ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలు బిజెపికి అత్యంత ముఖ్యమైనవి, ప్రతిష్ఠాత్మకమైనవి. ఎన్నికల కోసం పార్టీ ఇప్పటికే ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి, అన్ని స్థాయిల్లోనూ సమగ్ర కార్యాచరణను ప్రారంభించిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జనసంఘ్ కాలం నుంచే ఈ రెండు పట్టభద్రుల నియోజకవర్గాల్లో బిజెపికి చారిత్రాత్మకంగా బలమైన ప్రజాదరణ, క్షేత్రస్థాయి పట్టు ఉన్నాయన్నారు. రద్దయిన శాసనమండలిని పునరుద్ధరించాలని ఉమ్మడి రాష్ట్రంలోనే బిజెపి బలంగా డిమాండ్ చేసిందన్నారు. పార్లమెంటులో కౌన్సిల్ పునరుద్ధరణ చట్టం (2005) ఆమోదం పొందడంలో బిజెపి సంపూర్ణ మద్దతునిచ్చి, పట్టభద్రులు, ఉపాధ్యాయుల ప్రాతినిధ్య పునరుద్ధరణలో కీలక పాత్ర పోషించిందన్నారు. 2015లో ఈ పట్టభద్రుల స్థానంలో బిజెపి ఘనవిజయం సాధించిందన్నారు. ఆ తర్వాతి ఎన్నికల్లో నాటి అధికార పార్టీ తన రాజకీయ, ఆర్థిక, అధికార యంత్రాంగాన్ని విచ్చలవిడిగా ప్రయోగించినప్పటికీ, బిజెపి హోరాహోరీగా పోరాడి గట్టి పోటీనిచ్చిందని తెలిపారు. ఆ ఎన్నికల్లో అప్పటి పాలకులు సాగించిన అక్రమాలను తెలంగాణ ప్రజలు ఇప్పటికీ మర్చిపోలేదు.ఆ తర్వాత జరిగిన ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికల్లో బిజెపి సాధించిన విజయాలే.. రాష్ట్రంలోని పట్టభద్రులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, మేధావులలో పార్టీకి ఉన్న తిరుగులేని ఆదరణకు ప్రత్యక్ష నిదర్శనం అన్నారు. నేటికీ చైతన్యవంతమైన విద్యావంతులలో బిజెపికి బలమైన మద్దతు కొనసాగుతుందని, రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలను, బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల ప్రజా వ్యతిరేక విధానాలను తెలంగాణ మేధావులు, పట్టభద్రులు నిశితంగా గమనిస్తున్నారన్నారు.

సుదీర్ఘకాలం అధికారంలో ఉన్నప్పటికీ.. పట్టభద్రులు, విద్యావంతులైన యువత, నిరుద్యోగుల ఆకాంక్షలను నెరవేర్చడంలో బిఆర్ఎస్ పార్టీ ఘోరంగా విఫలమైందన్నారు. ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ సమస్యలపై నిరక్ష ్యం వహించడం వల్లనే ఆ పార్టీపై ప్రజల్లో తీవ్రస్థాయి వ్యతిరేకత నెలకొందన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా ప్రజావ్యతిరేకత రోజురోజుకూ పెరుగుతోంది. పెండింగ్ డిఏలు, పిఆర్సీ, పెన్షన్ల సమస్యలపై ప్రభుత్వ ఉద్యోగులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హిందూ దేవుళ్లను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు సమాజంలోని అనేక వర్గాల మనోభావాలను తీవ్రంగా గాయపరిచాయి. తెలంగాణ సమాజం ఈ పరిణామాలన్నింటినీ నిశితంగా గమనిస్తోందని, తగిన సమయంలో ఓటు రూపంలో ప్రజాస్వామ్యబద్ధంగా బుద్ధి చెబుతుందన్నారు.

## జెన్‌కో విద్యుత్ కేంద్రాలకు 75,500 టన్నుల బొగ్గు

### రోజువారీగా 75 వేల టన్నుల సరఫరాకు కార్యాచరణ

### జెన్‌కో, సింగరేణి సిఎండిల భేటీ

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు నిరంతరాయంగా బొగ్గు సరఫరా చేసేందుకు సింగరేణి, తెలంగాణ జెన్‌కో సంస్థలు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాయి. రోజుకు 75,500 టన్నుల బొగ్గు సరఫరా లక్ష్యంపై మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లో సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి, తెలంగాణ జెన్కో సింఎడి డాక్టర్ హారీష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో విద్యుత్ కేంద్రాల వారీగా బొగ్గు అవసరాలు, ప్రస్తుతం జరుగుతున్న సరఫరా, బొగ్గు నాణ్యత, రైల్వే రేకుల అందుబాటు, లోడింగ్-అన్‌లోడింగ్, రవాణాలో ఎదురవుతున్న ఇబ్బందులను సమీక్షించారు. రైలు మార్గంలో 56 వేల టన్నులు రోజుకు 14 రైల్వే రేకుల ద్వారా 56 వేల టన్నులు, రోడ్డు మార్గంలో 19,500 టన్నులు సరఫరా చేసే ప్రణాళికపై సమావేశంలో చర్చించారు. కొత్తగూడెం విద్యుత్ కేంద్రానికి రోజుకు 24 వేల టన్నులు, కాకతీయకు 4,500 టన్నులు, భద్రాద్రికి 15 వేల టన్నులు, యాదాద్రికి 34 వేల టన్నుల బొగ్గు అవసరాలపై కేంద్రాల వారీగా చర్చించారు. యాదాద్రికి సరఫరా కోసం ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్ నుంచి రెండు రేకుల ద్వారా రోజుకు 8 వేల టన్నులు, స్థానిక సింగరేణి గనుల నుంచి ఆరు రేకుల ద్వారా 36 వేల టన్నులు రవాణా చేసే అంశంపై కార్యాచరణ రూపొందించారు. నైనీ నుంచి సరఫరా పెంపునకు చర్యలు తీసుకుంటున్నట్లు సింగరేణి అధికారులు తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే 31 శాతం పెరుగుదలఈ నెలలో 28వ తేదీ నాటికి జెన్‌కో విద్యుత్ కేంద్రాలకు రోడ్డు, రైలు మార్గాల్లో కలిపి 15.02 లక్షల టన్నుల బొగ్గు సరఫరా చేసినట్లు సింగరేణి మార్కెటింగ్ శాఖ అధికారులు వెల్లడించారు. గత ఏడాది సెప్టెంబరులో ఇదే కాలంలో 11.44 లక్షల టన్నులు మాత్రమే సరఫరా కాగా, ఈసారి 3.58 లక్షల టన్నులు, అంటే సరఫరా సుమారు 31 శాతం పెరిగిందని వివరించారు. ఎల్ నినో నేపథ్యంలో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులతో విద్యుత్ డిమాండ్ పెరిగిందని, ఉత్పత్తికి అనుగుణంగా మరింత బొగ్గు అవసరమని జెన్‌కో అధికారులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. రేకుల సమీకరణతో పాటు లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియలను వేగవంతం చేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం కలగకుండా నాణ్యమైన బొగ్గు సరఫరా జరిగేలా ఇరు సంస్థలు కలిసి పనిచేయాలని పేర్కొన్నారు.

# కల్కి భగవాన్ అస్తమయం

## చెన్నైలోని ఆస్పత్రిలో అస్వస్థతతో కన్నుమూత

### దాదాపు ఐదు దశాబ్దాలుగా ఆధ్యాత్మిక సేవలో భక్తులకు మార్గదర్శనం చేసిన కల్కి భగవాన్

**శ్రీకాళహస్తి, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** దేశ,విదేశాల భక్తులను తన ఆధ్యాత్మిక శక్తితో ఆకట్టుకున్న కల్కి భగవాన్ (77) మంగళవారం సాయంత్రం చెన్నైలోని ఓ ఆస్పత్రిలో తుది శ్వాస విడిచినట్లు సమాచారం అందింది. ఆయన మృతదేహాన్ని వరదయ్యపాళెం సమీపంలో ఏకమ్



కల్కి భగవాన్

ఆలయంలో నిర్మించిన హిరణ్య గర్భాలయంలో ఖననం చేయనున్నట్లు తెలిసింది. మూడు రోజుల పాటు ఆయన మృతదేహాన్ని భక్తుల దర్శనార్థం ఏర్పాటు చేసినట్లు తెలిసింది. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైన కల్కిభగవాన్ పేరు విజయ్‌కుమార్ యోగా సాధనతో అద్భుతాలు సృష్టించారు. 1994 వరకు కుప్పంలో సత్యలోకం పేరుతో ఆశ్రమాన్ని నిర్వహించారు. 1980లో కుప్పం చేరిన ఆయన 1994 వరకు అక్కడే తన కార్యక్రమాలను సాగించారు. 1994లో శ్రీకాళహస్తి సమీపంలోని సత్యవేడు నియోజకవర్గం వరదయ్యపాళెం సమీపంలో గల ఉబ్బలమడుగు దారితో భూములను కొనుగోలు చేసి ఆశ్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడ నుండి తమ యోగా కార్యక్రమాలతో దేశ,విదేశీ భక్తులను ఆకర్షించారు. ఆయన దర్శనానికి ప్రతి రోజూ వేలాది మంది తరలివచ్చేవారు. తరువాత వరదయ్యపాళెం సమీపంలోని చిన్నపాండూరు వద్ద ఏకమ్ ఆలయాన్ని పాలరాతితో నిర్మించారు. ఆయన దర్శనం కోసం సినీనటులు, వాణిజ్య ప్రముఖులు, రాజకీయ నాయకులు, మేధావులుక్యూ కట్టేవారు. 6 సంవత్సరాలుగా ఆయన అనారోగ్యంతో కనుమరుగయ్యారు. కల్కి కార్యక్రమాలను ఆయన తనయుడు క్రిష్ణాజీ, దాసాజీ, కోడలు ప్రీతీజీ పర్యవేక్షిస్తున్నారు. మంగళవారం రాత్రి భక్తులు ఆశ్చర్యపోయేటట్లు కల్కి భగవాన్ ఇక లేరనే వార్త దిగ్భ్రాంతికి గురి చేసింది.మంగళవారం రాత్రికే ఆయన అభిమానులు,భక్తులు వరదయ్యపాళెం లోని ఏకం ఆశ్రమానికి చేరుకుంటున్నారు.

# సింగరేణి సంస్థకు బకాయిపడిన రూ.60వేల కోట్లు చెల్లించాలి

## సిఎం రేవంత్‌రెడ్డికి బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ లేఖ

**హైదరాబాద్,సెప్టెంబరు29,ప్రభాతవార్త:** సింగరేణి కార్మికుల సమస్యలపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి మంగళవారం సాయంత్రం బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రి కల్వకుంట్ల తారాక రామారావు లేఖ రాశారు. 'తెలంగాణ సిరుల మాగాణి సింగరేణి. లక్షలాది కుటుంబాలకు జీవనాధారంగా ఉన్న సింగరేణి సంస్థను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుండటం, సింగరేణి కార్మికుల హక్కులను, సంక్షేమాన్ని కాలరాస్తుండటం తీవ్ర ఆక్షేపణీయం' అని పేర్కొన్నా రు.'2023-24 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి నికర లాభం రూ. 4,701 కోట్లు. అందులో 33 శాతం అంటే రూ.1,551 కోట్లు. కానీ కార్మికులకు చెల్లించింది కేవలం రూ.796 కోట్లు మాత్రమే. అంటే కార్మికులకు రావాల్సిన మొత్తంలో భారీగా కోత పెట్టారు. అదేవిధంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.6,394 కోట్ల లాభాలు వచ్చినప్పటికీ, బోనస్ రూపంలో కార్మికులకు చెల్లించింది కేవలం రూ.819 కోట్లు మాత్రమే. బోనస్ శాతం ఒకటి ప్రకటించి, వాస్తవంగా మరో విధంగా చెల్లించడం ద్వారా కార్మికులను మోసం చేస్తున్నారనే ఆందోళన కార్మికుల్లో ఉంది.2023 నుంచి 2025 సంవత్సరాల వరకు సింగరేణి లాభాల బోనస్‌కు సంబంధించిన కార్మికుల బకాయిలు మొత్తం రూ.2,342 కోట్లు వెంటనే కార్మికులకు చెల్లించాలి' అని డిమాండ్ చేశారు. 'సింగరేణి సంస్థ విషయానికి వస్తే, 2023 వరకు 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి, రూ.37 వేల కోట్ల టర్నోవర్ సాధించి, దేశంలోనే అగ్రగామి ప్రభుత్వ రంగ సంస్థగా సింగరేణి నిలిచింది. అలాంటి సింగరేణి సంస్థకు ట్రాన్స్కో, జెన్‌కో నుంచి రావాల్సిన సుమారు రూ.60 వేల కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉండటం వల్ల సంస్థ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. జీతాల చెల్లింపుల కోసం కూడా బ్యాంకుల నుంచి అప్పులు తీసుకునే పరిస్థితి వస్తే, సింగరేణి భవిష్యత్తు ఏమిటి అనే ప్రశ్న తలెత్తుతోంది. సింగరేణి కార్మికుల రక్షణకు అవసరమైన పరికరాలు, విడిభాగాలు, యంత్రాల కొనుగోళ్లు, వైద్య సేవలు, రోజువారీ కార్యకలాపాలకు కూడా ఆర్థిక ఇబ్బందులు ఏర్పడితే, దాని ప్రభావం నేరుగా కార్మికులపై పడుతుంది అని చెప్పారు. కొత్త ప్రాజెక్టులు చేపట్టి సింగరేణిని మరింత అభివృద్ధి చేయాల్సిన సమయంలో ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టడం సరికాదు. కాబట్టి సింగరేణికి రావాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని సిఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు.

'మారు పేర్ల బాధితుల సమస్యను పరిష్కరిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. కానీ ఇప్పటికీ ఆ సమస్య పరిష్కారం కాలేదు. మరోవైపు యాజమాన్యం కార్మిక వ్యతిరేక సర్క్యులర్లు జారీ చేస్తున్నా ప్రభుత్వం వాటిని నిలుపుదల చేయడం లేదు. మారు పేర్ల బాధితులకు న్యాయం చేయాలి. వారికి ఒక అవకాశం కల్పించాలి. డిస్మిస్ అయిన కార్మికులకు కూడా అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఆ హామీని అమలు చేయకపోగా వందలాది మంది కార్మికులను యాజమాన్యం డిస్మిస్ చేస్తుంటే ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మెడికల్ బోర్డులను క్రమం తప్పకుండా నిర్వహించడం లేదని, ప్రతి నెలా మెడికల్ బోర్డులను క్రమం తప్పకుండా నిర్వహించాలి అని డిమాండ్ చేశారు.

మరోవైపు సింగరేణి సంస్థలో ప్రభుత్వ వాటాలను విక్రయించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందనే సమాచారం మా దృష్టికి వచ్చింది. సింగరేణి సంస్థను బలోపేతం చేయాల్సిన సమయంలో వాటాలను విక్రయించాలనే ఆలోచన ఎందుకు? సింగరేణి కేవలం ఒక సంస్థ కాదు. అది తెలంగాణ ప్రజల ఆస్తి. వేలాది మంది కార్మికుల జీవ నాధారం. తరతరాలుగా తెలంగాణ అభివృద్ధికి సింగరేణి కార్మికులు తమ శ్రమను అందిస్తున్నారు. అలాంటి సింగరేణిని బలహీనపరిచే ఏ చర్యనైనా బీఆర్‌ఎస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు.

# రైలు ఢీకొని 195 గొర్రెలు మృత్యువాత

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** రైలు ఢీకొని 195 గొర్రెలు మృత్యువాత పడిన సంఘటన ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ పరిధిలో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అవుషాపూర్ సమీపంలోని కేపాల్ వద్ద తెల్లవారుజామున 3 గంటల సమయం తర్వాత రైలు ఢీకొని 195 గొర్రెలు మృతి చెందాయి. న్యూఢిల్లి నుంచి హైదరాబాద్‌కు వస్తున్న దక్షిణ్ నిజాముద్దిన్ ఎక్స్‌ప్రెస్ (12722) రైలు పట్టాలు దాటుతున్న గొర్రెల మందపై దూసుకుపోయింది. దీంతో గొర్రెలు ఒరెండు చోట్ల మృతి చెంది పట్టాలపై చెల్లాచెదరుగా విగతజీవులుగా పడిఉన్నాయి. యాదాద్రిభువనగిరి జిల్లా పోచంపల్లి మండలం జూలూరు అలీనగర్‌కు చెందిన గొర్రెల కాపరి బాలమోని కిష్టయ్య కొండమడుగు మెట్టు దగ్గర ఉన్న ఈస్ట్ సిటి వెంచర్‌లో నెలరోజుల క్రితం తన గొర్రెల మందతో వచ్చి ఉంటున్నాడు. అర్ధరాత్రి తర్వాత చూసే సరికి గొర్రెలు కనిపించకపోవడంతో అంతటా వెతికాడు.

కొద్దిదూరంలో కుక్కలు వెళ్లడం గమనించి రైలు పట్టాల వైపు చూడగా గొర్రెలు మృతి చెంది పడి ఉండటాన్ని చూసాడు. ఎక్స్‌ప్రెస్ రైలు శబ్దానికి గొర్రెలు భయపడి పరుగులు తీయడంతో రైలు జీవాలపై దూసుకువెళ్లిందని తెలిపారు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసు అధికారులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతిచెందిన గొర్రెల సంఖ్య, ప్రమాదానికి సంబంధించిన వివరాలను సేకరించారు. బాధితుడు కిష్టయ్య గొర్రెల మృత్యువాతను చూసి బోరున విలపించారు. తనకు అధికారులు న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈమేరకు రైల్వే పోలీసులు రైల్వే చట్టం 154 సెక్షన్ కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని తెలిపారు.

# ఆదిలాబాద్ రిమ్స్ ఘటనపై జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సమీక్ష



**హైదరాబాద్,సెప్టెంబరు29,ప్రభాతవార్త:** జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌సిపిసిఆర్) ప్రతినిధులు మంగళవారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (టిజిఎస్‌సిపిసిఆర్) చైర్‌పర్సన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి, కమిషన్ సభ్యులతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా రిమ్స్, అదిలాబాద్‌లో జరిగిన నవజాత శిశువుల అగ్ని ప్రమాద ఘటనపై విస్తృతంగా చర్చించారు. ఈనెల 24న టిజిఎస్‌సిపిసిఆర్ బృందం రిమ్స్ అదిలాబాద్‌ను సందర్శించిన సందర్భంగా చేపట్టిన పరిశీలనలు, బాధిత కుటుంబాలతో జరిపిన సంభాషణలు, ఆసుపత్రి అధికారులతో సమావేశం, చికిత్స పొందుతున్న చిన్నారుల పరిస్థితి తదితర అంశాలను ఎన్‌సిపిసిఆర్ ప్రతినిధులకు వివరించారు.ఈ సమావేశంలో చైర్‌పర్సన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి, సభ్యులు మర్రిపల్లి చందన, ప్రేమలత అగర్వాల్, వందనా గౌడ్, సరిత, వచన్ కుమార్ బుర్కా పాల్గొన్నారు.పిల్లల భద్రత, ముఖ్యంగా ఆసుపత్రుల్లో నవజాత శిశువుల రక్షణకు సంబంధించిన భద్రతా ప్రమాణాలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందనా వ్యవస్థలు, ఫైర్ సేఫ్టీ,ఇతర ముందస్తు జాగ్రత్తలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరంపై సమావేశంలో చర్చ జరిగింది.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత శాఖల మధ్య సమన్వయంతో సమర్థవంతమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఇరు కమిషన్లు ప్రస్తావించాయి.

# హోటల్ గదిలో యువతి మృతి

## నిందితుడి కోసం పోలీసుల గాలింపు

**హైదరాబాద్ (సంజీవరెడ్డినగర్), సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** ఎస్‌ఆర్.నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోకుల్ ఫ్రైడ్ హోటల్‌లో యువతి శిరీష మృతి చెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. హోటల్ గదిలో ఆమె అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందినట్లు సమాచారం. ఘటన అనంతరం ఓ వ్యక్తి అర్ధరాత్రి సుమారు 3 గంటల సమయంలో హోటల్ నుంచి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.మినీ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్న శిరీషకు అదే బ్యాంకుకు కస్టమర్‌గా వచ్చిన గణేష్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడినట్లు సమాచారం. ఈ నెల 25న శిరీష హోటల్‌కు వచ్చినట్లు తెలుస్తుండగా, గతంలోనూ ఇద్దరూ అప్పుడప్పుడు హోటల్‌కు వచ్చి వెళ్లేవారని స్థానికులు చెబుతున్నారు. అయితే శిరీష, గణేష్ మధ్య ఉన్న పరిచయం, ఘటనకు దారితీసిన పరిస్థితులపై పోలీసులు పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.శిరీష కుటుంబ సభ్యులు మాత్రం గణేష్ ఎవరో తమకు తెలియదని చెబుతున్నారు. తమ కుమార్తె మృతికి కారణమైన వ్యక్తిని వెంటనే గుర్తించి అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని వారు పోలీసులను కోరుతున్నారు. శిరీష 2013లో వివాహం చేసుకున్న అనంతరం విడాకులు తీసుకున్నట్లు, గత ఏడేళ్లుగా ఒంటరిగా జీవిస్తున్నట్లు సమాచారం.

# ప్రియురాలిని కొట్టి చంపిన యువకుడు

## నిందితుడు రవితేజ అరెస్టు, రిమాండ్‌కు తరలింపు

**హైదరాబాద్ (సైబరాబాద్ ప్రతినిధి), సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** నాలుగేళ్ళుగా సహజీవనం చేస్తున్న ప్రియురాలిని పెళ్ళి చేసుకోవాలని కోరిందనే కారణంతో ఓయో గదిలో దాడి చేసి హత్య చేసిన కేసులో నిందితున్ని మాదాపూర్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మాదాపూర్ ఇన్స్‌పెక్టర్ కే.వీ. సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం విశాఖ ఉక్కునగరానికి చెందిన షరోన్ నిఖిత తోప్నా(29) ఆమె స్నేహితుడు బి. శ్రీనివాస రవితేజ (26) గత నాలుగు సంవత్సరాలుగా కలిసి సహజీవనం చేస్తున్నారు. ఈనెల 21వ తేదీన మధ్యాహ్నం ఇద్దరు సిద్దిఖ్ నగర్‌లోని ఓయో గదికి వెళ్ళారు. సాయంత్రం మద్యం మత్తులో పెళ్ళి విషయమై ఇరువురి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఆగ్రహానికి గురైన రవితేజ ఆమెతల, మెడపై బలంగా కొట్టడంతో నిఖిత తీవ్రంగా గాయపడింది.



శ్రీనివాస రవితేజ

అనంతరం ఆమెను అపోలో ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలపడంతో నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. మృతురాలి కుటుంబానికి తెలిసిన ప్రసాదరావు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు ధర్యాప్తు చేపట్టారు. అనకాపల్లి జిల్లా, ఏడుమెట్ల మర్రిపాలెం గ్రామానికి చెందిన నిందితుడు లైజాల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆసుపత్రి నుంచి డిశ్చార్చ్ కాగానే అదుపులోకి తీసుకుని కోర్టు అనుమతితో ట్రాన్సిట్ వారంట్‌పై నగరానికి తరలించి న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.

# మరో అల్పపీడనం

## 72 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** తెలంగాణలో మరోసారి వర్షాలు కురిసే అవకాశం ఉంది. బంగాళాఖాతంలో ప్రస్తుతం ఏర్పడిన అల్పపీడనం 72 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశమున్నదని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. దీని ఫలితంగా తెలంగాణలోని పలు జిల్లాల్లో రాగల మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశమున్నదని వెల్లడించింది. రాష్ట్రంలోని ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో రానున్న 48 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశమున్నదని అధికారులు తెలిపారు. ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ప్రస్తుతం దేశంలో నైరుతి రుతుపవనాల ఉపసంహారణ ఊపందుకున్నదని అధికారులు చెప్పారు. మరోవైపు ఎ ల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి.

### రాష్ట్రంలో భారీగా పెరిగిన ఉష్ణోగ్రతలు

కాగా రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు వేగంగా పెరుగుతున్నాయి. సాధారణానికి మించిన ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయిలో నమోదవుతున్నాయి. దీంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఎండ తీవ్రత పెరుగుదల చోటు చేసుకుంది. రాష్ట్రంలోనే అత్యధికంగా నల్లగొండ జిల్లా గుండ్లపల్లెలో 39.3 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. అలాగే గ్రేటర్ హైదరాబాద్‌లోని మణికొండలో 37.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గడచిన 24 గంటల్లో రాష్ట్రంలోని 18 జిల్లాల్లో సాధారణం కంటే మించి గరిష్ట ఉష్ణోగ్రతలు చోటు చేసుకున్నాయి.

# గ్రాడ్యుయేట్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులు

## సామా రామ్మోహన్‌రెడ్డి, రామ్‌రెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** తెలంగాణలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సందడి మొదలైంది. రాష్ట్రంలో ఖాళీ కానున్న 2 గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ పార్టీ కసరత్తును పూర్తి చేసింది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం-నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు పోటీ చేయబోయే అభ్యర్థులను మంగళవారం రాత్రి ఎంపిక చేసింది.

మహబూబ్ నగర్- రంగారెడ్డి-హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి సామా రామ్మోహన్‌రెడ్డి పేరును, వరంగల్-ఖమ్మం-నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి రామ్‌రెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి పేరును ఖరారు చేసింది. అభ్యర్థుల ఎంపికలో ప్రాంతీయ ప్రాతినిధ్యం, పార్టీతో అనుబంధం, గ్రాడ్యుయేట్లలో ఉన్న పరిచయం వంటి అంశాలను కాంగ్రెస్ నాయకత్వం పరిశీలించినట్లు తెలుస్తోంది. కాగా రెండు స్థానాలు రెడ్డి సామాజికవర్గానికి నేతలకు కేటాయించడం గమనార్హం. సామ రామ్మోహన్‌రెడ్డి కాంగ్రెస్ మీడియా కమ్యూనికేషన్ చైర్మన్, పార్టీ అధికార ప్రతినిధుల ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

బిటెక్,ఎల్‌ఎల్‌బి విద్యను చదివారు. రామ్‌రెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి మాజీ మంత్రి రామ్‌రెడ్డి దామోదర్‌రెడ్డి కుమారుడు, నల్లగొండ జిల్లా సీనియర్ కాంగ్రెస్ నేతలకు సన్నిహితుడు, రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలతో పాటు త్వరలో ఖాళీ కానున్న గవర్నర్ కోటాలోని 3 ఎమ్మెల్సీ స్థానాలను కూడా కలిపి మొత్తం 5 స్థానాల్లో సామాజిక సమతుల్యత ఉండేలా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా ఉన్న ముగ్గురి పదవీకాలం నవంబర్‌లో ముగియనుంది.

# సిఎం ప్రజావాణిలో అర్జీదారుల తాకిడి



## దరఖాస్తులు స్వీకరించిన స్టేట్ ఇన్‌చార్జి గద్వాల్ విజయలక్ష్మి

**హైదరాబాద్ (బేగంపేట్), సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజా భవన్ లో మంగళవారం నిర్వహించిన 258వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో 196 మంది ద్వారా 160 దరఖాస్తులు అందా యి. వాటిలో రెవెన్యూ శాఖకు 40 ధరఖా స్తులు, బీసీ సంక్షేమ శాఖకు 27, మున్సి పల్ శాఖకు 19, ఇతర శాఖలకు 74 దరఖాస్తులు అందా యి. సీఎం ప్రజావాణి స్టేట్ ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్ పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి మ్మ ఎంతో ఓర్పుతో దరఖాస్తులు స్వీకరించి ఎండార్స్మెంట్ చేసి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించారు. హైదరాబాద్‌లోని అడ్డగుట్ట ప్రాంతానికి చెందిన దివ్యాంగులు ట్రై సైకిల్ ద్వారా సీఎం ప్రజావాణికి వచ్చి తమకు ఇందిరమ్మ ఇండ్లు ఇప్పించాలని స్టేట్ ఇంచార్జ్ గద్వాల్ విజయలక్ష్మి మ్మకి వినతి పత్రాన్ని అందజేశారు. వెంటనే స్పందించిన విజయలక్ష్మి మ్మ హౌసింగ్ శాఖ అధికారులను పిలిపించి ఈ అంశంపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాగా ప్రధానంగా రెవెన్యూ, పోలీస్, బీసీ సంక్షేమ, మున్సిపల్ శాఖలకు సంబందించిన దరఖాస్తులు అందాయి.ఈ ప్రజావాణికార్యక్రమంలో స్టేట్ నోడల్ అధికారి కే.విద్యాసాగర్, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# హార్డ్‌వేర్ పార్క్ బాధితుల సమస్యలను సిఎం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తా: ఎంపి కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్ (సైఫాబాద్), సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** హార్డ్‌వేర్ పార్క్ బాధితుల సమస్యలు పరిష్కారానికి సిఎం రేవంత్‌రెడ్డిదృష్టికి తీసుకువెళతానని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. పూర్తి వివరాలతో నివేదికను సిద్ధం చేసి 100 శాతం హామీతో సిఎం దృష్టికి తీసుకువెళ్ళి అధికారులతో చర్చించి పరిష్కార మార్గాన్ని రూపొందించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. హార్డ్‌వేర్ పార్క్ వ్యతిరేక పోరాట కమిటీ (జెఎసి), తెలంగాణ జన సమితి (టిజెఎస్) రంగారెడ్డి జిల్లా సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో అక్రమ ఎక్స్‌టెన్షన్ హార్డ్‌వేర్ పార్క్ తొలగించాలని డిమాండ్ చేస్తూ జరిగిన అఖిల పక్ష సదస్సులో ఆయన ప్రసంగించారు. ఈ సదస్సుకు ఎమ్మెల్సీ, తెలంగాణ జన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ అధ్యక్షత వహించారు. కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ భూముల విషయంపై ఈ మేరకు రాష్ట్ర మంత్రి డి.శ్రీధర్‌బాబు దృష్టికి కూడా తీసుకువెళ్ళడం జరిగిందని, 2013 చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగేలా చేస్తానన్నారు. ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ ప్రసంగిస్తూ హార్డ్‌వేర్ పార్క్ భూసమస్య పరిష్కారానికి భూబాధితులు, రైతులు, ప్లాట్ల యాజమానులు ఐక్యంగా ఒక సమిష్టి కదలికను కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. అక్కడ భూసేకరణకు ఏలాంటి పురోగతి లేదని, హైకోర్టు, సుప్రీం కోర్టులు సైతం భూసేకరణను రద్దు చేశాయని, ఇందులో 20 వేల ప్లాట్లు ఉన్నాయని, లక్ష మంది బాధితులు ఉన్నారని, లక్ష ఓట్లు కూడా ఉన్నాయని చెప్పారు. అక్టోబరు 4వ తేద ఉదయం 11 గంటలకు నాదర్‌గుల్‌లోని సిఎంఆర్ గార్డెన్‌లో బాధితులంతా మరొకసారి సమావేశం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# 'మాదిగలకు డి.సిఎం పదవితోపాటు 11 మందిని చైర్మన్‌లుగా నియమించాలి'

**హైదరాబాద్ (సైఫాబాద్), సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మాదిగల జనాభా నిష్పత్తి 11 శాతం ప్రకారం ఉప ముఖ్యమంత్రి పదవి, 11 రాష్ట్ర కార్పోరేషన్‌లకు ఛైర్మన్ పదవులు కేటాయించాలని మాజీ మంత్రి, మాదిగ మహా శక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు మోత్కుపల్లి నర్సింహులు, మాదిగ అడ్వకెట్స్ అసోసియేషన్ వ్యవస్థాప అధ్యక్షుడు కొమ్ము ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో వచ్చే అన్ని ఎన్నికల్లో మాదిగల సత్తా చూపిస్తామని వారు హెచ్చరించారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ. తక్షణమే సిఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని మాదిగలకు ఉప ముఖ్యమంత్రి పదవితోపాటు 11 కార్పోరేషన్‌లకు ఛైర్మన్ పదవులు కేటాయించాలని, అలాగే లీడ్‌క్యాప్‌ను పునరుద్ధరించి, మాదిగ యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.

# నస్పూర్ ప్రమాదంలో మరొకరి మృతి

## ఐదుకు చేరిన మృతుల సంఖ్య

### కరీంనగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ దివ్యవాణి మరణం

**నస్పూర్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** మంచిర్యాల జిల్లా నస్పూర్ గేట్ వద్ద 63వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. తీవ్ర గాయాలతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాంటెంకి దివ్యవాణి (33) పరిస్థితి విషమించడంతో సోమవారం రాత్రి మృతి చెందినట్లు సీసీసీ నస్పూర్ పోలీసులు తెలిపారు. సోమవారం ఉదయం మందమర్రి మండలం గుడిపల్లి, పొన్నారం గ్రామాల నుంచి ఉద్యోగాల నిమిత్తం మంచిర్యాలకు బయలుదేరిన మహిళల ఆటో, నస్పూర్ గేట్ వద్ద లారీని ఢీకొన్న దుర్ఘటనలో ఇప్పటికే నలుగురు మహిళలు ప్రాణాలు కోల్పోయిన విషయం విదితమే. తీవ్ర గాయాలపాలైన దివ్యవాణిని మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆమె తుదిశ్వాస విడిచింది. దీంతో ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య ఐదుకు పెరిగింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరో బాధితురాలు నారమల్ల లక్ష్మి వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, సల్లూరి అనూషతో పాటు ఆటో డ్రైవర్ సెగ్గెం ప్రశాంత్ కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో దివ్యవాణి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఒకే గ్రామానికి చెందిన మహిళలు వరుసగా మృత్యువాత పడటంతో దివ్యవాణి స్వగ్రామమైన గుడిపల్లితో పాటు పరిసర ప్రాంతాల్లో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి.



రాంటెంకి దివ్యవాణి (ఫైల్)

# అమ్మకానికి ఓ ఊరు!

>> సోలాపూర్ జిల్లాలోని "తులసి" గ్రామంలో సుమారు 7,000 మంది జనాభా నివసిస్తున్నారు. ఈ ఊరికి కూతవేటు దూరంలోనే సినామధా ఎత్తిపోతల నీటిపారుదల పథకం కాలువలు వెళుతున్నాయి. కానీ ఆశ్చర్యకరంగా ఆ కాలువల్లో మాత్రం చుక్క నీరు పారడం లేదు. గత 26 సంవత్సరాలుగా ఈ ప్రాజెక్టుకు సంబంధించిన కేవలం 800 మీటర్ల తవ్వకం పనులు మాత్రమే అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఆ కొద్దిపాటి పనులు పూర్తి చేస్తే తమ ఊరి నీటి కష్టాలు శాశ్వతంగా తీరిపోతాయని గ్రామస్థులు వాపోతున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల కాలువలు దగ్గర్లోనే ఉన్నా తమ గొంతులు మాత్రం ఎండుకుపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ట్యాంకర్ల నీళ్లే గతి ఎండిపోయిన బావులు, చెరువులు ఈ గ్రామంలోని 14 చెరువులు, బావులు పూర్తిగా ఎండిపోయి నెర్రెలు బారాయి. దీంతో గ్రామం పూర్తిగా వాటర్ ట్యాంకర్లపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఈ వర్షాకాలంలో సరిగా వర్షాలు కురవకపోవడంతో పరిస్థితి మరింత దిగజారింది. తాగునీరు లేక వ్యవసాయం, పశుపోషణ పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ నీటి కష్టాల వల్ల ఊర్లో యువకులకు పెళ్లిళ్లు కూడా కావడం లేదని సర్పంచ్ శరద్ మోరే ఆవేదన వ్యక్తం చేశారు.

నీళ్లు లేని ఊరికి తమ పిల్లలను ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో దాదాపు 350 మంది యువకులు పెళ్లిళ్లు కాక ఒంటరిగా మిగిలిపోయారని ఆయన వాపోయారు. ఖాళీ కుండలతో రోడ్డెక్కిన ప్రజలు ప్రభుత్వాల మోసపూరిత హామీలతో విసిగిపోయిన తులసి గ్రామస్థులు ఈనెల 14 నుంచి నిరాహార దీక్షలు చేపట్టారు. అయినా అధికారులు స్పందించకపోవడంతో మధా తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఖాళీ కుండలను పగలగొడుతూ థాలీనాద్ నిరసన చేపట్టారు. కేవలం ప్రకటనలు, నిధుల కేటాయింపుల పేరుతో కాలయాపన చేస్తున్నారే తప్ప గ్రౌండ్‌లో ఎలాంటి పనులు జరగడం లేదని గ్రామస్థులు మండిపడ్డారు. క్లోజ్డ్ పైప్‌లైన్ల ద్వారా నీటిని అందిస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించినా, కాగితాల మీద తప్ప ఆచరణలో ఏదీ రాలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్థుల ఈ వినూత్న నిరసన, విలేజ్ ఫర్ సేల్ బ్యానర్ల ఉదంతం మీడియా ద్వారా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. పూణేలో ఈ విషయంపై స్పందించిన రాష్ట్ర వ్యవసాయ మంత్రి దత్తాత్రేయ భర్నే తులసి గ్రామం ఎదుర్కొంటున్న నీటి సమస్య తమ దృష్టికి వచ్చిందని, గ్రామానికి అన్ని విధాలా సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అయితే కేవలం మాటలతో సరిపెట్టకుండా వెంటనే అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసి తమ ఊరికి శాశ్వతంగా సాగు, తాగునీటిని అందించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. సమస్య పరిష్కారమయ్యే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.


**AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్**
(ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్)
(CIN:L36911RJ1996PLC011381)
నమోదిత కార్యాలయం: 19-ఎ, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001

అనుబంధం IV (నిబంధన 8(1) చూడండి) స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కోసం)

ఇదిలా ఉండగా దిగువ సంతకందారు, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) యొక్క అధీకృత అధికారిగా, "ఆర్థిక ఆస్తుల సెక్యూరిటైజేషన్ మరియు పునర్నిర్మాణం మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ అమలు (చట్టం, 2002 (54 ఆఫ్ 2002)" క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నియమాలు, 2002లోని (నియమం 3)తో చదువబడే సెక్షన్ 13(12) కింద సంక్రమించిన అధికారాలను ఉపయోగించి రుణగ్రహీత నేరెళ్ళ కనకయ్య (రుణగ్రహీత), నేరెళ్ళ శారద (సహ-రుణగ్రహీత), (రుణ ఖాతా నెం. **2363000102758**)లను, సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు నోటీసులలో పేర్కొన్న **రూ.9,84,073/- (తొమ్మిది లక్షల ఎనభై నాలుగు వేల డెబ్బై మూడు రూపాయలు మాత్రమే)** మొత్తాన్ని తిరిగి చెల్లించమని కోరుతూ **16-మార్చి-26** తేదీన డిమాండ్ నోటీసును జారీ చేసారు.

ఇదిలా ఉండగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క విలీన పథకం ప్రకారం, 1 ఏప్రిల్ 2024 నుండి అమలులోకి వచ్చేలా ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్‌ను, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్‌లో విలీనం చేయబడింది. ఈ విలీన పథకం ప్రకారం, పైన పేర్కొన్న రుణ ఖాతా, మంజూరు చేయబడిన సదరు క్రెడిట్/ఆర్థిక సహాయానికి సంబంధించి మీరందరూ చెల్లించవలసిన మొత్తం సొమ్ముతో పాటు, తనఖా పెట్టిన ఆస్తికి సంబంధించిన అంతర్లీన సెక్యూరిటీ మరియు సెక్యూరిటీ వడ్డీతో సహా, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌కు బదిలీ చేయబడింది.

రుణగ్రహీత/సహరుణగ్రహీత/తాకట్టుదారు/హామీదారు మొత్తం తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, చట్టంలోని సెక్షన్ 13 యొక్క ఉపసెక్షన్ (4) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002లోని రూల్ 8 ప్రకారం అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను ఉపయోగించి, దిగువ సంతకందారు 24వ రోజు సెప్టెంబర్ 2026వ సంవత్సరం ఇక్కడ క్రింద వివరించిన ఆస్తిని స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీత/తాకట్టుదారుకు మరియు సాధారణ ప్రజలకు దీని ద్వారా తెలియజేయబడుతుంది.

ముఖ్యంగా రుణగ్రహీత/సహరుణగ్రహీత/తాకట్టుదారు/హామీదారు మరియు సాధారణ ప్రజలు ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు చేయరాదని ఇందుమూలంగా హెచ్చరించబడింది. ఆస్తితో చేసే ఏ లావాదేవీలకైనా, **12-మార్చి-26** నాటికి **రూ.9,84,073/- (తొమ్మిది లక్షల ఎనభై నాలుగు వేల డెబ్బై మూడు రూపాయలు మాత్రమే)** మొత్తం మరియు పూర్తి చెల్లింపు జరిగే వరకు దానిపై వడ్డీ మరియు ఖర్చులు AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకు) వారి ఛార్జీకి లోబడి ఉంటుంది.

హామీగా ఉంచిన ఆస్తులను వినియోగించడానికి అందుబాటులో ఉన్న సమయం, అనగా ఈ సమాచారం అందిన తేదీ నుండి 30 రోజులు, చట్టంలోని సెక్షన్ 13 యొక్క ఉపసెక్షన్ (8) నిబంధనలను రూల్ 8(6)తో చదువబడే దానిని రుణగ్రహీత దృష్టికి తీసుకురావడం అయినది.

**స్థిరమైన ఆస్తుల వివరణ**

సిద్దిపేట జిల్లా, సిద్దిపేట మునిసిపాలిటీలోని ఇప్పుడు కలిసిపోయిన ప్రశాంత్ నగర్ పాత గ్రామ పంచాయత్ సంతోష్‌నగర్ వద్ద వున్న 430చ.అ॥ RCC Gf పింత్ ఏరియా, 80చ.గ. కొలత ఏరియా ఇం.నం. 18-13-195/7/12/A/1 యొక్క ఆస్తి మరియు దాని సరిహద్దులువి ఈ విధంగా: తూర్పు: కిర్ల ప్రసాద్ యొక్క ఇల్లు, పడమర: 14 అడుగుల రోడ్, ఉత్తరం: ఇతరుల ఇల్లు, దక్షిణం : పోతుల వజ్రవ్వ యొక్క ఇల్లు.

తేది: **24/సెప్టెంబర్/2026** అధీకృత అధికారి
ప్రదేశం : జిల్లా : సిద్దిపేట, తెలంగాణ. AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

# ఇరాన్‌కు ఏ హామీ ఇవ్వలేదు
## ఆంక్షల సడలింపుపై ట్రంప్



**వాషింగ్టన్, సెప్టెంబరు 29:** ఇరాన్‌తో చర్చలు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌కు ఆంక్షల సడలింపు, నిలిపివేసిన నిధుల విడుదలకు తాను ఎలాంటి ప్రతిపాదన చేయలేదని స్పష్టం చేశారు. ఇరాన్‌పై ఆర్థిక ఆంక్షలను సడలించేందుకు అమెరికా సిద్ధమైందని వస్తోన్న వార్తలను ఆయన ఖండించారు. 'ఇది అవాస్తవం. నేను వారికి హామీ ఇవ్వలేదు' అని ట్రూత్ సోషల్‌లో ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా అధికారులు మాత్రం ఇరాన్‌తో పరోక్ష చర్చలు కొనసాగుతున్నట్లు తెలిపారు. 'ఖతార్, పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో ఈ సంప్రదింపులు జరుగుతున్నాయి. అణు కార్యక్రమంపై ఇరాన్ స్పష్టమైన హామీలు ఇవ్వాలని అమెరికా కోరుతోంది' అని చెబుతున్నారు.

**ఇరాన్ దాడుల్లో యుఎస్ సైనికులకు గాయాలు:** ఇరాన్ దాడిలో ఎనిమిది మంది అమెరికా సైనికులు తీవ్రంగా గాయపడిన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 14న హోర్ముజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న ఓ నౌకపై ఇరాన్ క్షిపణి దాడి చేసినట్లు అమెరికా అధికారులు తెలిపారు. దాడి సమయంలో అందులో ఉన్న ఎనిమిది మందికి గాయాలయ్యాయి. ఈ ఘటనను అమెరికా ప్రభుత్వం బహిరంగంగా వెల్లడించనప్పటికీ.. తాజాగా సైనికుల గాయాల వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఇరాన్‌తో చర్చలు కొనసాగుతున్న సమయంలోనే ఇది బయటపడటం ప్రాధాన్యం సంతరించుకుంది. యుద్ధ తీవ్రతను తక్కువ చేసి చూపించడానికే ట్రంప్ ప్రభుత్వం ఈ విషయాన్ని దాచిపెట్టిందనే విమర్శలు వస్తున్నాయి. హోర్ముజ్ జలసంధి సంక్షోభం, ప్రాంతీయ ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఖతార్ మధ్యవర్తుల ద్వారా అమెరికాతో ఇరాన్ మరోసారి పరోక్ష చర్చలు జరిపిందని ఆ దేశ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ తెలిపారు.

న్యూయార్క్‌లో జరిగిన ఈ చర్చలకు సంబంధించి అమెరికా స్పందన కోసం వేచి చూస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే సమాధానం రావచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



# 'ఇసి ఐనెట్'లో మార్పులు చేయండి

**సర్'లో స్థానిక సిబ్బందికి మరిన్ని అధికారాలివ్వాలి**
**ఇసికి లేఖ రాసిన మహారాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి**

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 29:** కేంద్ర ఎన్నికల సంఘంలో ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సుఖ్ బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషీకు తెలియకుండా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకొంటున్నారని ఆంగ్లపత్రిక కథనం బయటపెట్టిన తర్వాత ఈసీ ఈ ఆరోపణల్ని ఖండించింది. తామంతా ఏకగ్రీవంగానే నిర్ణయాలు తీసుకుంటున్నట్లు చెబుతోంది. ఈ నేపథ్యంలోనే ఎన్నికల కమిషనర్లు వ్యక్తం చేసిన అభ్యంతరాలకు బలం చేకూర్చేలా మహారాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కమిషన్ కు ఓ లేఖ రాశారు. ఈ లేఖను అదే ఆంగ్లపత్రిక బయటపెట్టడంతో మరోసారి కలకలం మొదలైంది. సీఈసీ జ్ఞానేష్ కుమార్ తనపై వచ్చిన ఆరోపణలపై తాజాగా ఇద్దరు కమిషనర్లతో సమావేశమై ఓ వివరణ ప్రకటన విడుదల చేశారు. అనంతరం అభ్యంతరాలు ఉన్న అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పుకొచ్చారు. గతంలో ఇదే ఇద్దరు ఎన్నికల కమిషనర్లు గుర్తించిన ఓ అంశంపై మహారాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి చోకలింగం కమిషన్ కు రాసిన లేఖ బయటికి వచ్చింది. ఇందులో చోకలింగం ఎస్ఐఆర్ లో స్థానిక సిబ్బందికి మరిన్ని అధికారాలు కల్పించాలని కోరారు. ప్రస్తుతం ప్రత్యేక ఓటర్ల జాబితాల సవరణ నోటీసు దశలో ఉన్న అతిపెద్ద రాష్ట్రమైన మహారాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అయిన చోకలింగం ఈసీఐనెట్ సాఫ్ట్‌వేర్‌లో 4 మార్పులు కోరుతూ గత వారం ఎన్నికల కమిషన్‌కు ఈ లేఖ రాశారు. ఏ తార్కిక వ్యత్యాసాల కేసులకు విచారణ అవసరమో, ఏ పత్రాలను అంగీకరించాలో, ఏ వ్యత్యాసాలను వారే స్వయంగా పరిష్కరించుకోగలరో నిర్ణయించేందుకు ఈఆర్వోలకు అనుమతి ఇవ్వాలని మహారాష్ట్ర సీఈఓ చోకలింగం చేసిన అభ్యర్థనలు, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి ఇప్పటికే వ్యక్తం చేసిన ఆందోళనలను ప్రతిబింబిస్తున్నాయి. ఈ సాఫ్ట్‌వేర్ ఈఆర్వోల అధికారాలను తగ్గిస్తోందని ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అధికారికంగా గుర్తించినట్లు ఆంగ్లపత్రిక పరిశోధనలో వెల్లడైన ఒక రోజు తర్వాత సెప్టెంబర్ 24న సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ మనీష్ గార్గ్, ఐటీ డైరెక్టర్ జనరల్ సీమా ఖన్నా , ఇద్దరు సచివాలయ అధికారుల్ని ఉద్దేంచి మహారాష్ట్ర సీఈఓ ఈ లేఖ రాశారు. ఇప్పటికే ఆగస్టు 31న ప్రచురించిన మహారాష్ట్ర ముసాయిదా ఓటర్ల జాబితాలో రాష్ట్ర ఓటర్ల సంఖ్యను 21.1 శాతం తగ్గించారు. తుది జాబితా నవంబర్ 16న వెలువడనుంది. ఈ నేపథ్యంలో బయటికి వచ్చిన ఈ లేఖ ఈఆర్వోలకు అధికారాలు ఇవ్వకుండా ఈసీ చేస్తున్న అరాచకాన్ని బయటపెట్టేలా ఉందని విపక్షాలు విమర్శలకు దిగాయి. బీజేపీకి అత్యంత ప్రభావవంతమైన స్టార్ క్యాంపెయినర్‌గా అవతరించిన ఎన్నికల సంఘం కేంద్రీకృత సాఫ్ట్‌వేర్‌కు అభినందనలంటూ కాంగ్రెస్ నేత రణ్ దీప్ సూర్జేవాలా ట్వీట్ చేశారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఆధ్వర్యంలో సంస్థాగత విశ్వసనీయత పూర్తిగా దెబ్బతినడం ఇప్పుడు రికార్డుల్లో పూర్తిగా బట్టబయలైందని, ఎన్నికల సంఘం కుమ్మక్కుతో ఉందా, ఒక ప్రైవేట్ పార్టీ మార్గదర్శకత్వంలో పనిచేస్తోందా అని కలకత్తా హైకోర్టు బహిరంగంగా ప్రశ్నిస్తుండగా, సీఈసీని తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ దాఖలైన కొత్త పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ జరుపుతోందని గుర్తుచేశారు. ఇప్పుడు, మహారాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అత్యంత ఆందోళన కలిగించే విషయాలను ధృవీకరించారన్నారు.

ఢిల్లీ నుండి ఒక కేంద్రీకృత ఐటీ వ్యవస్థ ద్వారా ఎన్నికల యంత్రాంగాన్ని క్రమపద్ధతిలో హైజాక్ చేస్తున్నారన్నారు. ఓటర్లను ఈ విధంగా తొలగిస్తున్నారంటూ ఆయన పలు ఉదాహరణలను షేర్ చేశారు. భారత ప్రజాస్వామ్యం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయేలోపు, మోసపూరితమైన సర్ ప్రక్రియను రద్దు చేసి, సీఈసీని అరెస్టు చేసి జవాబుదారీగా చేయాలని కోరారు.




# హెచ్1బి మోసాలపై ట్రంప్ సర్కార్ ఉక్కుపాదం

**వాషింగ్టన్, సెప్టెంబరు 29:** హెచ్1 బీ వీసా కార్యక్రమంలో మోసాలపై ట్రంప్ సర్కార్ ఉక్కుపాదం మోపుతున్నది. విదేశీ కార్మికుల వీసాల్లో మోసం, ఉద్యోగుల దోపిడీ, మానవ అక్రమ రవాణా ఆరోపణలపై అమెరికా కార్మిక శాఖ దర్యాప్తు ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలో హెచ్1బీ వీసా కార్యక్రమం ఏడాది తర్వాత ప్రస్తుత రూపంలో ఉండకపోవచ్చని అమెరికా కార్మిక శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆంథోనీ డి ఎస్పొసిటో హెచ్చరించారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని సంకేతమిస్తూ 'మా దగ్గర చేతులకు బేడీలు సిద్ధంగా ఉన్నాయి' అని ఆయన అన్నారు. అమెరికన్ యూట్యూబర్ బెన్నీ జాన్సన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో డి ఎస్పొసిటో ఈ వ్యాఖ్యలు చేశారు. విదేశీ కార్మికుల వీసా కార్యక్రమం 365 రోజులు తర్వాత ప్రస్తుతం ఉన్నదాని కంటే చాలా భిన్నంగా ఉండబోతోంది' అని అన్నారు. హెచ్1 బీ వీసా కార్యక్రమంలో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు ఉన్న మోసాలు, ఉద్యోగుల దోపిడీ, మానవ అక్రమ రవాణాపై అమెరికా కార్మిక శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ కార్యాలయం దేశవ్యాప్తంగా దర్యాప్తు కొనసాగిస్తున్నది. ఈ నేపథ్యంలో టెక్ దిగ్గజ సంస్థలు కాగ్నిజంట్, క్లౌడెరాకు సంబంధించిన వీసా దరఖాస్తులను నేర దర్యాప్తు పూర్తయ్యే వరకు నిలిపివేసినట్లు కూడా తెలిపింది. విదేశీ కార్మికుల కార్యక్రమాలను దుర్వినియోగం చేశారనే అనుమానాలున్న సంస్థలు, విధానాలపై దర్యాప్తు కొనసాగుతున్నదని డి ఎస్పొసిటో తెలిపారు.

## మరోసారి భగ్గుమంటున్న సిమెంట్ ధరలు!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 29:** సిమెంట్ ధరలు మరోసారి పెరగనున్నాయి. సెప్టెంబర్‌లో దేశవ్యాప్తంగా సిమెంట్ బస్తా సగటు ధర రూ.7 పెరగ్గా అక్టోబర్‌లో మరో రూ.5 నుంచి రూ.20 వరకు పెంచే అవకాశం ఉందని సెంట్రమ్ బ్రోకింగ్ నివేదిక తెలిపింది. అయితే పెంచిన ధరలను కంపెనీలు ఎంతకాలం కొనసాగించగలవన్నది డిమాండ్ పరిస్థితులపై ఆధారపడి ఉంటుందని పేర్కొంది. సెప్టెంబర్‌లో దేశవ్యాప్తంగా సిమెంట్ బస్తా సగటు ట్రేడ్ ధర రూ.356కు చేరింది. జులై, ఆగస్టులో ధరలు దాదాపు స్థిరంగా ఉండగా.. సెప్టెంబర్‌లో మాత్రం ధరల పెరుగుదల కనిపించింది. ట్రేడ్ సెగ్మెంట్‌తో పాటు నాన్‌ట్రేడ్ విభాగంలోనూ ధరలు పెరిగాయని సెంట్రమ్ తెలిపింది. అయితే కొన్ని ప్రాంతాల్లో కంపెనీలు పెంచిన ధరల భారాన్ని డీలర్లు పూర్తిగా వినియోగదారులపై మోపలేదు. ఇదిలా ఉంటే పెరిగిన ఇంధన ఖర్చులు సిమెంట్ కంపెనీలపై ఒత్తిడి పెంచుతున్నాయి. దీంతో అధిక ధరలను అమలు చేసి కొనసాగించడం కంపెనీలకు మరింత కీలకంగా మారొచ్చని నివేదిక పేర్కొంది. రెండో త్రైమాసికంలో సిమెంట్ డిమాండ్ సాధారణ స్థాయి కంటే బలహీనంగా ఉన్నప్పటికీ సీజనల్ మందగమనంతో పోలిస్తే తగ్గుదల తక్కువగానే ఉందని తెలిపింది. త్రైమాసికం చివర్లో కొన్ని మార్కెట్లలో నిర్మాణ కార్యకలాపాలు పుంజుకోవడంతో అక్టోబర్‌లో మరోసారి ధరలు పెంచేందుకు కంపెనీలకు అవకాశం ఏర్పడిందని పేర్కొంది.

ప్రాంతాల వారీగా చూస్తే సెప్టెంబర్‌లో దక్షిణ భారతదేశంలో సిమెంట్ ధరలు అత్యధికంగా రూ.11 పెరిగాయి. పశ్చిమ భారతంలో రూ.9, మధ్య, తూర్పు, ఉత్తర భారతంలో ఒక్కో బస్తాపై రూ.5 చొప్పున ధరలు పెరిగాయి. అయితే ఢిల్లీఎన్‌సీఆర్‌లో నిర్మాణ కార్యకలాపాలపై రాబోయే ఆంక్షలు సిమెంట్ డిమాండ్‌పై ప్రభావం చూపొచ్చని నివేదిక తెలిపింది.

# యుపిలో పది రాజ్యసభ స్థానాలకు నామినేషన్లు షురూ!

**లక్నో, సెప్టెంబరు 29:** ఉత్తర్ ప్రదేశ్‌లో ఖాళీ అవుతోన్న 10 రాజ్యసభ స్థానాలకు వచ్చేనెల 16న ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన నామినేషన్ ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభమైంది. ఈ పది స్థానాల కోసం బీజేపీ , సమాజ్‌వాదీ పార్టీల మధ్యే ప్రధాన పోటీ నెలకుంది. వచ్చే ఏడాది మార్చి ఏప్రిల్‌లో ఉత్తర్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సామాజిక సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని అభ్యర్థుల ఎంపికపై బీజేపీ కసరత్తు ప్రారంభించింది. లక్నోలో జరిగిన కోర్ కమిటీ సమావేశంలో పలువురు పేర్లను చర్చకు వచ్చాయి. త్వరలోనే జరగనున్న బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో ఈ పేర్లను ఖరారు చేయనున్నారు. ప్రధానంగా బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శులు స్మృతి ఇరానీ , హరీశ్ ద్వివేదిలను బరిలోకి దించే అవకాశం ఉంది. వీరితో పాటు వరుణ్ గాంధీ , సంజీవ్ బలియాన్, సత్యపాల్ సింగ్ పేర్లను కూడా పరిశీలించినట్టు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. బీఎల్ వర్మ, గీతా శక్యాల పదవీకాలం ముగుస్తుండటంతో వారిని మళ్లీ పంపే అవకాశం ఉంది. అలాగే స్టేట్ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ప్రకాష్ పాల్, రేఖా వర్మల పేర్లు పరిశీలనలో ఉన్నాయి. దళిత నేత బ్రిజ్‌లాల్ స్థానంలో యువ నేతకు అవకాశం ఇవ్వాలని భావిస్తున్నారు. జాట్ నేతలు కేంద్ర మాజీ మంత్రి సంజీవ్ బాలియాన్, మాజీ ఎంపీ సత్యపాల్ సింగ్‌ల పేర్లను కూడా పరిశీలించినట్టు సమాచారం. పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురీని తిరిగి రాజ్యసభకు పంపుతారని తెలుస్తోంది. ప్రస్తుతం ఎంపీలుగా ఉన్న నీరజ్ శేఖర్, అరుణ్ సింగ్‌లను యూపీ ఎన్నికల్లో పోటీ చేయించే అవకాశం ఉంది. ఇక, రెండు స్థానాలను గెలుచుకోగల సంఖ్యాబలమున్న ఎస్పీ మూడో అభ్యర్థిని కూడా పోటీకి దింపే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది.

ఆ పార్టీ నుంచి సీనియర్ నేత రామ్ గోపాల్ యాదవ్‌కు మళ్లీ ఛాన్స్ ఇవ్వనున్నారని సమాచారం. మాజీ ఐఏఎస్ అధికారి అలోక్ రంజన్, సలీమ్ ఇక్బాల్ పేర్లు కూడా వినిపిస్తున్నాయి. మొత్తం 403 స్థానాలున్న యూపీ శాసనసభలో ప్రస్తుతం 396 మంది ఉన్నారు. ఒక్కో అభ్యర్థికి 37 మంది ఎమ్మెల్యేల మొదటి ప్రాధాన్యత ఓట్లు అవసరం. బీజేపీకి సొంతంగా 255 మంది, మిత్రపక్షాలకు 33 అప్నా దళ్ (సోనెలాల్) 13, రాష్ట్రీయ లోక్ దళ్ 9, సుహెల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ 6, నిషాద్ పార్టీ 5) ఈ సంఖ్యా బలంతో బీజేపీ ఏడు సీట్లను సునాయాసంగా గెలుచుకోగలదు. ఎన్డీయే కూటమి వద్ద 33 మిగులు ఓట్లు ఉంటాయి. ఎనిమిదో సీటు గెలవడానికి బీజేపీకి కేవలం మరో 4 ఓట్లు మాత్రమే అవసరం. జనసత్తా దళ్ (లోక్‌తాంత్రిక్) పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేల మద్దతుతో పాటు మిగిలిన ఓట్లను సాధించడం బీజేపీకి పెద్ద కష్టం కాకపోవచ్చు. ఎస్పీకి మూడో సీటు సాధించడం కొంత కష్టమే. ఆ పార్టీకి 101 మంది ఎమ్మెల్యేలు ఉండగా కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరుతో మొత్తం 103 మంది అవుతారు.

ఇద్దరు అభ్యర్థులను గెలిపించిన తర్వాత ఎస్పీ వద్ద 29 ఓట్లు మాత్రమే ఉంటాయి. మూడో సీటు గెలవాలంటే ఎస్పీకి అదనంగా 8 మంది ఎమ్మెల్యేలు కావాలి. రాజ్యసభ ఎన్నికల్లో విప్ వర్తించదు కాబట్టి పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా ఓటు వేసినా ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు కాదు. దీంతో 10వ సీటును దక్కించుకోవడానికి బీజేపీ, ఎస్పీలు ఇతర పార్టీల ఎమ్మెల్యేలను ఆకర్షించేందుకు, క్రాస్ ఓటింగ్‌ను ప్రోత్సహించేందుకు శతవిధాలా ప్రయత్నించే అవకాశం ఉంది.

# స్పామ్ కాల్స్‌పై ట్రాయ్ తీవ్ర ఆంక్షలు




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 29:** స్పామ్ కాల్స్‌తో విసిగిపోతున్న మొబైల్ వినియోగదారుల కు ఊరటనిచ్చేలా టెలికామ్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా ట్రాయ్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అందకపోయినా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత సాయంతో స్పామ్ కాల్స్‌కు అడ్డుకట్ట వేయాలని టెలికామ్ సంస్థల ను ఆదేశించింది. ఈ మేరకు టెలికాం కమర్షియల్ కమ్యూనికేషన్స్ కస్టమర్ ప్రిఫరెన్స్ రెగ్యులేషన్స్‌లో నూతన నిబంధనలను పొందుపరిచింది. కొత్త నిబంధనల ప్రకారం టెలికామ్ కంపెనీలు తమ ఏఐ లేదా మెషీన్ లెర్నింగ్ వ్యవస్థల ద్వారా ఏదైనా కాల్‌ను స్పామ్‌గా గుర్తిస్తే ఆ సమాచారాన్ని రెండు గంటల్లోపు సంబంధిత ఆపరేటర్‌కు నివేదించాలి. సదరు ఆపరేటర్ ఒక వర్కింగ్ డే వ్యవధిలో ఆ నంబర్‌కు సంబంధించిన కేవైసీ వివరాలను సేకరించి, ఇతర టెలికామ్ సంస్థలతో పంచుకోవాలి. గడిచిన 10 రోజుల్లో ఒకే వ్యక్తి లేదా సంస్థకు చెందిన ఐదు కంటే ఎక్కువ నెంబర్లు స్పామ్‌గా నమోదైతే అన్ని టెలికామ్ సంస్థలు సమన్వయంతో కఠిన చర్యలు చేపడతాయి. స్పామర్లపై కఠిన చర్యలను కూడా ట్రాయ్ ప్రతిపాదించింది. ఏఐ విశ్లేషణలో మొదటిసారి స్పామర్‌గా నిర్ధారణ అయితే సదరు వ్యక్తి పేరిట ఉన్న అన్ని కనెక్షన్లపై 15 రోజులపాటు అవుట్‌గోయింగ్ సేవలను నిలిపివేస్తారు. నిబంధనలను అతిక్రమిస్తూ మళ్లీ అదే తప్పు చేస్తే ఆ నెంబర్లను ఏడాదిపాటు బ్లాక్‌లిస్ట్‌లో ఉంచుతారు. అటువంటి వారికి ఏ టెలికామ్ సంస్థ కూడా కొత్త కనెక్షన్‌లను జారీ చేయదు. వినియోగదారుల సౌలభ్యం కోసం మరికొన్ని మార్పులను కూడా ట్రాయ్ సూచించింది.

# ప్రాణాంతక వ్యాధుల చికిత్సమందులపై జీరో టారిఫ్
# భారత్‌తోపాటు 20 దేశాలకు అమెరికా రాయితీలు



**వాషింగ్టన్, సెప్టెంబరు 29:** అమెరికా తమ దేశంలోకి దిగుమతి అయ్యే కొన్ని రకాల ప్రాణాంతక వ్యాధుల మందులు, వాటి తయారీలో వాడే కీలక పదార్థాలపై ఎలాంటి అదనపు రవాణా పన్నులు (యాడ్ వాలోరెమ్ టారిఫ్‌లు) వేయకూడదని కీలక నిర్ణయం తీసుకుంది. భారత్‌తో సహా 20 దేశాలకు ఈ రాయితీ ఇస్తున్నట్లు అమెరికా వాణిజ్య శాఖ అధికారికంగా ఒక నోటీసు విడుదల చేసింది. సెప్టెంబర్ 29 నుంచి పేటెంట్ పొందిన కొన్ని రకాల మందుల దిగుమతులపై ఏకంగా 100 శాతం పన్ను విధించేందుకు వాషింగ్టన్ సిద్ధమవుతున్న సమయంలో ఈ నిర్ణయం రావడం విశేషం. తీవ్రమైన జబ్బులకు వాడే మందులు, సంతానలేమి చికిత్సలు, సెల్ థెరపీ, జీన్ థెరపీ, యాంటీబాడీడ్రగ్ కాంజుగేట్స్, అలాగే జంతువులకు వాడే మందులతో పాటు వీటి తయారీకి ఉపయోగించే కీలక కాంపోనెంట్లకు కూడా పన్నుల నుంచి పూర్తిగా మినహాయింపు లభించింది. ఇక్కడ యాడ్ వాలోరెమ్ పన్ను అంటే ఒక వస్తువు ధర ఆధారంగా నిర్ణయించే ఒక నిర్దిష్ట శాతం. అమెరికాతో ఇప్పటికే వర్తక, భద్రతా ఒప్పందాలు ఉన్న లేదా భవిష్యత్తులో చేసుకోబోయే దేశాలకే ఈ పన్ను మినహాయింపు ప్రయోజనం లభిస్తుందని అధికారులు స్పష్టం చేశారు. ఈ జాబితాలో భారతదేశంతో పాటు అర్జెంటీనా, బంగ్లాదేశ్, కంబోడియా, ఈక్వెడార్, ఎల్ సాల్వడార్, యూరోపియన్ యూనియన్, గౌతమాలా, ఇండోనేషియా, జపాన్, జోర్డాన్, మలేషియా, నార్త్ మాసిడోనియా, దక్షిణ కొరియా, స్విట్జర్లాండ్, లీచ్టెన్‌స్టెయిన్, తైవాన్, థాయ్‌లాండ్, బ్రిటన్, వియత్నాంలు ఉన్నాయి. తమ దేశీయ పరిశ్రమలను ప్రోత్సహించే లక్ష్యంతో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏప్రిల్ 2న ఒక కీలక ఆదేశం ఇచ్చారు. ట్రేడ్ ఎక్స్‌పాన్షన్ యాక్ట్‌లోని సెక్షన్ 232 కింద పేటెంట్ పొందిన ఫార్మా ఉత్పత్తులపై 100 శాతం పన్ను విధించాలని నిర్ణయించారు. ఈ పన్ను జూలై 31 నుంచే కొన్ని కంపెనీలకు అమల్లోకి రాగా, మిగిలిన సంబంధిత కంపెనీలన్నింటికీ సెప్టెంబర్ 29 నుంచి వర్తించనుంది.

అయితే సాధారణంగా అందరూ వాడే జెనెరిక్ మందులకు మాత్రం ఈ 100 శాతం టారిఫ్ బాదుడు నుంచి ఊరట లభించింది. జెనెరిక్ ఫార్మా ఉత్పత్తులకు ఈ పన్నులు వర్తించవని వాణిజ్య శాఖ స్పష్టం చేసింది. అంతేకాకుండా పేటెంట్ లేని జంతువుల ఆరోగ్య ఉత్పత్తులను కూడా ఈ మినహాయింపు పరిధిలోకి తెస్తూ కొన్ని సాంకేతిక మార్పులు చేసింది. ఈ నిబంధనల కింద ఫార్మా ఉత్పత్తులు అంటే కేవలం సిద్ధంగా ఉన్న మందులే కాకుండా, వాటి తయారీకి వాడే యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రిడియంట్స్, ప్రాథమిక ముడి పదార్థాలు మాత్రమే వస్తాయని అమెరికా స్పష్టతనిచ్చింది.



## ఢిల్లీ హెడ్‌కానిస్టేబుల్‌పై దాడిచేసిన ఆప్ కార్యకర్తలు!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 29:** దేశరాజధాని ఢిల్లీలోని వెస్ట్ ఢిల్లీ తిలక్ నగర్ ప్రాంతంలో తీవ్ర కలకలం రేగింది. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అర్వింద్ కేజ్రీవాల్ పర్యటన సందర్భంగా ఊహించని ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. సాదాసీదా దుస్తుల్లో ఉన్న ఒక ఢిల్లీ పోలీసు హెడ్ కానిస్టేబుల్‌పై ఆప్ కార్యకర్తలు దాడికి పాల్పడటం తీవ్ర ఆందోళన రేకెత్తించింది. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు కెమెరాకు చిక్కడంతో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేజ్రీవాల్ తిలక్ నగర్ పర్యటనలో ఉన్న సమయంలో విధి నిర్వహణలో భాగంగా ఒక హెడ్ కానిస్టేబుల్ సివిల్ డ్రెస్‌లో ఉంటూ మొబైల్ ఫోన్‌లో దృశ్యాలను రికార్డ్ చేస్తున్నారు. దీనిని గమనించిన ఆప్ శ్రేణులు ఒక్కసారిగా సదరు పోలీసు అధికారిని చుట్టుముట్టారు. అతడిని నెట్టివేస్తూ.. హేళన చేస్తూ తీవ్రంగా గొడవ చేశారు.

ఫ్లైఓవర్ కిందకు తీసుకువెళ్లి అతడు బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు. పోలీసు అధికారులు తమ సహచర సిబ్బందిని అతికష్టం మీద బయటకు తీసుకువచ్చారు.

## రాబోయే ఐదుతరాలు గాంధీ కుటుంబం నుంచి ప్రధాని కాలేరు!

### ఎస్పీనేత ఐపిసింగ్ తీవ్ర విమర్శలు

**ముంబయి, సెప్టెంబర్29:** వచ్చే ఏడాది మొదల్లో ఉత్తర్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు జరగబోతునున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీలు ప్రచార పర్వాన్ని ఇప్పుడే ప్రారంభించాయి. ఇదిలా ఉంటే, సీట్ల పంపకాల్లో మాత్రం సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ), కాంగ్రెస్ పార్టీ మధ్య తీవ్ర విభేదాలు ఏర్పడింది. 150 పైగా సీట్లు కావాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఎస్పీ నేత ఐపీ సింగ్ తీవ్రంగా విమర్శించారు. లూటియన్స్ కాంగ్రెస్ వాళ్లు యూపీలో మొత్తం 403 స్థానాల్లో పోటీ చేస్తారు. రాబోయే 5 తరాల వరకు ఏ గాంధీ అని పిలువబడే వ్యక్తి ప్రధానమంత్రి కాలేరు. 1989 నుంచి గాంధీ కుటుంబం ప్రధాని పదవిని చేపట్టలేదు. రాబోయే అనేక దశాబ్దాల్లో కూడా ఇదే జరుగుతుంది' అని తీవ్ర స్థాయితో ఐపీ సింగ్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో కూర్చుని పగటి కలలు కంటున్నారని వెక్కిరించారు. కాంగ్రెస్ వ్యూహకర్తలను టార్గెట్ చేస్తూ.. యూపీలో కాంగ్రెస్‌కు అంత బలం ఉంటే 403 స్థానాల్లో ఒంటరిగా పోటీ చేసి తన బలాన్ని ఎందుకు పరీక్షించుకోకూడదని ప్రశ్నించారు. పొత్తులు, రాజకీ పరిణామాలనే ఊతకర్రలతో ప్రజల్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు ఇంకెంత కాలం సాగుతాయి రాహుల్ గాంధీ రాజకీయాల్లోకి ప్రవేశించి రెండున్నర దశాబ్దాలు గడిచాయని, తరాలు మారాయి, కానీ కాంగ్రెస్ ఇప్ప టికీ అవే ప్రశ్నల్ని ఎదుర్కొం టోందని ఘాటుగా స్పందిం చారు. కాంగ్రెస్ సాధించింది ఏంటని ప్రశ్నించారు. కేవలం కెమెరాలు, వేదికలు, పెద్ద పెద్ద ప్రకటనలు మాత్రమే రాజకీయ పునాదిని నిర్మించ లేదని హితవు చెప్పారు. క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తల బలం, ఓటర్లతో నిరంతర సంబంధం రాజకీయ సంస్థకు అసలైన బలమని అన్నారు.

# అభివృద్ధిఫలాలు అందరికీ అందినపుడే అసలైన ప్రగతి

## ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 29:** అభివృద్ధి ఫలాలు సమాజంలోని అట్టడుగున ఉన్న చివరి వ్యక్తికి అందాలని, వారి ముఖంలో చిరునవ్వు కనిపించినప్పుడే దేశం సుభిక్షంగా ఉంటుందని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సర్ సంఘచాలక్ మోహన్ భగవత్ పేర్కొన్నారు. మహారాష్ట్రలోని యవత్మాల్‌లో పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. అభివృద్ధి అంటే అందరినీ ఒకే స్థాయికి తీసుకురావడం కాదని, సమాజంలోని హెచ్చుతగ్గులను, వివిధ వర్గాల మధ్య ఉన్న అంతరాన్ని వీలైనంతగా తగ్గించడమేనని ఆయన స్పష్టం చేశారు.

కొంతమందికే గరిష్ఠ ప్రయోజనం చేకూరాలన్న వాదనను తాను వ్యతిరేకిస్తున్నానని, దీనదయాళ్ ఉపాధ్యాయ ఆశించినట్లుగా అందరికీ మేలు జరగాలని భగవత్ ఆకాంక్షించారు.

# సంక్షిప్త వార్తలు

## ఇరాన్‌ను దారుణంగా దెబ్బతీసాం: ట్రంప్

**వాషింగ్టన్, సెప్టెంబరు 29:** ఇరాన్‌తో నెలకొన్న వివాదంలో అమెరికా త్వరలోనే విజయం సాధిస్తుందని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల ఒక ప్రముఖ మీడియా ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ సైనిక, ఆర్థిక ఒత్తిళ్ల ద్వారా ఇరాన్‌ను కట్టడి చేస్తున్నామని వెల్లడించారు. అమెరికాలో జరగనున్న మధ్యంతర ఎన్నికలకు ముందే ఇరాన్‌పై సైనిక దాడులు జరిపే అవకాశం ఉందా? అన్న ప్రశ్నకు ట్రంప్ స్పందిస్తూ మేము అలా చేస్తామని కచ్చితంగా చెప్పను కానీ, అది సాధ్యమే అని వ్యాఖ్యానించారు.

## బలోచ్ ఆర్మీలో మహిళా కంబాట్‌యూనిట్



**క్వెట్టా, సెప్టెంబరు 29:** పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో వేర్పాటువాద కార్యకలాపాలు నిర్వహిస్తున్న బలూచిస్థాన్ లిబరేషన్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) సంచలన ప్రకటన చేసింది. తమ కొత్త మహిళా కాంబాట్ యూనిట్ కరీమా అర్మ్ అసాల్ట్ డివిజన్ (కేఏఏడీ) తొలి ఆపరేషన్లలో 9 మంది పాక్ సైనికులను హతమార్చినట్లు ఆ సంస్థ ప్రకటించుకుంది. ఇందుకు సంబంధించిన ఒక వీడియోను కూడా విడుదల చేసింది. ప్రతినిధి మేజర్ గ్వాహ్రామ్ బలోచ్ ప్రకారం, ఈ నెల 22న టర్బట్ సమీపంలోని సీపెక్ హైవేపై పాకిస్థాన్ సైనిక కాన్వాయ్‌పై తమ మహిళా ఫైటర్లు దాడి చేశారు. ఈ ఘటనలో ఆరుగురు సైనికులు మరణించారని ఆయన తెలిపారు.

## అమెరికా మోస్ట్ వాంటెడ్ జాబితాలో గోల్డీబ్రార్



న్యూయార్కు, సెప్టెంబరు 29: భారత్‌కు చెందిన గ్యాంగ్‌స్టర్ సతిందర్‌జీత్ సింగ్ అలియాస్ గోల్డీ బ్రార్‌ను అమెరికా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) తమ "టాప్ 10 మోస్ట్ వాంటెడ్" జాబితాలో చేర్చింది. అతడి ఆచూకీ తెలిపి అరెస్టుకు సహకరించిన వారికి మిలియన్ డాలర్ల (సుమారు రూ. 8.3 కోట్లు) భారీ రివార్డును సోమవారం ప్రకటించింది. లాస్ ఏంజిల్స్ ఎఫ్‌బీఐ విభాగం ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించింది. గోల్డీ బ్రార్, లారెన్స్ బిష్ణోయ్ నేర సామ్రాజ్యంలో ఉత్తర అమెరికా కార్యకలాపాలకు నాయకుడిగా వ్యవహరిస్తున్నాడని ఎఫ్‌బీఐ ఆరోపించింది.

## అసోం రైఫిల్స్‌పై మిలిటెంట్ల దాడులు - జవాన్ మృతి

**ఇటానగర్, సెప్టెంబరు 29:** అరుణాచల్ ప్రదేశ్‌లో దారుణం జరిగింది. భద్రతా దళాల్లో కీలక విభాగమైన అసోం రైఫిల్స్ బృందాలపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఒక జవాన్ మృతిచెందగా, మరో నలుగురు గాయపడ్డారు. ఈ ఘటన అరుణాచల్ ప్రదేశ్, చంగ్లాంగ్ జిల్లాలో ఇండియామయన్మార్ సరిహద్దులో మంగళవారం జరిగింది. ఉదయం 6.30 గంటల సమయంలో 21 అసోం రైఫిల్స్ బృందానికి చెందిన జవాన్లు నాంపోంగ్ నల్లా ప్రాంతంలో సాధారణ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఇది ఇండియామయన్మార్ సరిహద్దు కావడంతో ఇక్కడ కంచె ఏర్పాటు చేస్తున్నారు.

## సిఇసి జ్ఞానేశ్‌పై సుప్రీంలో పిల్!



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 29:** చీఫ్ ఎలక్షన్ కమీషనర్ జ్ఞానేశ్ కుమార్ తన విధులను నిర్వర్తించకుండా అడ్డుకునేందుకు సుప్రీంకోరు లో పిల్ దాఖలైంది. అయితే ఆ పిల్‌పై వచ్చే వారం విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని బెంచ్ ఆ పిల్‌పై వాదనలు విననున్నది. రాకేశ్ కుమార్ సింగ్ ఆ పిల్‌ను దాఖలు చేశారు. అయితే అర్జెంట్‌గా వాదనలు వినాలని కోరుతూ సీనియర్ న్యాయవాది వికాశ్ సింగ్ కోరారు. ఎన్నికల కమిషన్‌లో నిర్ణయాలు ఏకపక్షంగా తీసుకుంటే, సమస్య తీవ్రమవుతుందని కోర్టుకు తెలిపారు.

## జెట్ ఇంజిన్ కావేరి డ్రై రన్ విజయవంతం



**మాస్కో, సెప్టెంబరు 29:** భారత్ స్వదేశీ టెక్నాలజీతో అభివృద్ధి చేసిన జెట్ ఇంజన్ కావేరి సత్తా చాటింది. రష్యాలో నిర్వహించిన కావేరి ఇంజన్ డ్రైరన్‌లో కీలక మైలురాయిని చేరుకుంది. రష్యాలో నిర్వహించిన హైఆల్టిట్యూడ్, ఫ్లైట్ ట్రయల్స్‌లో అనుకున్నదాని కన్నా మరింత సమర్థవంతంగా పనిచేసింది. ఈ టెస్టుల్లో ఇంజన్ గరిష్ఠంగా 48.5 కిలోన్యూటన్ల డ్రై థ్రస్ట్ సాధించినట్లు తాజా రక్షణ రంగ నివేదికలు పేర్కొన్నాయి. నిర్దేశించిన 46 కిలోన్యూటన్ల థ్రస్ట్ లక్ష్యాన్ని అధిగమించింది. డిఆర్డీవోకు చెందిన గ్యాస్ టర్బైన్ రీసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్ అభివృద్ధి చేసింది.

## వర్షంతో మలేసియా, నేపాల్ 2 మ్యాచ్‌లు రద్దు
# సెమీఫైనల్స్‌కు బంగ్లాదేశ్, శ్రీలంక

**నిస్షిన్:** మలేషియా, నేపాల్‌తో జరగాల్సిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు ఎడతెరిపి లేకుండా వర్షం కారణంగా రద్దు కావడంతో, బంగ్లాదేశ్, శ్రీలంక జట్లు మైదానంలోకి దిగకుండానే 2026 ఆసియా క్రీడల పురుషుల క్రికెట్ సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఈ మ్యాచ్‌ను నాలుగో క్వార్టర్ ఫైనల్‌గా షెడ్యూల్ చేసినప్పటికీ, మంగళవారం కొరోగి స్పోర్ట్స్ పార్క్‌లో ఉదయం అంతా కురిసిన ఎడతెరిపి లేని వర్షం టాస్ వేయకుండా అడ్డుకుంది. చివరికి అధికారులు ఆటను రద్దు చేయవలసి వచ్చింది. టోర్నమెంట్ నిబంధనల ప్రకారం, వర్షం కారణంగా మ్యాచ్‌లు రద్దయిన పక్షంలో ఐసీసీ ర్యాంకింగ్స్‌లో ఉన్నత స్థానంలో ఉన్న జట్లు సెమీఫైనల్స్‌కు చేరుకుంటాయి. దీని ఫలితంగా, శ్రీలంక, బంగ్లాదేశ్, భారత్, పాకిస్తాన్ ముందంజ వేయగా, నేపాల్, మలేషియా, ఆఫ్ఘనిస్తాన్, హాంగ్ కాంగ్ నిష్క్రమించాయి. సోమవారం నాడే వాతావరణం కారణంగా పోటీకి అంతరాయం ఏర్పడింది. పాకిస్థాన్, హాంగ్‌కాంగ్‌ల మధ్య జరగాల్సిన క్వార్టర్ ఫైనల్ వర్షం కారణంగా రద్దయింది. ఆ తర్వాత జరగాల్సిన భారత్, ఆఫ్ఘనిస్తాన్‌ల క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ కూడా ఒక్క బంతి కూడా వేయకుండానే రద్దయింది. తొలి సెమీఫైనల్‌లో భారత్ శ్రీలంకతో తలపడనుండగా, రెండో సెమీఫైనల్‌లో పాకిస్థాన్ బంగ్లాదేశ్‌తో తలపడుతుంది. ఈ రెండు మ్యాచ్‌లు గురువారం జరగనున్నాయి.




# బాక్సింగ్ ఫైనల్‌కు అంకుష్, పర్వీన్

**నిషియో:** ఆసియా క్రీడలు 2026లో భారత బాక్సర్లు తమ అద్భుతమైన ప్రదర్శనను కొనసాగిస్తూ, అంకుష్ ఫంఘల్, మహిళల విభాగంలో పర్వీన్ హుడా ఫైనల్‌కు చేరుకోగా, నరేందర్ బెర్వాల్ కాంస్య పతకాన్ని దక్కించుకున్నాడు. మంగళవారం జరిగిన ఈ పోటీల్లో ఉజ్బెకిస్తాన్‌కు చెందిన ప్రస్తుత 75 కేజీల ప్రపంచ ఛాంపియన్ ఫజ్లిద్దీన్ ఎర్కిన్‌బోయెవ్‌పై 4-1 తేడాతో పునరాగమన విజయంతో అంకుష్ పంఘల్ పురుషుల 80 కేజీల ఫైనల్‌కు చేరుకున్నాడు. తొలి రౌండ్ తర్వాత 1-4తో వెనుకబడిన అంకుష్, బలంగా పుంజుకుని, రెండో రౌండ్‌ను 3-2తో గెలుచుకుని, చివరి రౌండ్‌లో 5-0తో ఆధిపత్యం చెలాయించాడు. నలుగురు న్యాయనిర్ణేతలు ఈ పోరులో అతనికి అనుకూలంగా 2928 స్కోరు ఇవ్వగా, ఒక న్యాయనిర్ణేత ఎర్కిన్‌బోయెవ్‌కు 2928 తీర్పు ఇచ్చాడు. అయితే, పురుషుల +90 కేజీల సెమీఫైనల్‌లో కజకిస్తాన్‌కు చెందిన ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ ఐబెక్ ఒరల్‌బే చేతిలో 0-5 తేడాతో ఓడిపోవడంతో నరేందర్ బెర్వాల్ కాంస్య పతకంతో సరిపెట్టుకోవలసి వచ్చింది. ఒరల్‌బే శక్తివంతమైన పంచ్‌లతో పోటీని నియంత్రించి, మొదటి రెండు రౌండ్లను 5-0తో గెలుచుకోగా, తదుపరి ఏకగ్రీవంగా 5-0 విజయాన్ని పూర్తి చేశాడు. అలాగే పర్వీన్ హుడా కూడా చైనాకు చెందిన లీ షుపై 5-0 తేడాతో సమగ్ర విజయం సాధించి మహిళల 65 కేజీల ఫైనల్‌లో తన స్థానాన్ని ఖరారు చేసుకుంది. పర్వీన్ తొలి రౌండ్‌ను 3-2తో గెలుచుకోగా, ఆ తర్వాత రెండో, మూడో రౌండ్లలో 5-0తో ఆధిపత్యం చెలాయించింది.





# భారత్‌కు 2 గోల్డ్ మెడల్స్

### షూటింగ్‌లో నీరు ధాండా గోల్డ్
### వ్యక్తిగత విభాగంలో స్వర్ణం... టీమ్ ఈవెంట్‌లో రజతం
### రిలేలో మహిళల బృందానికి మరో స్వర్ణం
### భారత్‌కు మొత్తంగా 52 పతకాలు

**నగోయా, సెప్టెంబరు 29:** ఆసియా క్రీడల్లో మంగళవారం జరిగిన మహిళల వ్యక్తిగత ట్రాప్ షూటింగ్ ఈవెంట్‌లో స్వర్ణం గెలిచి నీరు ధాండా చరిత్ర సృష్టించారు. ఈ ఈవెంట్‌లో స్వర్ణం సాధించిన భారతీయ మహిళగా ఆమె నిలిచారు. మనీషా కీర్, ఆషిమా అహ్లావత్‌లతో కలిసి మహిళల టీమ్ ఈవెంట్‌లో రజతం గెలిచిన కొద్ది గంటలకే నీరు ధాండా 'గోల్డ్ మెడల్' కైవసం చేసుకోవడం గమనార్హం. ఐచినగోయా వేదికగా జరుగుతున్న ఈ ఆసియా క్రీడల్లో భారత్‌కు ఇది మొత్తం మీద ఐదవ స్వర్ణ పతకం. 26 ఏళ్ల నీరు, ఎనిమిది మంది షూటర్లు పాల్గొన్న ఫైనల్‌లో 28 పాయింట్లు సాధించి స్వర్ణాన్ని గెలుచుకున్నారు. ఈ క్రమంలో ఆమె 24 పాయింట్లుగా ఉన్న గత ఆసియా రికార్డును బద్దలు కొట్టారు. 26 పాయింట్లు సాధించిన చైనాకు చెందిన యునాంగ్ సన్‌ను ఆమె అధిగమించారు. ట్రాప్ ఈవెంట్‌లో భారత్‌కు చివరిసారిగా వ్యక్తిగత స్వర్ణం 1978లో లభించింది. అప్పట్లో ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియా మాజీ అధ్యక్షుడు రణధీర్ సింగ్ (ఈ యేడాది ప్రారంభంలో ఆయన కన్నుమూశారు) బ్యాంకాక్‌లో జరిగిన పురుషుల ట్రాప్ ఈవెంట్‌లో స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో, ఇటలీలోని లోనాటోలో జరిగిన ఐఎస్ఎస్ఎఫ్ షాట్‌గన్ వరల్డ్ కప్ 2026లో మహిళల ట్రాప్ ఈవెంట్‌లో నీరు ధాండా స్వర్ణం గెలుచుకున్నారు. ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో నీరుకు అది తొలి వ్యక్తిగత పతకం కాగా, ఆమె కెరీర్‌లో మొత్తం మీద రెండవ పతకం. హర్యానాలోని జింద్ జిల్లాకు చెందిన నీరు ధాండా ప్రస్తుత జాతీయ ఛాంపియన్. ఫైనల్‌లో కేవలం మూడు షాట్లు మాత్రమే గురి తప్పి, స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నారు. మాజీ ప్రపంచ ఛాంపియన్ అయిన ఫ్రాన్స్‌కు చెందిన కరోల్ కోర్మెనియర్ 25 పాయింట్లతో రజత పతకానికి పరిమితం కాగా, ఇటలీకి చెందిన ఎరికా సెసా కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. ఆసియా క్రీడల్లో భాగంగా మంగళవారం జరిగిన వివిధ పోటీల్లో భారత అథ్లెట్లు అద్భుతంగా రాణించారు. 11వ రోజు రెండు స్వర్ణ పతకాలతోపాటు, రజతం, రెండు కాంస్యం పతకాలను కైవసం చేసుకున్నారు. షూటింగ్‌లో నీరు ధాండా గోల్డ్ మెడల్ సాధించగా, ఉమెన్స్ 4-400 మీటర్ల రిలేలో కిరణ్, మచెట్టిర పూవమ్మ, పరాచి, విథ్య రామ్‌రాజ్ బృందం మరో గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నారు. షూటింగ్‌లో నీరు ధాండా, మనీషా కీర్, ఆషిమా బృందం రజతం గెలిచింది. పురుషుల 5వేల మీటర్ల విభాగంలో గుల్వీర్ సింగ్ కాంస్య పతకాన్ని సాధించి రికార్డు సృష్టించాడు. బాక్సింగ్‌లో నరేందర్ బెర్వాల్ కాంస్య పతకం కైవసం చేసుకున్నాడు. ఆసియా క్రీడల్లో భారత్ మొత్తంగా 6 గోల్డ్ మెడల్స్, 21 సిల్వర్, 25 బ్రాంజ్ మెడల్స్‌లతో 52 పతకాలు సాధించి పతకాల పట్టికలో భారత్ 6వ స్థానంలో నిలిచింది. మెడల్స్ సాధించిన అథ్లెటిక్స్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోడీ 'ఎక్స్' వేదికగా అభినందనలు తెలిపారు.

# పరుగులో గుల్వీర్‌కు కాంస్యం

**నగోయా:** భారత క్రీడాకారుడు గుల్వీర్ సింగ్, మంగళవారం జరిగిన పురుషుల 5000 మీటర్ల ఫైనల్‌లో కాంస్య పతకం సాధించి, 2026 ఆసియా క్రీడలలో అద్భుతమైన పతకాల హ్యాట్రిక్‌ను పూర్తి చేశారు. తద్వారా, ఈ ఖండాంతర క్రీడల ఒకే ఎడిషన్‌లో ఇది మూడో పతకం గెలిచిన గత 40 ఏళ్లలో తొలి భారతీయ అథ్లెట్‌గా నిలిచాడు. హోరాహోరీగా సాగిన రేసులో గుల్వీర్ 13:32.75 సమయంతో మూడవ స్థానంలో నిలిచాడు. దీనితో, ఈ క్రీడలలో అంతకుముందు పురుషుల 10,000 మీటర్లు, 1500 మీటర్ల ఈవెంట్లలో తాను సాధించిన రజత పతకాలకు అతను కాంస్య పతకాన్ని జోడించాడు. దీంతో ఒకే ఆసియా క్రీడల్లో మూడు పతకాలు సాధించిన ఉష తర్వాత మొదటి భారత క్రీడాకారుడుగా గుల్వీర్ నిలిచాడు. ఇక ప్రస్తుత 5000 మీటర్ల ఫైనల్‌లో, గుల్వీర్ ప్రారంభ దశలలో ముందు వరుసలో ఉన్న పరుగువీరులలో ఒకడిగా నిలిచి, మొదటి 2000 మీటర్ల తర్వాత మూడవ స్థానానికి పడిపోయాడు. రేసు నిర్ణయాత్మక దశలోకి ప్రవేశించినప్పుడు కూడా అతను తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు, కానీ మొదటి రెండు స్థానాలలో దేనికోసమూ పోటీపడలేకపోయాడు.



# హైజంప్‌లో పూజకు కాంస్యం

### పురుషుల జట్టుకు కాంస్యం

**నాగోయా:** జపాన్‌లోని ఐచినగోయాలో మంగళవారం జరిగిన ఆసియా గేమ్స్ 2026 మహిళల హైజంప్‌లో, భారత జాతీయ రికార్డు హోల్డర్ పూజ కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. అలాగే అథ్లెటిక్ స్టేడియంలో జరిగిన పురుషుల 4స400 మీటర్ల రిలేలో భారత బృందం 3:01.61 సమయాన్ని నమోదు చేసి, కాంస్య పతకంతో 2026 ఆసియా క్రీడల్లో భారత్ తన అథ్లెటిక్స్ ప్రచారాన్ని ముగించింది. ఫైనల్‌లో పూజ 1.84 మీటర్లఅత్యుత్తమ ఎత్తును అధిగమించి 3వ స్థానంలో నిలిచింది. 19 ఏళ్ల పూజ 1.84 మీటర్ల ఎత్తును అధిగమించి కొద్దిసేపు ఆధిక్యంలోకి వెళ్లినప్పటికీ, మూడు ప్రయత్నాల్లోనూ 1.87 మీటర్ల ఎత్తును అధిగమించడంలో విఫలమై, చివరికి కాంస్య పతకంతో సరిపెట్టింది. ఇక ధరమ్‌వీర్ చౌదరి, మను తీక్కినిల్, జయ కుమార్, విశాల్ తెన్నరసులతో కూడిన భారత పురుషుల జట్టు హోరాహోరీగా జరిగిన ఫైనల్‌లో మూడో స్థానంలో నిలిచి కాంస్యం సాధించింది. ధరమ్‌వీర్ చౌదరి నిలకడైన ఆరంభాన్ని అందించిన తర్వాత, జట్టు పతకం రేసులో నిలవగా, బాటన్‌ను మను తీక్కినిల్‌కు అప్పగించాడు. రెండవ లెగ్‌లో జయ్ అద్భుతంగా పరుగెత్తి భారత్‌ను పతక స్థానాలకు చేర్చాడు. చివరి దశలో భారత్ నాలుగో స్థానానికి పడిపోయినప్పటికీ, విశాల్ తెన్నరసు చివరి అంచెలో బలంగా పరుగెత్తి, వెనుకబడిన స్థానాన్ని పూడ్చి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు.






# నేడు రెండో వన్డే

### వెస్టిండీస్, భారత్‌కు కీలక మ్యాచ్
### టీమిండియాలో సిరాజ్ రీ ఎంట్రీ

**న్యూఢిల్లీ:** వెస్టిండీస్, భారత్ మధ్య తదుపరి రెండో వన్డే మ్యాచ్ గువాహటి వేదికగా ఈ నెల 30వ తేదీన జరగనుంది. ఈ మ్యాచ్ ఇరు జట్లకు ఎంతో కీలకం. మొదటి వన్డే గెలిచిన టీమిండియాకు ఇది సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్ కానుంది. ఈ మ్యాచ్ గెలిస్తే టీమిండియా చివరి మ్యాచ్ మిగిలి ఉండగానే మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0తో వశం చేసుకుంటుంది. ఇది జట్టుకు గొప్ప ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది. మరోవైపు, సిరీస్‌లో నిలవాలంటే వెస్టిండీస్ ఈ మ్యాచ్ తప్పనిసరిగా గెలవాల్సి ఉంది. ఈ మ్యాచ్‌లో ఓడిపోతే సిరీస్‌ను కోల్పోయి, వారి పరాజయాల పరంపర కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో రెండో వన్డే టీమిండియా, వెస్టిండీస్‌కు ఎంతో కీలకంగా మారింది. ఇక ఈ కీలక రెండో వన్డేలో టీమిండియాలో ఒక కీలక మార్పు చోటు చేసుకునే అవకాశం ఉంది. ఫాస్ట్ బౌలర్ గున్నార్ బార్ స్థానంలో మహమ్మద్ సిరాజ్ రీఎంట్రీ ఇవ్వనున్నాడు. తొలి మ్యాచ్‌లో గున్నార్ బార్ 10 ఓవర్లలో 60 పరుగులు ఇచ్చి ఒక్క వికెట్ కూడా తీయలేకపోవడం, వికెట్లు పడగొట్టడంలో విఫలం కావడం దీనికి ప్రధాన కారణం. సిరాజ్‌ను తొలి వన్డేలో పక్కన పెట్టిన మేనేజ్‌మెంట్, ఈ రెండో వన్డేలో అతడికి చోటు కల్పించనున్నట్లు తెలుస్తుంది. జట్టులోకి సిరాజ్ వస్తే పవర్ ప్లేలో వికెట్లు దక్కే అవకాశం ఉంది. సిరాజ్ తన స్వింగ్‌తో ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌ను ఇబ్బంది పెట్టి, ఆరంభంలోనే వికెట్లు తీయగల సమర్థుడు. దీంతోనే టీమిండియా ఈ మార్పుతో బరిలోకి దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇది జట్టు బౌలింగ్ విభాగాన్ని మరింత బలోపేతం చేయగలదు. కాగా దాదాపు నాలుగేళ్ల తర్వాత భారత గడ్డ మీద వన్డే మ్యాచ్ ఆడిన వెస్టిండీస్ క్రికెట్ జట్టుకు చేదు అనుభవం ఎదురైంది. గత వైఫల్యాలను కొనసాగిస్తూ టీమిండియాతో ఈ నెల 27న జరిగిన తొలి వన్డేలో కరేబియన్ జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో చిత్తుగా ఓడిపోయింది. ఈ మ్యాచ్‌లో విండీస్ ఓపెనర్లు శుభారంభం అందించినప్పటికీ, మిడిల్ ఆర్డర్ దానిని కొనసాగించలేకపోయింది. భారత్ కేవలం 41.4 ఓవర్లలోనే రెండు వికెట్లు మాత్రమే నష్టపోయి విజయాన్ని నమోదు చేసింది. వెస్టిండీస్ బౌలింగ్ విభాగం కూడా తేలిపోవడంతో టీమిండియా ఈ మేరకు సునాయాస విజయం సాధించింది. ఈ నేపథ్యంలో రెండో వన్డేను చేజిక్కించుకునేందుకు భారత్, సిరీస్ దక్కించుకునేందుకు వెస్టిండీస్ పట్టుదలతో బరిలోకి దిగనున్నాయి.



# రెపోరేట్లపై ఆర్బీఐ వేచిచూసే ధోరణి

### అక్టోబరు,డిసెంబరులోనే పెంపు?
### నోమురా బ్రోకరేజి సంస్థ అంచనాలు

**ముంబై, సెప్టెంబరు 29:** ద్రవ్యోల్బణం, ఆర్థిక వృద్ధికి సంబంధించిన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని భారతీయ రిజర్వ్ బ్యాంక్ మార్కెట్లు అంచనా వేస్తున్నంత స్థాయిలో దూకుడుగా వడ్డీ రేట్లను పెంచకపోవచ్చని అంతర్జాతీయ బ్రోకరేజ్ సంస్థ నోమురా పేర్కొంది. పరిమిత స్థాయిలో మాత్రమే ద్రవ్య విధానాన్ని కఠినతరం చేసే అవకాశం ఉందని తెలిపింది. ఆర్‌బీఐ ద్రవ్య విధానం ప్రస్తుతం కీలక దశలోఉందని పేర్కొంది. వచ్చే ఏడాది కాలంలో దాదాపు 125 బేసిస్ పాయింట్ల మేర రెపో రేటు పెంపును మార్కెట్లు ఇప్పటికే అంచనా వేస్తున్నాయని తెలిపింది. ఇంతటి భారీ రేట్ల పెంపు అవసరం లేకపోవచ్చని, విధానంలో అవసరమైన సర్దుబాట్లపైనే ఆర్‌బీఐ దృష్టి పెట్టే అవకాశం ఉందని అంచనా వేసింది.దేశంలో ట్రెండ్ ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టిందని, ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాలకు ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల విస్తరిస్తున్న సంకేతాలు కనిపించడం లేదని నోమురా తెలిపింది. మరోవైపు, నోమురా రూపొందించిన ముందస్తు సూచిక సమీప భవిష్యత్తులో ఆర్థిక వృద్ధి సాధారణ స్థాయి కంటే తక్కువగా ఉండే అవకాశాన్ని సూచిస్తోందని పేర్కొంది. వచ్చే ఆరు నెలల్లో ఆహారం, ఇంధన ధరల కారణంగా వినియోగదారుల ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉందని నోమురా అంచనా వేసింది. అదే సమయంలో ఈ ధరల ఒత్తిళ్ల చివరకు డిమాండ్‌పై ప్రభావం చూపవచ్చని, దీంతో ద్రవ్యోల్బణం మళ్లీ తగ్గుముఖం పట్టి ఆర్‌బీఐ నిర్దేశించిన లక్ష్యానికి చేరుకునే అవకాశం ఉందని తెలిపింది.2026-27 ఆర్థిక సంవత్సరంలో రిటైల్ ద్రవ్యోల్బణం 5.2 శాతంగా ఉండొచ్చని నోమురా అంచనా వేసింది. అనంతరం 2027-28లో ఆర్‌బీఐ నిర్దేశించిన 4 శాతం మధ్యకాలిక లక్ష్యానికి చేరువగా తగ్గే అవకాశం ఉందని పేర్కొంది. ఆర్‌బీఐ అక్టోబర్, డిసెంబర్ సమావేశాల్లో రెపో రేటును 25 బేసిస్ పాయింట్ల చొప్పున పెంచవచ్చని నోమురా అంచనా వేసింది. దీంతో తుది రెపో రేటు 5.75 శాతానికి చేరుకోవచ్చని తెలిపింది. ఆర్‌బీఐని రేట్ల పెంపు వైపు నడిపించే అవకాశం ఉన్నప్పటికీ, ఆహారం, ఇంధన రంగాలకే ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల పరిమితమై, ఆర్థిక వృద్ధి మందగిస్తే దీర్ఘకాలికంగా భారీ స్థాయిలో రేట్ల పెంపు అవసరం ఉండకపోవచ్చని నోమురా అభిప్రాయపడింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను పెంచిన నేపథ్యంలో ఆర్‌బీఐ కూడా రానున్న ఏడాది కాలంలో భారీ స్థాయిలో రెపో రేటును పెంచుతుందన్న మార్కెట్ అంచనాలు పెరిగిన నేపథ్యంలో నోమురా అంచనాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# రెండో రోజూ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు




**ముంబై, సెప్టెంబరు 29:** ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ గడువు ముగింపు రోజు నెలకొన్న తీవ్ర ఒడిదుడుకుల మధ్య దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో సెషన్‌లోనూ నష్టాలతో ముగిశాయి. ఇరాన్ యుద్ధం, శాంతి ఒప్పందంపై నెలకొన్న అనిశ్చితి, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల విక్రయాలు, రూపాయి బలహీనత, పెరుగుతున్న ముడి చమురు ధరలు, అమెరికా ట్రెజరీ రిటర్నులు అధిక స్థాయిలో ఉండటం వంటి అంశాలు మార్కెట్ సెంటిమెంట్‌పై ఒత్తిడిపెంచాయి. దీంతో చాలా వరకు రంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఐటీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఆటో షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించగా మెటల్, ఫార్మా షేర్లు లాభపడ్డాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 242.65 పాయింట్లు పతనమై 72,529.07 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 సూచీ 64.05 పాయింట్లు తగ్గి 22,716.20 వద్ద స్థిరపడింది. వరుసగా రెండు సెషన్లలో సెన్సెక్స్ 1.85 శాతం, నిఫ్టీ 1.83 శాతం చొప్పున నష్టపోయాయి.నిఫ్టీలో టైటాన్ కంపెనీ 3 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.30 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 0.75 శాతం చొప్పున పడిపోయి సూచీపై అధిక ఒత్తిడి తెచ్చాయి. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.74 శాతం, బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.49 శాతం చొప్పున క్షీణించాయి.ఎన్ఎస్ఈలో 1,529 షేర్లు లాభాల్లో ముగియగా, 2,038 షేర్లు నష్టాల్లో ముగిశాయి. మరో 112 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. బ్రెంట్ క్రూడ్ నవంబర్ 2026 ఫ్యూచర్స్ 25 సెంట్లు తగ్గి బ్యారెల్‌కు 105.03 డాలర్లకు చేరింది. అమెరికా 10 ఏళ్ల బాండ్ ఈల్డ్ 0.08 శాతం తగ్గి 5.241 శాతంగా నమోదైంది. భారత్ 10 ఏళ్ల బెంచ్‌మార్క్ ప్రభుత్వ బాండ్ ఈల్డ్ 0.14 శాతం తగ్గి 7.173 శాతానికి చేరింది. గత సెషన్‌లో ఇది 7.111 శాతంగా ఉంది. రూపాయి స్వల్పంగా బలపడింది. ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్‌తో పోలిస్తే రూపాయి స్వల్పంగా బలపడింది. పాక్షికంగా కన్వర్టబుల్ రూపాయి 95.9500 వద్ద ట్రేడవగా, గత సెషన్ ముగింపు 95.9700గా ఉంది. ఎంసీఎక్స్‌లో అక్టోబర్ 5, 2026 డెలివరీ బంగారం ఫ్యూచర్స్ 0.11 శాతం తగ్గి 10 గ్రాములకు రూ.1,46,645 వద్ద నమోదయ్యాయి. బీఎస్ఈలో వర్మోరా గ్రానిటో షేర్ రూ.152.80 వద్ద ట్రేడైంది. ఇది ఇష్యూ ధర రూ.148తో పోలిస్తే 3.24 శాతం ప్రీమియం. షేర్ బీఎస్ఈలో రూ.152 వద్ద లిస్ట్ అయింది. ఇష్యూ ధరతో పోలిస్తే ఇది 2.7 శాతం ప్రీమియం. ఇంట్రాడేలో రూ.163.45 గరిష్ఠాన్ని, రూ.148 కనిష్ఠాన్ని తాకింది. బీఎస్ఈలో కంపెనీకి చెందిన 56.73 లక్షలకు పైగా షేర్లు చేతులు మారాయి.స్టాక్ స్పాట్‌లైట్ ఫిన్‌టెక్: మంగళవారం పీబీ ఫిన్‌టెక్ షేర్ 6.11 శాతం క్షీణించి రూ.1,081కు చేరింది. దీంతో వరుసగా నాలుగు ట్రేడింగ్ సెషన్లలో ఈ షేర్ 42.69 శాతం నష్టపోయింది. బీమా పంపిణీ రంగ ఆర్థిక విధానంలో మార్పులకు ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రతిపాదించిన సంస్కరణల నేపథ్యం లో ఈ షేర్‌పై ఒత్తిడి కొనసాగుతోంది.రేసెస్ ఆఫ్ బిలీఫ్ షేర్ 13.27 శాతం దూసుకెళ్లింది. ఆజాద్ ఇంజినీరింగ్ సంస్థ జీఈ వెర్నోవా గ్యాస్ పవర్ వ్యాపారం కోసం రెండు ప్రత్యేక లీన్ మ్యానుఫ్యాక్చరింగ్ కేంద్రాలను ప్రారంభించినట్లు కంపెనీ ప్రకటించడంతో షేర్ 7.04 శాతం పెరిగింది. కొత్తగాఏర్పాటు చేసిన రెండు కేంద్రాలు ఒక్కొక్కటి7,600 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్నాయి.

# అమెరికాలో ఎస్సార్‌గ్రూప్ రూ.1.4 కోట్ల పెట్టుబడి

### అయోవాలో భారీ స్టీల్ ప్లాంట్ నిర్మాణం



**వాషింగ్టన్, సెప్టెంబరు 29:** అమెరికా చరిత్రలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రాజెక్టుగా భారీ ఉక్కు కర్మాగారానికి ఆమోదం లభించింది. భారత్‌కు చెందిన ప్రముఖ ఎస్సార్ గ్రూప్ యాజమాన్యంలోని మెసాబి మెటాలిక్స్ కంపెనీ, అమెరికాలోని అయోవా రాష్ట్రంలో 15 బిలియన్ డాలర్ల సుమారు రూ. 1.4 లక్షల కోట్లు భారీ వ్యయంతో స్టీల్ ప్లాంట్‌ను నిర్మించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా ప్రకటించారు. ఇది అమెరికా చరిత్రలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్‌గా నిలవనుందని వైట్‌హౌస్ పేర్కొంది. వైట్‌హౌస్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ట్రంప్ ఈ కీలక ప్రకటన చేశారు. ఈ సమావేశంలో మెసాబి మెటాలిక్స్ ఛైర్మన్ రేవంత్ రుయా, ఎస్సార్ గ్రూప్ సహ వ్యవస్థాపకుడు రవి రుయాతో పాటు ఇతర కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ, ఈ ప్లాంట్ అత్యంత అధునాతన టెక్నాలజీతో, నాణ్యమైన స్టీల్‌ను అందుబాటు ధరలలో ఉత్పత్తి చేస్తుందని తెలిపారు. ముడిసరుకు సేకరణ నుంచి ఉక్కు ఉత్పత్తి వరకు పూర్తిగా అమెరికాలోనే జరిగేలా ఒక సమీకృత సరఫరా వ్యవస్థను ఈ ప్రాజెక్ట్ ఏర్పాటు చేస్తుందని వివరించారు. ఈ భారీ స్టీల్ ప్లాంట్‌ను అయోవా రాష్ట్రంలోని లీ కౌంటీలో ఏర్పాటు చేయనున్నారు. దీనికి అవసరమైన ముడి ఇనుమును మిన్నెసోటాలోని నాష్‌వాక్‌లో కొత్తగా అభివృద్ధి చేసిన గని నుంచి సేకరిస్తారు. గత 50 ఏళ్లలో అమెరికాలో ఏర్పాటైన మొట్టమొదటి కొత్త ఇనుప ఖనిజం గని ఇదే కావడం విశేషం.

మిన్నెసోటాలోని ఈ గని ప్రాజెక్టుపై ఎస్సార్ గ్రూప్ ఇప్పటికే 2.5 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడి పెట్టింది. గని, స్టీల్ ప్లాంట్‌లను కలిపి ఈ మొత్తం ప్రాజెక్ట్ విలువ సుమారు 18 బిలియన్ డాలర్లకు చేరుకుంటుంది. 2030 నాటికి ఉక్కు ఉత్పత్తిని ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్న ఈ ప్లాంట్, తొలి దశలో ఏటా 7.5 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. భవిష్యత్తులో దీనిని 10 మిలియన్ టన్నులకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా అమెరికాలో భారీగా ఉద్యోగాల కల్పన జరగనుంది. నిర్మాణ దశలో సుమారు 6,000 మందికి, ప్లాంట్ కార్యకలాపాలు మొదలయ్యాక 1,750 మందికి శాశ్వత ఉత్పాదక ఉద్యోగాలు లభిస్తాయి. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం, కార్యకలాపాల మొదటి దశాబ్దంలో అమెరికా ఆర్థిక వ్యవస్థపై సుమారు 95 బిలియన్ డాలర్ల సానుకూల ప్రభావం చూపుతుందని వైట్‌హౌస్ అంచనా వేసింది. దిగుమతి చేసుకునే ఉక్కుపై తన ప్రభుత్వం విధించిన అధిక సుంకాల (టారిఫ్‌లు) వల్లే కంపెనీలు అమెరికాలో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు ముందుకొస్తున్నాయని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ ప్లాంట్‌తో గని నుంచి ఉక్కు తయారీ వరకు 100 శాతం అమెరికన్ సరఫరా వ్యవస్థ పూర్తవుతుందని మెసాబి మెటాలిక్స్ పేర్కొంది.



### అదానీకి సెబీ నుంచి ఊరట
# రూ.1.48 కోట్లకు సెటిల్‌మెంట్

**ముంబయి, సెప్టెంబరు 29:** అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీకి మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నుంచి ఊరట లభించింది. కనీస పబ్లిక్ షేర్‌హోల్డింగ్ నిబంధనల ఉల్లంఘన ఆరోపణలపై అదానీ గ్రూప్‌నకు చెందిన నాలుగు కం పెనీలపై చేపట్టిన చర్యలను సెబీ ముగించింది. ఈ కేసు పరిష్కారం కోసం గౌతమ్ అదానీ సహ మొత్తం 18 మంది రూ.1.48 కోట్ల సెటి ల్‌మెంట్ మొత్తాన్ని చెల్లించారు. అదానీ గ్రూప్ లోని కొన్ని కంపెనీలు కనీస పబ్లిక్ షేర్‌హోల్డింగ్ నిబంధనలను పాటించడం లేదంటూ 2020 జూన్, జులై నెలల్లో సెబీకి ఫిర్యాదులు అం దాయి. వీటిపై ప్రాథమిక విచారణ చేపట్టిన సెబీ అదే ఏడాది అక్టోబర్ 23న పూర్తిస్థాయి దర్యాప్తు ప్రారంభించింది. దర్యాప్తు పూర్తయిన తర్వాత 2024 సెప్టెంబర్ 27న సెబీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. 2025 మార్చి 3న మరో అను బంధ నోటీసు ఇచ్చింది. కనీస పబ్లిక్ షేర్‌హో ల్డింగ్ నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి ఈ నోటీసులు జారీ అయ్యాయి. అదానీ ఎం టర్‌ప్రైజెస్, అదానీ పవర్, అదానీ పోర్ట్స్, అదానీ ట్రాన్స్‌మిషన్ కంపెనీలు ఈ కేసులో ఉన్నాయి. ఈ వ్యవహారాన్ని పరిష్కరించుకునేం దుకు సం బంధిత వ్యక్తులు సెబీకి ప్రతిపాదన పంపారు. ఆరోపణలను అంగీకరించకుండా, తిరస్కరిం చకుండా కేసును ముగించుకునేందుకు అంగీకరిం చారు. ఈక్రమంలో మొత్తం రూ. 1.48 కోట్లను సెటిల్‌మెంట్ కింద చెల్లించారు. దీంతో గౌతమ్ అదానీ, నాలుగు కంపెనీలు, మరో 13 మందిపై కొనసాగుతున్న చర్యలను ముగిస్తున్నట్లు సెబీ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

# బ్యాంకులకు 16 రోజులు సెలవులు

**ముంబయి, సెప్టెంబరు 29:** దేశవ్యాప్తంగా అక్టోబరులో వివిధ రాష్ట్రాల వారీగా బ్యాంకులకు మొత్తం 16 రోజులు సెలవులు వస్తున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన జాబితా ప్రకారం అక్టోబర్ 2026 నెలలో బ్యాంకులకు సాధారణ సెలవులతో కలిపి మొత్తంగా 16 సెలవులు ఉన్నాయి. ఇది రాష్ట్రాల వారీగా మారుతుంది. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా అక్టోబరు 2 బ్యాంకులకు నేషనల్ హాలీడే ఉంటుంది. మహాలయ అమావాస్య సందర్భంగా కర్ణాటక, పశ్చిమ బెంగాల్‌లో 10వ తేదీ బ్యాంకులకు సెలవు ఉంటుంది.మహా సప్తమి ఫెస్టివల్ సందర్భంగా త్రిపురలో 17వ తేదీ బ్యాంకులు మూసి ఉంటాయి. దసరా, మహా నవమి, ఆయుధ పూజ, దుర్గ పూజ, విజయ దశమి, దుర్గాష్టమి వంటి పండగల నేపథ్యంలో దేశంలోని త్రిపుర, మిజోరాం, ఒడిశా, తమిళనాడు, అసోం, మణిపూర్, అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్, వెస్ట్ బెంగాల్, బిహార్, జార్ఖండ్, మేఘలయలో బ్యాంకులకు సెలవు ఉంటుంది. దసరా, దుర్గపూజ, విజయ దశమి సందర్భంగా మణిపూర్, సిక్కిం మినహా దాదాపు అన్ని రాష్ట్రాల్లో సెలవు ఉంటుంది. 21వ తేదీ త్రిపుర, కర్ణాటక, సిక్కి, అసోం, కేరళ, వెస్ట్ బెంగాల్ లో దుర్గ పూజ, విజయ దశమి సందర్భంగా సెలవు ఉంటుంది. 22వ తేదీ సిక్కింలో దుర్గ పూజ సందర్భంగా సెలవు ఉంటుంది. 23వ తేదీ సిక్కింలో దుర్గ పూజ సందర్భంగా బ్యాంకులకు సెలవు ఉంటుంది. అక్టోబర్ 26వ తేదీ మహా రుషి వాల్మీకి జయంతి, లక్ష్మీ పూజ సందర్భంగా త్రిపుర, చండీగఢ్, జమ్మూ కశ్మీర్, శ్రీనగర్, హిమాచల్ ప్రదేశ్ వంటి ప్రాంతాల్లో బ్యాంకులు మూసి ఉంటాయి. 29వ తేదీ కర్వా చౌత్ సందర్భంగా హిమాచల్ ప్రదేశ్‌లో బ్యాంకులు మూసి ఉంటాయి. 31వ తేదీ సర్దార్ వల్లాభ్ భాయ్ పటేల్ జయంతి సందర్భంగా గుజరాత్‌లో బ్యాంకులకు హాలీడే ఉంటుంది. వీటితో పాటుగా ఆదివారాలు, నెలలో రెండో,నాలుగో శనివారాలు బ్యాంకులకు సాధారణ సెలవు ఉంటుంది. బ్యాంకులు మూసిఉన్నా నెట్ బ్యాంకింగ్,యూపీఐ, మొబైల్ బ్యాంకింగ్ వంటి సేవలు అం దుబాటులో ఉంటాయి.

# ఒకటో తేదీ వస్తోంది..మార్పులున్నాయి జాగ్రత్త..

**ముంబయి, సెప్టెంబరు 29:** పండగల సందడితో పాటు మన జేబులపై ప్రభావం చూపే కొన్ని ముఖ్యమైన మార్పులు అక్టోబరు ఒకటినుంచే అమల్లోకి రాబోతున్నాయి. బ్యాంకింగ్, స్మాల్ సేవింగ్స్, గ్యాస్ సిలిండర్, ఐటీఆర్ మాత్రమే కాదు పండగకి కొత్త కార్లు లేదా టీవీ, ఏసీలు కొందామనుకునే వారికి కూడా ఈ మార్పులు అవసరమే.పీపీఎఫ్, ఎన్ఎస్‌సీ, సుకన్య సమృద్ధి యోజన, సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్, పోస్టాఫీస్ డిపాజిట్లపై ఇచ్చే వడ్డీ రేట్లను ప్రభుత్వం ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్షిస్తుంది. అక్టోబర్ డిసెంబర్ కాలానికి గాను కొత్త వడ్డీ రేట్లను ప్రకటించనున్నారు. ఇక ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ సమావేశం అక్టోబర్ 5 నుంచి 7 వరకు జరగనుంది. చివరి రోజైన అక్టోబర్ 7న రెపో రేటుపై ప్రకటన వెలువడుతుంది. ప్రస్తుతం రెపో రేటు 5.25 శాతంగా ఉంది. ఎస్‌బీఐ రీసెర్చ్ అంచనా ప్రకారం ఈసారి రెపో రేటును 0.25 శాతం పెంచే అవకాశం ఉంది. ఒకవేళ ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకుంటే రాబోయే రోజుల్లో బ్యాంక్ లోన్లు, ఎఫ్‌డీలపై వడ్డీ రేట్లలో మార్పులు వచ్చే అవకాశం ఉంటుంది. అలాగే ఎస్‌బీఐ శాలరీ ప్యాకేజ్ అకౌంట్ వాడుతున్న వారికి అక్టోబర్ 1 నుంచి ఒక కీలక మార్పురాబోతోంది.ఇప్పటివరకు వేరే బ్యాంక్ ఏటీఎంలు లేదా ఏడీడబ్ల్యూఎంల నుంచి నెలకు 10 సార్లు ఉచితంగా క్యాష్ తీసుకునే వెసులుబాటు ఉండగా, దాన్ని ఇప్పుడు 5 సార్లకు తగ్గించారు.




Creative Visualisation. Images used are for illustration purposes only. | Applicable T&C available at the dealership. | **As certified by Kantar IMRB for an OEM platform for end-to-end usage as on November 28, 2025. | #543 km range: Certified range; actual results may vary by driving conditions and usage. | Assured buyback plan is available on payment basis with the option of 3 years/45 000 km or 4 years/60 000 km ownership plans (whichever is earlier). The program is offered through an insurance company. e VITARA comes with standard warranty of 3 years/1 00 000 km (whichever is earlier) with an option of extending the same on payment basis to 5 years/1 40 000 km and service activated coverage for 6th to 8th year for EV related components. Offers are subject to availability of stock, and valid till limited period.


Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.